

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 20-7-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 112 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: దశమి మ.12.13 తదుపరి ఏకాదశి; నక్షత్రం: కృత్తిక రా.10.53 తదుపరి రోహిణి, వర్జ్యం: ఉ.11.45-1.14; దుర్ముహూర్తం: సా.5.05-5.57; అమృతఘడియలు: రా.8.39-10.08, రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.54; సూర్యాస్తమయం: 6.48 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శృంగారం.. వయాగ్ర మాత్ర

సెక్స్‌లో విఫలమవుతున్న పురుషులకు స్వల్ప మోతాదులో సూచిస్తున్న వైద్యులు



ఏ లోపం లేకున్నా శృంగారంలో వైఫల్యం.. 'పర్ఫార్మెన్స్ యాంగ్జైటీ డిజార్డర్'తోనే..

ఎక్కువసేపు శృంగారానికి తహతహ

ఈ ఒత్తిడితో అంగ స్తంభన, శీఘ్రస్కలన సమస్యలు

ఆందోళనతో వైద్యుల వద్దకు.. స్వల్ప మోతాదులో వయాగ్రా మేలంటున్న వైద్యులు

ఇదంతా విశ్వాసం పెంచేందుకు మాత్రమే..

అదే సమయంలో కౌన్సిలింగ్‌తో అవగాహన

నెలా, రెండు నెలలు ఓకే.. అంతకు మించి వినియోగిస్తే ఇబ్బంది తలెత్తుతుందని హెచ్చరిక

10

హైదరాబాద్‌లో కొత్తగా పెళ్లయిన ఓ అమ్మాయి భర్త నుంచి విడాకులకు సిద్ధమైంది. భర్త శృంగారంలో పాల్గొనడం లేదని, అతనికి ఆ సామర్థ్యం లేదంటూ సర్టిఫికెట్ ఇవ్వాలని వైద్యుడిని సంప్రదించింది. వైద్యుడు ఆమె భర్తకు పరీక్షలన్నీ చేసి పర్ఫార్మెన్స్ యాంగ్జైటీతో అంగ స్తంభన సమస్య తలెత్తిందని గుర్తించి.. పీనైల్ రింగ్ (అంగ స్తంభన సమయంలో రక్తం త్వరగా వెనక్కివెళ్లి మెత్తబడిపోకుండా ఆపే రింగ్) వాడాలని సలహా ఇచ్చారు. అలాగే 2 నెలల పాటు స్వల్ప మోతాదులో వయాగ్రా వాడాలని సూచించారు. కొన్నాళ్లకు ఆ జంట వైద్యుడిని కలిసి తాము సంతోషంగా ఉన్నామని చెప్పారు.

అరబెల్లా సమాధి వద్ద పీటర్ ఏర్పాటు చేసిన శిలాఫలకం





అరబెల్లా సమాధి ప్రాంగణం ఉన్న బందరు తాజ్‌మహల్

లవ్‌స్టోరీ @ 1800

నేటికీ సాక్షిగా 'బందరు తాజ్‌మహల్'.. ఓ ఆంగ్లేయ జంట ప్రేమకు చిహ్నం

పీటర్, అరబెల్లా అపురూప ప్రేమగాథ.. పెళ్లి దాకా చేరకుండానే విషాదాంతం

ప్రియురాలికి గుర్తుగా బందరు మహల్

ఇప్పటికీ గాజు పెట్టెలో పదిలంగా అరబెల్లా భౌతికకాయం

14

కమల దళంలో కలకలం

- చర్చనీయాంశమైన ఈటల వ్యవహారం
- రాజేందర్ వ్యాఖ్యలపై జాతీయ నాయకత్వం ఆరా!
- క్లిప్పింగులతో నివేదిక పంపించిన రాష్ట్ర బీజేపీ
- ఈటల పార్టీ లైన్ దాటారంటున్న పార్టీ వర్గాలు
- సొంత పార్టీ నేతను దూషించడంపై అభ్యంతరాలు

హైదరాబాద్/హుజూరాబాద్, జులై 19 (ఆంధ్రజ్యోతి): కమలదళంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత పోరు ఒక్కసారిగా రచ్చకెక్కింది. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై బహిరంగంగా తీవ్ర పదజాలంతో చేసిన విమర్శలు పార్టీలో కలకలం సృష్టించాయి. బీజేపీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఉద్యమనేతగా, విశేష రాజకీయ అనుభవం ఉన్న నేతగా గుర్తింపు ఉన్న ఈటల.. ఏ లక్ష్యంతో సంజయ్‌పై బహిరంగంగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారన్న అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. శామీర్‌పేటలో జరిగింది అసమ్మతి సమావేశమా? లేక కీలక పదవి కోసం జాతీయ

మిగతా 11వ పేజీలో...

బీ కేర్‌ఫుల్.. కొడకా!

వాడు సైకోనా.. శాడిస్టా?.. పశువా?

ఎవని అండతో ధైర్యం చేస్తున్నాడు?

కేంద్రమంత్రి బండిపై పరోక్షంగా..

ఎంపీ ఈటల సంచలన వ్యాఖ్యలు

ధీరులతో కొట్లాడుతా..

కుట్రలు చేసే వారితో కాదు..

హుజూరాబాద్ కార్యకర్తలతో ఈటల

11

ఈటల వ్యాఖ్యలపై స్పందించొద్దు

సోషల్ మీడియాలో ఎవరూ పోస్టులు పెట్టొద్దు

అధిష్ఠానం చూసుకుంటది

స్థానిక ఎన్నికలపై దృష్టిపెట్టండి

బీజేపీ నేతలకు బండి సూచన



కులగణనను అధ్యయన నివేదికను సీఎం రేవంత్‌కు అందజేస్తున్న స్వతంత్ర నిపుణుల కమిటీ. చిత్రంలో డిప్యూటీ సీఎం, మంత్రులు

కులగణన డేటాతో సంక్షేమం

అర్హులైన వారందరికీ పథకాలు ఇచ్చేందుకు వాడతాం

ఈ డేటా సామాజికంగా తెలంగాణ ఆరోగ్య పరిస్థితిని తెలియజెప్పే మెగా హెల్త్ రిపోర్టు

కులగణన అధ్యయన నివేదికపై సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన నిపుణుల కమిటీ

క్యాబినెట్‌లో చర్చించి ఈ నెలాఖరులో విడుదల.. ఆయా రంగాల్లో ప్రాతినిధ్యంపై మంత్రులకు ప్రజెంటేషన్

నివేదికలో 242 కులాల వెనుకబాటుతనంపై ర్యాంకింగ్!

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కులగణన వివరాలను అధ్యయనం చేసి స్వతంత్ర నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది కేవలం గణాంక సమాచారం కాదని, సామాజికంగా తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య పరిస్థితిని తెలియజెప్పే మెగా హెల్త్ చెకప్ నివేదిక అని వ్యాఖ్యానించారు. తమ నాయకుడు రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కులగణనను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. రాష్ట్రంలోని బలహీన వర్గాల అభ్యున్నతికి ఈ నివేదిక ఉపయోగపడుతుందన్నారు. ఆయా వర్గాల స్థితిగతుల విషయంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలకు కారణాలను కూడా అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా ఆయన నిపుణుల కమిటీని కోరారు. ప్రజల అవసరాలను గుర్తించి సరైన సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కులగణన గణాంకాలను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ

మిగతా 13వ పేజీలో...

రూ.500 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో డాజన్ విస్తరణపై సీఎం హర్షం

13

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

జస్టిస్ ఏకే సింగ్

గవర్నర్ సమక్షంలో దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం

సీఎం రేవంత్, పలువురు మంత్రులు హాజరు



జస్టిస్ ఏకే సింగ్‌ను అభినందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జస్టిస్ అపరేశ్‌తో ప్రమాణం చేయించారు. జస్టిస్ ఏకే సింగ్ దైవసాక్షిగా ప్రమాణం చేశారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డిలు హైకోర్టు సీజేకు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డీజీపీ జితేందర్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హైకోర్టు న్యాయమూర్తులు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జస్టిస్ సింగ్ త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

మిగతా 13వ పేజీలో...

రాష్ట్రపతి సందేహాలపై 22న సుప్రీం విచారణ

బిల్లుల ఆమోదంపై కోర్టులు గడువు విధించవచ్చా?

రాష్ట్రపతి సంధించిన 14 ప్రశ్నలపై విచారణ

2

ఏపీ 'మద్యం' చార్జిషీట్‌లో జగన్!

అభియోగ పత్రంలో పలుచోట్ల ప్రస్తావన

రూ.3,200కోట్ల స్కామ్‌పై తొలి చార్జిషీట్

చార్జిషీట్‌లో మిథున్‌రెడ్డి పేరూ!

కనిపించని ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప పేర్లు

తదుపరి చార్జిషీట్లో చేరుస్తామంటున్న సిట్

20 రోజుల్లో మరో చార్జిషీట్‌కు అవకాశం

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో తొలి చార్జిషీటు దాఖలైంది. పలు కోణాల్లో దర్యాప్తు జరిపి.. అనేక సాంకేతిక, ఇతర ఆధారాలు సేకరించిన 'సిట్'... శనివారం విజయవాడ ఏసీబీ కోర్టులో ప్రాథమిక చార్జిషీటు దాఖలు చేసింది. ఈ కుంభకోణంలో 'అంతిమ లబ్ధిదారు' ఎవరనేది తేల్చే దిశగా వేగంగా దర్యాప్తు సాగిస్తున్న సిట్ అధికారులు.. చార్జిషీట్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేరును పలుచోట్ల ప్రస్తావించినట్లు తెలిసింది. ఎవరి ఆదేశాలతో మద్యం

మిగతా 3వ పేజీలో...



మిథున్ అరెస్ట్

ఏపీ మద్యం స్కామ్‌లో ఆయనే మాస్టర్ మైండ్

3

సిట్ ముందు విచారణకు హాజరు

ఐదు గంటలపాటు ప్రశ్నల వర్షం

రాత్రి 8 గంటలకు అరెస్టు చేసిన 'సిట్'.. నేడు కోర్టులో హాజరు

కాజీపేటలో మెట్రో బోగీలు

వచ్చే మార్చి నాటికి రూ.521 కోట్లతో తయారీ కేంద్రం ప్రారంభం



కాచీగూడ నుంచి జోధ్‌పూర్‌కు రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్‌రెడ్డి

- బహుళ రైల్వే ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- ఇంజన్లు, బోగీలు, వ్యాగన్లు తయారు చేస్తాం
- పరిశీలనలో వందే భారత్ కోచ్‌ల తయారీ
- చిరకాల స్వప్నాన్ని సాకారం చేసింది మోదీయే
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్
- ప్రత్యక్షంగా 3 వేల మందికి ఉద్యోగాలు: కిషన్‌రెడ్డి

వరంగల్/కంది/హైదరాబాద్ సిటీ/బర్కత్‌పుర, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ప్రజల చిరకాల కలను నెరవేరుస్తూ ప్రధాని నరేంద్ర మోదీ కాజీపేటలో బహుళ రైల్వే ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే మ్యానుఫాక్చరింగ్ యూనిట్‌ను మరో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైష్ణవ్ మాట్లాడుతూ, రూ.521 కోట్లతో నిర్మిస్తున్న ఈ ఫ్యాక్టరీలో 2026 మార్చి నాటికి ఉత్పత్తి మొదలవుతుందని చెప్పారు. కాజీపేట యూనిట్‌ను కేవలం రైల్వే కోచ్‌ల తయారీకి మాత్రమే పరిమితం చేయబోవడం లేదని ప్రకటించారు. ఇక్కడ మెట్రో రైళ్ల బోగీలను కూడా

మిగతా 13వ పేజీలో...



'పదేళ్లు నేనే సీఎంను' అనడం

కాంగ్రెస్ విధానాలకు

వ్యతిరేకం

13

నిఖార్సయిన కాంగ్రెస్ కార్యకర్తలు సహించరు

'ఎక్స్'లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్య

భారత్-పాక్ ఘర్షణలో..

5 యుద్ధ విమానాలు కూలిపోయాయి

2

మరోమారు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఆధార్‌లో సమూల మార్పులు!

2

వివరాల్లోంచి తండ్రి/భర్త పేరు తొలగింపు

పుట్టిన తేదీ బదులు సంవత్సరం మాత్రమే!

యూఐడీఏఐ ఉత్తర్వులు.. ఇప్పటికే అమల్లోకి

పలు జిల్లాల్లో మోస్తరు వర్షం

హైదరాబాద్‌లో జలమయమైన రోడ్లు

ఉప్పల్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్

పిడుగుపాటుకు ఇద్దరి దుర్మరణం

14

పాలమూరు, కొత్తగూడెం జిల్లాల్లో ఘటనలు

నేడు, రేపు భారీ వర్షాలు: వాతావరణ శాఖ

వైద్యశాఖలో చిరుద్యోగులకు షాక్

ఎన్‌హెచ్‌ఎమ్ సిబ్బంది జీతాల్లో భారీ కోత

11

సుమారు 10 వేల మందికి వేతనాలు కట్

ఒక్కొక్కరికి రూ.7-9 వేల వరకు తగ్గింపు

అంతా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందే



రేపటి నుంచి పార్లమెంటు

వర్షాకాల సమావేశాలు

ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి

ఉభయసభల్లో వాడీవేడిగా చర్చలకు అవకాశం

ప్రతిపక్షాలకు ఆయుధంగా డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు

నేడు అఖిలపక్ష సమావేశం

2

బ్రాహ్మణ మహిళను ఇస్లాంలోకి తెస్తే రూ.16 లక్షలు


- సిక్కు, క్షత్రియులైతే 12 లక్షలు, ఓబీసీ అయితే 10లక్షలు
- యూపీలో బయటపడ్డ అక్రమ మతమార్పిళ్ల రాకెట్
- ఛంగూర్ బాబా, అతని అనుచరుల అరెస్టు
- ఆరెస్సెస్ సీనియర్ కార్యకర్తనని చెప్పుకొన్న ఛంగూర్ బాబా

న్యూఢిల్లీ, జూలై 19: పేదలు, నిస్సహాయులు, వెనుకబడిన వర్గాలకు చెందిన వారు, వితంతవులు, కష్టాల్లో ఉన్న వారు. మరీ ముఖ్యంగా హిందూ మహిళలు, మైనర్ బాలికలే లక్ష్యం.. ప్రేమ పేరుతోనో, మరో మార్గంలోనో వారికి దగ్గరవ్వడం.. భయపెట్టో, బెదిరించో, బ్రెయిన్ వాష్ చేసో.. ఏదో ఒక మార్గంలో వారిని ఇస్లాంలోకి మారేలా చేయడం.. ఇదీ అక్రమ మతమార్పిళ్ల వ్యవహారంలో అరెస్టయిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఛంగూర్ బాబా అలియాస్ జమాలుద్దీన్ అలియాస్ పీర్ బాబా చీకటి దందా. బ్రాహ్మణ మహిళని మతం మారిస్తే ఇంత ? వితంతువు అయితే ఇంత ? అని రేటు పెట్టి తన అనుచరులకు పెద్ద మొత్తంలో డబ్బు ఎర వేసి ఛంగూర్ బాబా వారితో మతమార్పిళ్లు చేయించేవాడు. ఒకప్పుడు సైకిల్‌పై తిరుగుతూ తాయత్తులు అమ్ముకున్న ఛంగూర్ బాబా ఈ అక్రమ మత మార్పిళ్ల దందాతో కోట్లకు పడగలెత్తాడు. అంతేనా, తన దందా గుట్టు బయటపడకూడదని ఆరెస్సెస్ పేరును వాడేశాడు. అధికారులు, రాజకీయ నాయకులు, ప్రముఖులను కలిసినప్పుడు తానో ఆరెస్సెస్ సీనియర్ కార్యకర్తనని, నాగ్‌పూర్ కేంద్రంగా ఉన్న భారత్ ప్రతికార్త్ సేవా సంఘ్ అవధ్ విభాగం ప్రధాన కార్యదర్శినని చెప్పుకొనేవాడు. తన లెటర్‌హెడ్‌లపై ప్రధాని మోదీ ఫొటో కూడా ముద్రించాడు. **కాగా,** యూపీలోని బలరాంపూర్ జిల్లాలో అక్రమ మతమార్పిళ్ల రాకెట్‌ను ఛేదించిన ఆ రాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ పోలీసులు ఛంగూర్ బాబా, అతని అనుచరులను


ఛంగూర్ బాబా

జూలై 6న అరెస్టు చేశారు. మతమార్పిళ్ల కోసం తన అనుచరులకు ఛంగూర్ భారీగా నజరానాలు ఇచ్చినట్టు పోలీసులు విచారణలో గుర్తించారు. బ్రాహ్మణ మహిళలను ఇస్లాం మతంలోకి మారిస్తే రూ.16 లక్షలు, సిక్కు, క్షత్రియ మహిళలను మారిస్తే రూ.12లక్షలు, ఓబీసీ మహిళలను ఇస్లాంలోకి మారిస్తే రూ.10లక్షలు చొప్పున నజరానాలు ఇచ్చేవాడు. ఈ వ్యవహారంపై ఈడీ కూడా దృష్టి సారించింది. ఛంగూర్‌కు ఇంత డబ్బు ఎలా వచ్చిందని ఆరా తీయగా ఇస్లామిక్ దేశాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు ఛంగూర్ అతని అనుచరులకు అందినట్టు కనుగొన్నారు. 40 బ్యాంకు ఖాతాల ద్వారా రూ.106 కోట్లు అక్రమంగా సంపాదించినట్టు గుర్తించారు. ఒకప్పుడు రెహ్రా మాఫీ అనే గ్రామ సర్పంచ్‌గా పని చేసిన ఛంగూర్.. ఆ గ్రామ శివారులోని దర్గా పక్కన నిబంధనలకు విరుద్ధంగా 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ భవంతిని కట్టాడు. అధికారులు దాన్ని కూల్చివేశారు. ఇక, విదేశాల నుంచి అందిన సొమ్ముతో ఛంగూర్ ఉగ్రవాద శిక్షణ కేంద్రాన్ని కూడా నడిపినట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడం గమనార్హం.

లోకం తీరు



మమత, హిమంత మాటల యుద్ధం




న్యూఢిల్లీ, జూలై 19: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మల మధ్య శనివారం మాటల మంటలు చెలరేగాయి. బెంగాలీ మాట్లాడేవారి పట్ల అస్సాంలో వివక్ష చూపుతున్నారని, బీజేపీ ప్రభుత్వం విభజన అజెండాను అమలు చేస్తోందని మమత విమర్శలు గుప్పించగా.. తమ సొంత ప్రజలపై తాము యుద్ధం చేయబోమని హిమంత అన్నారు. కానీ, అడ్డుఅదుపు లేని ముస్లింల చొరబాట్లను అడ్డుకుంటున్నామని చెప్పారు. సరిహద్దు రాష్ట్రం నుంచి పెరుగుతున్న చొరబాట్ల కారణంగా అస్సాంలో జనాభా లెక్కతప్పుతోందన్నారు. అస్సాంలోని అనేక జిల్లాల్లో హిందువులు మైనారిటీలుగా మారే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. తొలుత ఎన్నార్సీకి వ్యతిరేకంగా బెంగాల్‌లోని సిలిగుడిలో శనివారం అధికార టీఎంసీ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టీటీయూసీ చేపట్టిన నిరసనను ఉద్దేశించి సీఎం మమత స్పందించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే పౌరులపై దాడులు జరుగుతున్నాయని, అస్సాంలో బెంగాలీ మాట్లాడేవాళ్లను వేధిస్తే ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుందని అన్నారు. మమత ఆరోపణలపై హిమంత కూడా అంతే వేగంగా స్పందించారు. సుదీర్ఘకాలంగా తమ రాష్ట్రం భాష, సంస్కృతుల పట్ల సామరస్యంగా మెలుగుతోందని తెలిపారు. కానీ, సరిహద్దులు, రాష్ట్ర సంస్కృతిని కాపాడుకునే విషయంలో మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ రాజీపడేది లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగం, జనాభా అంశాలను మమత రాజకీయం చేస్తూ బెంగాల్ భవిష్యత్తుతో రాజీపడుతున్నారని ఆయన దుయ్యబట్టారు.

మరాఠీ రాకపోతే చెంపదెబ్బలే: రాజ్ ఠాక్రే

ముంబై, జూలై 19: తమ రాష్ట్రంలో ఉంటూ మరాఠీ భాష రాని స్థానికేతరులకు మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే తాజాగా మరో వార్నింగ్ ఇచ్చారు. మరాఠీని అర్థం చేసుకోలేని వాళ్లకు గట్టి చెంపదెబ్బ తప్పదన్నారు. నేరుగా చెవిలో మాట్లాడినా మరాఠీని అర్థం చేసుకోలేకపోతే ఆ చెవి కిందే చెంప చెళ్లుమంటుందని ఆయన అన్నారు. ఇటీవల ముంబైలో మరాఠీ మాట్లాడని ఓ వ్యాపారస్తుడిపై తమ పార్టీ కార్యకర్తలు దాడి చేయడాన్ని ఆయన సమర్థించారు. మీరా భయందర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ "ఆ వ్యాపారస్తుడి వైఖరి కారణంగానే అతడిపై దాడి జరిగింది. మిగతా వ్యాపారస్తులు షాపులు మూసివేతకు పిలుపునిచ్చారు. ఎంత కాలం మూసి ఉంచుతారు? అసలు మేం కొనకపోతే వారి పరిస్థితి ఏంటి? ఇక్కడకు వచ్చిన మీరంతా బుద్ధిగా పనిచేసుకోండి. మూర్ఖంగా ప్రవర్తిస్తే చెంపదెబ్బ గ్యారంటీ" అన్నారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర సీఎంపైనా విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర స్కూళ్లలో 1-5వ తరగతి వరకు హిందీని తప్పనిసరి చేస్తే తమ పార్టీ ఆ స్కూళ్లను మూసివేస్తుందని హెచ్చరించారు.

బిహార్‌లో 15% మంది ఓటర్లను తొలగించే ముప్పు

- తేజస్వీ యాదవ్ ఆరోపణ.. 35 మంది నేతలకు లేఖలు

పట్నా, జూలై 19: ఎన్నికల కమిషన్ బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కారణంగా 15% మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించే ముప్పు ఉందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా తాను చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ శనివారం రాహుల్ గాంధీ సహా దేశంలోని 35 మంది సీనియర్ ప్రతిపక్ష నాయకులకు లేఖలు రాశారు. బీజేపీ ప్రభుత్వ ఒత్తిడి మేరకు జరుగుతున్న ఈ ప్రత్యేక సవరణ ప్రజల ఓటింగ్ హక్కులు, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడి అని పేర్కొన్నారు. ఇది పారదర్శకంగా, సమ్మిళితంగా ఉండేలా పోరాటం కొనసాగిస్తానని తెలిపారు.

కరుణానిధి పెద్ద కొడుకు ముత్తు కన్నుమూత

చెన్నై, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి పెద్ద కుమారుడు, స్టాలిన్ సోదరుడు ఎంకే ముత్తు(77) కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కరుణానిధి మొదటి భార్య పద్మావతికి కలిగిన సంతానమే ముత్తు. అయితే ఆయన జన్మించిన కొన్ని గంటలకే తల్లి మృతి చెందడంతో అమ్మమ్మ వద్దే పెరిగారు. డీఎంకే కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్న ముత్తు.. ఆ తరువాత సినీ రంగంలోకి ప్రవేశించారు. హీరోగా నటించడంతో పాటు కొన్ని సినిమాలకు పాటలు కూడా పాడారు. అయితే అక్కడ అంతగా విజయం సాధించలేకపోవడం, వ్యక్తిగత కారణాలతో ఆయన అటు రాజకీయాలకు, ఇటు సినీ రంగానికి దూరమయ్యారు.

చైనా విడిభాగాలను ఇక్కడ కలపడమే 'మేక్ ఇన్ ఇండియా'నా: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జూలై 19: మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో సొంతంగా తయారుచేస్తున్నది తక్కువేనని ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ అన్నారు. టీవీకి సంబంధించిన 80% విడి భాగాలు 'మేక్ ఇన్ ఇండియా' పేరిట చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారని తెలిపారు. దీంతో ఐఫోన్, టీవీ తదితర వస్తువుల విడి భాగాలను కలిపే ప్రక్రియగా ఈ కార్యక్రమం మిగిలిపోయిందని రాహుల్ విమర్శించారు. దేశంలో తయారీరంగం బలపడాలంటే క్షేత్రస్థాయిలో మార్పులు రావాల్సి ఉందని 'ఎక్స్'లో ఆయన అభిప్రాయపడ్డారు. "జీడీపీలో తయారీరంగం వాటా 2014లో 15.3% ఉండగా, ఇప్పుడది 12.6 శాతానికి క్షీణించింది. ఇంత క్షీణత ఈ రంగంలో నమోదు కావడం 60ఏళ్లలో ఇదే తొలిసారి" అని రాహుల్ అన్నారు.

ఆధార్‌లో సమూల మార్పులు!

- వివరాల్లోంచి తండ్రి/భర్త పేరు తొలగింపు
- పుట్టిన తేదీకి బదులు పుట్టిన సంవత్సరం మాత్రమే!
- యూఐడీఏఐ ఉత్తర్వులు.. ఇప్పటికే అమల్లోకి

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌లో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. మొబైల్ సిమ్, బ్యాంకు ఖాతా, పాస్‌పోర్టు, ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు.. ఇలా ఎన్నో అవసరాలకు గుర్తింపుగా తీసుకునే ఆధార్ కార్డులపై ఇక నుంచి తండ్రి/భర్త పేరు ఉండదు. ఆధార్‌లో పేరు కింద ఉండే ఈ వివరాలను తొలగించారు. నిజానికి మొదట్లో తండ్రి/భర్త పేరు అని ఉండేది. తర్వాత కేరాఫ్ అని మార్చారు. ఇప్పుడు పూర్తిగా తొలగిస్తూ 'భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ)' నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి కొత్త ఆధార్ నమోదులో తండ్రి/భర్త వివరాలు సమర్పించాలని కోరబోమని యూఐడీఏఐ తెలిపింది. అలాగే పుట్టినతేదీకి బదులు ఇకనుంచి కేవలం పుట్టిన సంవత్సరాన్నే నమోదు చేస్తారు. దీనికి సంబంధించి యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ హిమాన్షు ఉత్తర్వులు జారీచేశారు. కొత్త మార్పులను గతంలోనే పేర్కొనగా.. ఈ నెల 18 నుంచి పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చాయి. ఇప్పటికే తండ్రి/భర్త పేరు ఉన్న ఆధార్ కార్డులను అప్‌డేట్ చేస్తే ఆ పేర్లు తొలగించబడతాయి. అలాగే పుట్టినతేదీ స్థానంలో పుట్టిన సంవత్సరం మాత్రమే వస్తుంది. 18 ఏళ్లలోపు ఉండే పిల్లల (మైనర్ల) ఆధార్‌లోనే మాత్రమే కేరాఫ్ స్థానంలో వారి తండ్రి పేరు ఉంటుంది.

అల్రా.. మన భారీ బాంబర్!

అమెరికా బీ-21, రష్యా టీయూ-160 తరహా యుద్ధ విమానంపై భారత్ దృష్టి

- ఏకబిగిన 12 వేల కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యం
- బ్రహ్మోస్-ఎన్‌జీ, అగ్ని పీ1 సహా కీలక క్షిపణులు, లేజర్ బాంబుల అనుసంధానానికి ప్రతిపాదన
- 2035 నాటికి ప్రాటోటైప్ సిద్ధం!


ఏఐతో రూపొందించిన చిత్రం

న్యూఢిల్లీ, జూలై 19: ఎక్కడో అమెరికాలోని మిస్సోరీ నుంచి వేలాది కిలోమీటర్లు ఎగిరివచ్చి ఇరాన్‌లో అణుకేంద్రాలపై చేసిన దాడులతో అమెరికా బీ-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్లు కలకలం రేపాయి. ప్రపంచమంతా వాటి గురించే చర్చ జరిగింది. అలాంటి బాంబర్లు మనకూ ఉంటే బాగుంటుందనే ఆశాభావమూ వ్యక్తమైంది. అయితే ఇప్పుడు కాకున్నా కొన్నేళ్లలో భారత్ వద్ద కూడా భారీ బాంబర్ విమానాలు ఉండబోతున్నాయి. దీనికి సంబంధించి 'అల్ట్రా లాంగ్ రేంజ్ స్ట్రైక్ ఎయిర్‌క్రాఫ్ట్ (అల్రా)' పేరిట ఆలోచన మొగ్గతొడిగినట్టు రక్షణ రంగ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి రష్యా, ఫ్రాన్స్‌లతో పలు సాంకేతికతల బదిలీకి సంబంధించి చర్చలు కూడా ప్రారంభమైనట్టు వివరిస్తున్నారు.

అమెరికా బాంబర్‌కు దీటుగా..?

ప్రస్తుతం అమెరికా బీ-2 స్పిరిట్ కన్నా సమర్థవంతమైన బీ-21 రైడర్ బాంబర్లను అభివృద్ధి చేసింది. వాటి ప్రయాణ సామర్థ్యం సుమారు 9,300 కిలోమీటర్లు. చైనా కూడా హెచ్-20 పేరిట 8 వేల కిలోమీటర్లపైన సామర్థ్యమున్న బాంబర్‌ను అభివృద్ధి చేస్తోంది. మరోవైపు రష్యా వద్ద ఉన్న టీయూ-160 బ్లాక్‌జాక్ బాంబర్ సామర్థ్యం 12,300 కిలోమీటర్లపైమాటే. అది ప్రపంచంలోనే వేగవంతమైన, భారీ సూపర్ సోనిక్ బాంబర్ కూడా. భారత్ దీని తరహాలోనే 'అల్రా' బాంబర్లను ఏకబిగిన 12 వేల కిలోమీటర్ల సామర్థ్యం ఉండేలా అభివృద్ధి చేయాలని భావిస్తోందని రక్షణ నిపుణులు చెబుతున్నారు. అంటే ఇక్కడ బయలుదేరితే నేరుగా అమెరికాలోని న్యూయార్క్ నగరం వరకు చేరుకుని దాడి చేయవచ్చు. ఇరుగుపొరుగు దేశాలే కాదు.. యూరప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా ఖండాల్లోని దేశాలన్నింటికీ చేరుకోగలదు. ఈ బాంబర్‌ను 'స్వింగ్ వింగ్' మోడల్ రెక్కలు అమర్చాలన్న ప్రతిపాదన ఉన్నట్టు రక్షణ నిపుణులు చెబుతున్నారు. విమానం టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో రెక్కలు అడ్డంగా విప్పార్చుకుని సురక్షితంగా, సులువుగా దిగేందుకు, ఎగిరేందుకు అనువుగా ఉంటాయి. గాల్లో ప్రయాణిస్తున్నప్పుడు కాస్త వెనక్కి ముడుచుకుంటాయి. దీనితో విమానం తక్కువ ఇంధనంతో, ఎక్కువ వేగంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది. కొత్తగా అభివృద్ధి చేస్తున్న బ్రహ్మోస్ ఎన్‌జీతోపాటు ఇతర అత్యాధునిక క్షిపణులను, భారీ బాంబులను మోసుకెళ్లేలా అల్రాను అభివృద్ధి చేయనున్నారు. "బ్రహ్మోస్ కొత్త వెర్షన్లతోపాటు అగ్ని 1పీ క్షిపణులు, లేజర్ బాంబులు, యాంటీ రేడియేషన్ క్షిపణులు కూడా ఉండాలన్నది మా ఆలోచన" అని భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) సీనియర్ అధికారి ఒకరు పేర్కొనడం గమనార్హం.

అంత సులువేమీ కాదు!

భారీ బాంబర్ విమానాల తయారీ అంత సులువేమీ కాదని, ఇది సుదీర్ఘకాల లక్ష్యమని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. భారీ బాంబర్‌కు అవసరమైన ఎయిర్‌ఫ్రేమ్ నుంచి ఇంజన్ల దాకా ఎంతో శ్రమ, ఖర్చు, అత్యాధునిక సాంకేతికతల అవసరం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. బాంబర్ పరిశోధన, అభివృద్ధిలో డీఆర్‌డీవో, హాల్, ఎయిర్‌క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) తదితర సంస్థలన్నీ విస్తృతస్థాయిలో భాగస్వామ్యం కావాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. భారత్ ప్రయత్నాలు ఫలిస్తే 2035 నాటికి మొదటి ప్రొటోటైప్ సిద్ధం కావొచ్చని అంచనా వేస్తున్నారు. మొత్తానికి 'మేం సిద్ధం' అని భారత్ ప్రపంచానికి చాటనుందని అంటున్నారు.

బిల్లుల ఆమోదానికి గడువు అంశంలో రాష్ట్రపతి సందేహాలపై 22న సుప్రీంకోర్టు విచారణ

న్యూఢిల్లీ, జూలై 19: అసెంబ్లీలు తీర్మానించిన బిల్లులను నిర్ణీత వ్యవధిలో ఆమోదించాలంటూ కోర్టులు రాష్ట్రపతికి గడువు విధించగలవా? అన్న సందేహాలపై సుప్రీంకోర్టు ఈ నెల 22న విచారణ జరపనుంది. ఇందుకోసం అయిదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటయింది. ఈ ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌లు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను ఆయా రాష్ట్రాల గవర్నర్లు ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపినప్పుడు వాటిపై మూడు నెలల్లోగా నిర్ణయాన్ని వెలువరించాల్సి ఉందని ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. తమిళనాడు గవర్నర్ బిల్లులను ఆమోదించకుండా తొక్కిపెడుతున్నారన్న ఆరోపణలపై దాఖలైన కేసులో ఈ ఆదేశాలు ఇచ్చింది. అయితే న్యాయస్థానాలు రాష్ట్రపతికి ఈ విధంగా గడువు విధించగలవా అన్న సమస్య తలెత్తింది. దాంతో రాష్ట్రపతి ముర్ము రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) ప్రకారం ఈ సందేహాలు తీర్చాలని కోరుతూ సుప్రీంకోర్టుకు లేఖ రాశారు. జులై 22న పంపిన 'ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్'లో 14 కీలకమైన ప్రశ్నలను ప్రస్తావించి అభిప్రాయాలు చెప్పాలని కోరారు. వీటిపైనే సుప్రీంకోర్టు విచారణ జరపనుంది.

మోదీ సర్కారుపై ఇండియా కూటమి పోరుబాట

- పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో.. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్, ట్రంప్ వ్యాఖ్యలు సహా 8 అంశాలపై ఫోకస్

న్యూఢిల్లీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ వర్షాకాలం సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో.. మోదీ సర్కారు వైఫల్యాలపై పోరుబాట పట్టాలని ఇండియా కూటమి పక్షాలు నిర్ణయించాయి. దేశ భద్రత, రాజకీయ అంశాలపై ఉభయ సభల్లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని తీర్మానించాయి. సోమవారం నుంచి ఆగస్టు రెండో వారం వరకు జరగనున్న సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఇండియా కూటమికి చెందిన 24 పార్టీల నేతలు శనివారం రాత్రి వర్చువల్‌గా భేటీ అయ్యారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఆ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్, కేసీ వేణుగోపాల్.. కూటమి నేతలు శరద్‌పవార్, ఉద్ధవ్ ఠాక్రే, సంజయ్ రౌత్, ఎంఏ బేబి, డి.రాజా, ఒమర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో 8 అంశాలపై మోదీ సర్కారును నిలదీయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ, వాణిజ్యంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు, బిహార్ ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో జరుగుతున్న ఓటర్ల తొలగింపు, నియోజకవర్గాల పునర్విభజన, దేశంలో దళిత, వెనుకబడిన, గిరిజన, మహిళలు, మైనారిటీ వర్గాలపై జరుగుతున్న అకృత్యాలతోపాటు అహ్మదాబాద్ విమాన ప్రమాదం వంటి అంశాలపై ఉభయ సభల్లో చర్చకు పట్టుబట్టి, మోదీ ప్రభుత్వాన్ని వివరణ కోరాలని నిశ్చయించాయి. దేశ ప్రయోజనాలను మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్న తీరుకు వ్యతిరేకంగా తామంతా ప్రజాస్వామ్యబద్ధంగా సభలో ప్రశ్నిస్తామని, పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగాలని, మోదీ సర్కారు తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కోరుకుంటున్నట్లు రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

రేపటి నుంచి పార్లమెంటు

ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి



న్యూఢిల్లీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు వర్షాకాల సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆ తదనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి జరుగుతున్న ఈ సమావేశాలు వాడీవేడిగా కొనసాగే అవకాశాలున్నాయి. ఈ సమావేశాలకు రెండ్రోజుల ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్, పాక్ ఘర్షణలో 5 యుద్ధ విమానాలు నేలకూలాయని చేసిన వ్యాఖ్యలు ఇండియా కూటమి పక్షాలకు ఆయుధంగా మారనున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ అంశాలపై ప్రతిపక్షాలు చర్చలకు పట్టుబట్టే అవకాశాలున్నాయి. ఆపరేషన్ సిందూర్ వివరాలు సమగ్రంగా దేశప్రజల ముందుంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేయనున్నాయి. కాల్పుల విరమణపై ఏకపక్షంగా ట్రంప్ ప్రకటన చేయడం, యుద్ధ నష్టాలపై మోదీ సర్కారును ఇరుకున పెట్టేలా ట్రంప్ వ్యాఖ్యలతో ఉభయసభలలో ప్రశ్నించేందుకు ఇండియా కూటమి సిద్ధం కావడంతో దీటుగా ఎదుర్కొనేందుకు మోదీ సర్కారు కూడా సమయాత్తమవుతోంది. కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు ఇటీవలే సమావేశమై ఉభయసభల్లో అనుసరించాల్సిన వ్యూహం, విపక్షాలను కట్టడి చేయడంపై చర్చించారు.

12 బిల్లుల ఆమోదం కోసం యత్నం

ఈ సమావేశాలలో 12 బిల్లులకు ఆమోద ముద్ర వేయించుకోవాలని కేంద్రం భావిస్తోంది. వీటిలో కొన్ని ఇప్పటికే పార్లమెంటులో పెండింగ్‌లో ఉన్నవి కాగా, 8 బిల్లులు కొత్తగా ప్రవేశపెట్టనున్నట్లు లోక్‌సభ వర్గాలు తెలిపాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు సిటింగ్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మను అభిశంసించే తీర్మానం కూడా ఈ సమావేశాలలోనే పార్లమెంటు ముందుకు రానుంది. ఈ నెల 21న ఉభయసభలు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 21న ముగుస్తాయి.

నేడు అఖిలపక్ష సమావేశం..

కేంద్ర ప్రభుత్వం నేడు అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. పార్లమెంటు భవన సముదాయంలోని ప్రధాన హాల్‌లో పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో కేంద్ర మంత్రులతో పాటు, ప్రతిపక్షాలకు చెందిన పార్లమెంటరీ పార్టీ నేతలు హాజరవుతారు. ఉభయసభలు సజావుగా కొనసాగేందుకు సూచనలు తీసుకోవడం, ఉభయసభలలో చర్చించాల్సిన అంశాలపై ఈ సమావేశంలో నిర్ణయించనున్నారు.

'కర్ణాటక సుప్రీంకోర్టు' పేరుతో సొలిసిటర్ జనరల్ ఎక్స్ ఖాతా

తప్పుడు సమాచారం వ్యాప్తిని నిరూపించేందుకే

న్యూఢిల్లీ/బెంగళూరు, జూలై 19: సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా 'సుప్రీంకోర్ట్ ఆఫ్ కర్ణాటక' పేరిట నకిలీ 'ఎక్స్' ఖాతాను తెరిచారు. ఒక కోర్టు ఫొటోను కూడా దీనికి జతచేసి, అధికారిక ఖాతాలా కనిపించేలా చేశారు. ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారం ముప్పు ఎంత తీవ్రంగా ఉందో నిరూపించేందుకు ఈ ఖాతాను శుక్రవారం ఆయన కర్ణాటక హైకోర్టులో ప్రదర్శించారు. ఆయన ఫోన్‌ను జస్టిస్ నాగ ప్రసన్నకు అందజేసి, ఈ నకిలీ 'ఎక్స్' ఖాతాను చూపించారు. ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారాన్ని ఇంత సులువుగా వ్యాప్తి చేయొచ్చంటూ వాదించారు. 'ఇది ట్విటర్ వెరిఫై చేసిన ఖాతా. ఇప్పుడు నేను ఇందులో ఏమైనా పోస్టు చేయొచ్చు. వీటిని చూసిన లక్షలాదిమంది ఆ వివరాలన్నీ కర్ణాటక సుప్రీంకోర్టే చెప్పిందనుకుంటారు' అన్నారు. సోషల్ మీడియా వేదికలపై ప్రభుత్వం తీవ్రంగా దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఖాతాలను తెరిచిన అజ్ఞాత వ్యక్తులు వాటిలో చట్టవిరుద్ధమైన అంశాలను పోస్టు చేస్తే.. బాధిత పక్షం ఎవరిపై దావా వేస్తుందని తుషార్ మెహతా ప్రశ్నించారు. 'ఎక్స్' సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది కేజీ రాఘవన్ వాదిస్తూ.. అధికారికంగా నమోదు చేయకుండా నకిలీ ఖాతాలు సృష్టించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అది 'ఎక్స్' వెరిఫై చేసిన ఖాతా కాదన్నారు. సోషల్ మీడియా వేదికలన్నీ సహయోగ్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు కావాలంటూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను 'ఎక్స్' సంస్థ సవాలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వాదనలు కొనసాగాయి. తదుపరి విచారణను కోర్టు ఈనెల 25వ తేదీకి వాయిదా వేసింది. అయితే, ఆ కల్పిత ఖాతాను ఎక్స్ తొలగించింది.

భారత్-పాక్ ఘర్షణలో.. 5 యుద్ధ విమానాలు కూలిపోయాయి

- మరోమారు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జూలై 19: పహల్గాం ఉగ్రదాడి తర్వాత 'ఆపరేషన్ సిందూర్'తో భారత్.. దానికి ప్రతీకారంగా పాకిస్థాన్ చేసిన దాడుల్లో 5యుద్ధ విమానాలు కూలిపోయాయంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన జోక్యంతోనే ఇరుదేశాల మధ్య వివాదం సమసిందని పునరుద్ఘాటించారు. ట్రంప్ జోక్యం వార్తలను భారత్ ఇదివరకే ఖండించిన విషయం తెలిసిందే! అయితే, తానే యుద్ధాన్ని ఆపానని, గడిచిన ఆర్నెల్లలో ఎన్నో ఘర్షణలను అడ్డుకున్నట్లు ట్రంప్ తాజాగా మళ్లీ ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత కూలినట్లు చెబుతున్న ఐదు యుద్ధ విమానాలు ఏ దేశానికి చెందినవనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. శుక్రవారం రాత్రి ట్రంప్ తన అధికారిక నివాసం(వైట్‌హౌస్)లో రిపబ్లికన్ సెనేటర్లకు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "భారత్-పాక్ ఘర్షణలో 4-5 యుద్ధ విమానాలు కూలిపోయాయి. ఐదు అని నాకు గుర్తుంది. అవి రెండూ(భారత్, పాక్) అణ్వాయుధ దేశాలు. పరిస్థితి జటిలంగా మారుతుండడంతో మేం వాణిజ్యం ద్వారా సమస్యను పరిష్కరించాం" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. దీనిపై ప్రధాని మోదీ పార్లమెంట్ సాక్షిగా స్పష్టతనివ్వాలని డిమాండ్ చేసింది. "మోదీజీ.. ఆ ఐదు విమానాల సంగతేంటి?" అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. "పార్లమెంట్ సమావేశాలకు రెండ్రోజుల ముందు.. మళ్లీ ట్రంప్ మిసైల్ పేలింది. ట్రంప్ ఈ అంశంపై మాట్లాడడం ఇది 24వ సారి" అని జైరామ్ అన్నారు.

వాల్‌స్ట్రీట్, రాయిటర్స్‌కు భారత పైలట్ల సమాఖ్య నోటీసులు

న్యూఢిల్లీ, జూలై 19: ఎయిరిండియా విమాన ప్రమాదంపై నిరాధార కథనాలు ప్రచురించిన వాల్‌స్ట్రీట్, రాయిటర్స్ మీడియా సంస్థలపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పైలెట్స్ (ఎఫ్ఐపీ) న్యాయపరమైన చర్యలకు సిద్ధమైంది. విమానం రెండు ఇంజన్లకు ఇంధనం సరఫరా చేసే స్విచ్‌లను పైలట్ ఉద్దేశపూర్వకంగా షట్‌డౌన్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఇటీవల కథనం ప్రచురించింది. అయితే, దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో ఇటువంటి చర్యలు బాధ్యతారహితమైనవని ఎఫ్ఐపీ స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలూ లేకుండా తప్పుడు కథనాలు ప్రచురించినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఈ రెండు సంస్థలకు నోటీసులు పంపింది. కాగా, అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై విదేశీ మీడియాలో వస్తున్న వార్తాకథనాలు ఊహాజనితమైనవని అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ సేఫ్టీ బోర్డ్ (ఎన్‌టీఎస్‌బీ) ఖండించింది.

బ్రహ్మపుత్రపై చైనా భారీ డ్యామ్

- అరుణాచల్‌కు సమీపంలోని న్యింగ్‌చిలో నిర్మాణం
- రూ.14.4 లక్షల కోట్లతో 5జల విద్యుత్ కేంద్రాలు
- పనులను ప్రారంభించిన చైనా ప్రధాని లీ కియాంగ్

న్యూఢిల్లీ, జూలై 19: భారత్‌లోని కొన్ని రాష్ట్రాలతోపాటు బంగ్లాదేశ్‌కు ఆయువుపట్టు బ్రహ్మపుత్ర నదిపై అతి భారీ డ్యామ్ నిర్మాణాన్ని చైనా తాజాగా ప్రారంభించింది. అరుణాచల్‌ప్రదేశ్‌కు సమీపంలో టిబెట్‌లోని న్యింగ్‌చి ప్రాంతంలో ఈ డ్యామ్ నిర్మాణానికి చైనా ప్రధాన మంత్రి లి కియాంగ్ తాజాగా ప్రారంభోత్సవం చేసినట్టు చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది. టిబెట్‌తోపాటు ఇతర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా.. డ్యామ్‌తోపాటు దానిపై ఐదు జల విద్యుత్ కేంద్రాలను రూ.14.4 లక్షల కోట్ల (167 బిలియన్ డాలర్లు)తో నిర్మిస్తున్నట్టు తెలిపింది. ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు అయిన త్రీగోర్జెస్ డ్యామ్ కంటే కూడా.. ఈ కొత్త డ్యామ్‌తో ఎక్కువ జల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అంచనా. చైనాలోని యాంగ్జె నదిపై ఉన్న త్రీగోర్జెస్ డ్యామ్ జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఏకంగా 22,400 మెగావాట్లు కావడం గమనార్హం. ఇప్పుడు బ్రహ్మపుత్ర (చైనాలో యార్లుంగ్ త్సాంగ్‌పోగా పిలుస్తారు)పై కడుతున్న కొత్త డ్యామ్‌లో భారీ స్థాయిలో నీటిని నిల్వ చేసే క్రమంలో.. దిగువన ఉన్న భారత్, బంగ్లాదేశ్‌లపై ప్రభావం పడుతుందనే ఆందోళన నెలకొంది. గత ఏడాది డిసెంబర్‌లో చైనా ఈ ప్రాజెక్టు నిర్మాణంపై నిర్ణయం తీసుకుంది. అప్పుడే భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. బ్రహ్మపుత్ర నది పరీవాహకంలో దిగువన ఉన్న దేశాల ప్రయోజనాలకు భంగం కలగకుండా చర్యలు చేపట్టాలని విదేశాంగ మంత్రి జైశంకర్ డిమాండ్ చేశారు. దానిపై స్పందించిన చైనా తాము నిర్మిస్తున్న డ్యామ్‌తో భారత్‌కు నీటి ప్రవాహంపై ఎలాంటి ప్రభావం పడదని ప్రకటించింది. అయినా హిమాలయాల ప్రాంతంలో నిర్మిస్తున్న ఈ అతి భారీ డ్యామ్‌తో పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఏపీ లిక్కర్ స్కాం కేసులో మిథున్ అరెస్ట్

మద్యం స్కామ్‌లో ఆయనే మాస్టర్ మైండ్.. సిట్ ముందు విచారణకు హాజరు

- ఐదుగంటలపాటు ప్రశ్నల వర్షం
- గతంలోలాగానే సహాయ నిరాకరణ
- రాత్రి 8 గంటలకు అరెస్టు చేసిన 'సిట్'
- నేడు కోర్టులో హాజరు


విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయానికి వస్తున్న మిథున్‌రెడ్డి

అమరావతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో 'మాస్టర్ మైండ్'... 'అంతిమ లబ్ధిదారు' తర్వాతి స్థానంలో ఉన్న వ్యక్తిగా భావిస్తున్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని ఎట్టకేలకు 'సిట్' అధికారులు అరెస్టు చేశారు. జగన్ హయాంలో జరిగిన వేలకోట్ల మద్యం కుంభకోణంలో మిథున్ రెడ్డి నాలుగో నిందితుడు (ఏ4)గా ఉన్నారు. అరెస్టు నుంచి రక్షణ పొందేందుకు విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో... ఆయన అరెస్టు శుక్రవారమే ఖరారైంది. 'సిట్' ఇచ్చిన నోటీసు మేరకు శనివారం మధ్యాహ్నం 12.40 గంటలకు మిథున్ రెడ్డి విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయనను సిట్ అధికారులు దాదాపు ఐదుగంటలపాటు ప్రశ్నించారు. ముడుపులు మూటగట్టేందుకు అనుకూలంగా మద్యం విధానాన్ని రూపొందించడం మొదలుకుని... అందుకు అనుగుణంగా ఎక్సైజ్ అధికారుల నియామకం, ముడుపుల వసూళ్లు, అప్పట్లో గరిష్ఠ లబ్ధిపొందిన అదాన్ డిస్టిలరీలో అనధికార భాగస్వామ్యం, నిబంధనలకు విరుద్ధంగా ఆర్డర్లు ఇప్పించడం, ముడుపులివ్వని వారికి ఆర్డర్లు ఆపేయడం, డిస్టిలరీల నుంచి ఎంత వసూలు చేయాలో నిర్ణయించడం, ఆ సొమ్ము ఎన్నికల ఖర్చు కోసం భద్రపరచడం, పీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్ ద్వారా కోట్ల రూపాయల లావాదేవీలు తదితర అంశాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. మద్యం తరలించే బాక్సుల కాంట్రాక్టు ఢిల్లీకి చెందిన వారికి ఇప్పించడం వెనుక జరిగిన తతంగంపైనా మిథున్‌ను ప్రశ్నించినట్లు సమాచారం.

అదే సమాధానం...

మద్యం కేసులో మిథున్ రెడ్డిని ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒకసారి 'సిట్' అధికారులు ప్రశ్నించారు. అప్పట్లో ఆయన విచారణకు ఏమాత్రం సహకరించలేదు. 'రాష్ట్రంలో జరిగే వ్యవహారాలతో ఎంపీగా ఉన్న నాకేం సంబంధం' అంటూ సమాధానాలు దాటవేశారు. శనివారం విచారణలో కూడా ఆయన ఇదే తరహాలో సహాయ నిరాకరణ చేసినట్లు తెలిసింది. 'అంతిమ లబ్ధిదారు'కు సంబంధించి అడిగిన ప్రశ్నలకు స్పందించలేదని సమాచారం. దీంతో... మిథున్‌ను అరెస్టు చేయాలని అధికారులు నిర్ణయించుకున్నారు. నిబంధనల ప్రకారం... ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శనివారం రాత్రి 8 గంటలకు మిథున్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఆయనను ఆదివారం ఉదయం విజయవాడ ఏసీబీ కోర్టులో ప్రవేశ పెట్టనున్నారు.

ఇదీ మిథున్ పాత్ర...

'సిట్' విచారణలో గుర్తించిన ప్రకారం... జగన్ సర్కారు తెచ్చిన మద్యం పాలసీ రూపకల్పనలో మిథున్ రెడ్డి అత్యంత కీలకంగా వ్యవహరించారు. వినియోగదారులు అలవాటు పడ్డ, పాపులర్ మద్యం బ్రాండ్లను కాకుండా ముడుపులిచ్చిన అనామక కంపెనీలకు మాత్రమే ఆర్డర్లు ఇచ్చేలా చూశారు. లిక్కర్ లాబీని గుప్పిట్లో పెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారు. ముడుపులు చెల్లించిన వారికే తర్వాతి వారంలో ఆర్డర్లు ఇవ్వాలని, లేదంటే ఆపేయాలని మిథున్ రెడ్డి ఎక్సైజ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు తేలింది. ఐదు రూపాయల టీ తాగినా ఆన్‌లైన్ చెల్లింపులు జరుగుతుండగా... మద్యం వ్యాపారం మాత్రం పూర్తిగా 'క్యాష్'లో జరగడానికి కారణం ఆయనే అని సిట్ గుర్తించింది. అప్పటి ఎక్సైజ్ అధికారులు తమ వాంగ్మూలాల్లో ఈ విషయం స్పష్టం చేసినట్లు తెలిసింది. ప్రతి రోజూ రెండు కోట్లకు తగ్గకుండా మద్యం కమీషన్లు వసూలు చేసిన లిక్కర్ గ్యాంగ్‌లో కీలకంగా వ్యవహరించిన మిథున్ రెడ్డి అదాన్ డిస్టిలరీస్ పేరుతో వందల కోట్ల రూపాయలు ఆర్జించినట్లు సమాచారం. లిక్కర్ వ్యాపారంలో తాము చెప్పినట్లు చేస్తే ఐఏఎస్ అధికారి హోదా ఇప్పిస్తామంటూ అప్పటి ఎక్సైజ్ అధికారి సత్య ప్రసాద్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇతర నిందితులతో తరచూ సమావేశమయ్యారు. ఈ విషయాలను మిథున్ రెడ్డి రిమాండ్ రిపోర్టులో దర్యాప్తు అధికారి పొందుపరిచే అవకాశం ఉంది.

ఇవీ సెక్షన్లు...

మిథున్ రెడ్డిని క్రైమ్ నంబర్ 21/2024లో అరెస్టు చేసినట్లు పోలీసులు ఆయన తరఫు న్యాయవాదికి సమాచారం ఇచ్చారు. ఐపీసీ 420, 409, 384, 120(బి), 201 రెడ్ విత్ 34, 37... అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 7, 7ఏ, 8, 12, 13(1)(బీ), 13(2) కింద మంగళగిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైనట్లు వెల్లడించారు.



స్వర్ణకార సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్వర్ణకారుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం సభ్యులు రాష్ట్ర మంత్రులకు వినతి పత్రం అందజేశారు. ఆ సంస్థ అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి మాట్లాడుతూ.. త్వరలో స్వర్ణకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారని తెలిపారు. స్వర్ణకారులందరూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి ఆ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు.

అప్పులు తీర్చలేక కౌలు రైతు ఆత్మహత్య


గజేందర్(ఫైల్)

కుంటాల, జూలై 19(ఆంధ్రజ్యోతి) : అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలు దిగబడి రాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో జరిగింది. గజేందర్ గత 5 సంవత్సరాలుగా ఇతర రైతుల నుంచి 10 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, సోయా పంటలను సాగు చేస్తున్నాడు. అయితే గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రతీయేటా పంటలు సరిగా పండక పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తితో శనివారం ఉదయం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ జీవన్‌రావు తెలిపారు.

జయశంకర్ విగ్రహ గద్దెను కూల్చివేయడం దారుణం: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలోని నమాజ్ చెరువు కట్టపై ప్రొ. జయశంకర్ విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను కూల్చి వేయడం దారుణమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని తెలిపారు. జై తెలంగాణ అనని ముఖ్యమంత్రి పాలనలో తెలంగాణ మహనీయులకు ఇలాంటి అవమానాలు జరగడం తన మనసును కలచివేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గంభీరావుపేటలో జయశంకర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. గద్దెను కూల్చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ అనుచిత వ్యాఖ్యలు చేశారని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఆ పార్టీ నాయకురాలు సుమిత్రానంద్ ఫిర్యాదు చేశారు.

10 జెడ్పీటీసీ స్థానాల్లో మద్దతు ఇవ్వండి

- కాంగ్రెస్‌ను కోరిన టీజేఎస్

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని.. 10 జెడ్పీటీసీ స్థానాల్లో తమకు సహకరించాలని కాంగ్రెస్‌ను టీజేఎస్ చీఫ్, ప్రొఫెసర్ కోదండరాం కోరారు. ఈ మేరకు గుర్తించిన పది జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేసే మంది అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ అధిష్ఠానానికి టీజేఎస్ అందించింది. 'ఉత్తర తెలంగాణలో 5, దక్షిణ తెలంగాణలో 5 జెడ్పీటీసీ స్థానాల్లో టీజేఎస్‌కు పట్టు ఉంది. పార్టీకి కార్యకర్తల బలమున్న ఆయా ప్రాంతాల్లో మద్దతు ఇవ్వండి' అని పేర్కొంది. కాగా, ఈ విషయాన్ని పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ నేతలు తెలిపినట్లు సమాచారం.

సీనియర్ జర్నలిస్టు రవి ప్రతాప్ చావ్లా కూతురు రోష్ని చావ్లా మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. బిడ్డ మరణంతో శోకతప్తులైన చావ్లా దంపతులకు శనివారం ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

'మద్యం' చార్జిషీట్‌లో జగన్!

(మొదటి పేజీ తరువాయి)

విధానాన్ని మార్చారు? ముడుపులు ఎలా మూటకట్టారు? వాటిని ఎక్కడికి, ఎలా తరలించారు? ఇందులో కీలక పాత్ర ఎవరిది? అనే ప్రశ్నలకు సాక్షులు, నిందితులు తెలిపిన అంశాలు, సేకరించిన ఆధారాలతో చార్జిషీటును రూపొందించారు. ఇదే సందర్భంగా.. పలుచోట్ల జగన్ ప్రస్తావన వచ్చినట్లు తెలిసింది. శనివారం అరెస్టు చేసిన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి పేరును కూడా చార్జిషీటులో సిట్ ప్రస్తావించినట్లు సమాచారం. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఐటీ సలహాదారు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(ఏ-1) అప్పటి ఎక్సైజ్ అధికారులు, డిస్టిలరీల యజమానులతో కలిసి మిథున్‌రెడ్డి (ఏ-4) ఈ కుంభకోణాన్ని ఎలా నడిపించారనేది కోర్టుకు సిట్ వివరించింది. కాగా, సీఎం మాజీ కార్యదర్శి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, జగన్ మాజీ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ సహా 22మంది పాత్రని చార్జిషీట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. అతి త్వరలో మరో చార్జిషీట్ దాఖలు చేయబోతున్నామని, అందులో మరికొందరి నిందితుల పాత్రని ఆధారాలతో సహా చూపుతామని సిట్ వర్గాలు చెబుతున్నాయి.

ముడుపుల సొమ్ము రూటింగ్ ఇలా..

ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన మొదటి అభియోగపత్రం 305 పేజీలు ఉన్నట్లు తెలిసింది. చార్జిషీట్‌తో పాటు 70వరకూ వాల్యూమ్స్ కోర్టుకు అందజేసిన సిట్ అధికారులు అందులో పేర్కొన్న అంశాల ఆధారంగా 28కి పైగా ఎఫ్ఎస్ఎల్ నివేదికలు, ఎలక్ట్రానిక్ పరికరాల విశ్లేషణలు, ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన జీవోలు, గత వైసీపీ ప్రభుత్వ మద్యం పాలసీపై ఆధారాలతో కూడిన డాక్యుమెంట్లు పొందుపరిచినట్లు సమాచారం. ప్రధానంగా మద్యం విధానం రూపకల్పనలో ఎవరెవరి పాత్ర ఏమిటి.? కుట్రదారులెవరు.? పాత్రధారులెవరు.? ప్రభుత్వ పెద్దలు ఏమి చేశారు.? ముడుపులు నిర్ణయించింది ఎవరెవరు.? వాటిని వసూలు చేసే బాధ్యత రాజ్ కసిరెడ్డికి అప్పగించడం వెనుక కారణాలు, అందుకున్న మొత్తం ఎంత.? నగదు కలెక్షన్లలో తీసుకున్న జాగ్రత్తలు, ఆ సొమ్ము నిల్వ చేసిన డెన్‌లు, అక్కడి నుంచి బినామీ ఆస్తుల కొనుగోలుకు వెళ్లింది ఎంత.? హవాలా మార్గంలో దేశం దాటింది ఎంత.? ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు చేరింది ఎంత.? గత ఎన్నికల సమయంలో 'సిద్ధం' సభలకు పంపించిన సొమ్ము వివరాలతో పాటు మాజీ ముఖ్యమంత్రి పేరు పలుమార్లు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ప్రతి నెలా కోట్ల రూపాయల ఆదాయమే లక్ష్యంగా మద్యం పాలసీ రూపొందించిన కుట్ర మొదలుకొని రాజ్ కసిరెడ్డి పాత్రపైనా సిట్ ఎక్కువగా వివరించినట్లు సమాచారం. పాలసీ రూపకల్పన నుంచి వసూళ్ల నెట్‌వర్క్ ఏర్పాటు, అదాన్ డిస్టిలరీని స్వాధీనం చేసుకుని పాలసీకి భిన్నంగా రూ.1200కోట్ల మద్యం ఆర్డర్లు పొందిన వైనం, వసూలు చేసిన మొత్తాన్ని రూటింగ్ చేసిన తీరుపై వివరంగా పేర్కొన్నట్లు తెలిసింది. ఎక్సైజ్ అధికారులతో పాటు సాక్షులు ఇచ్చిన 268 స్టేట్‌మెంట్లు చార్జిషీట్‌తో పాటు కోర్టుకు అందజేసిన సిట్ అధికారులు, లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన 62.85 కోట్ల రూపాయలు జప్తు చేసినట్లు తెలిపింది. అదాన్, ఎస్ఎన్‌జే డిస్టిలరీస్ ఖాతాల్లో ఉన్న నగదు, వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల కోసం తీసుకెళ్తూ పట్టుబడ్డ సొమ్ము అందులో ఉన్నట్లు వివరించింది.

బంగారు షాపుల్లోకి మద్యం ముడుపులు

మద్యం కుంభకోణానికి సంబంధించి సేకరించిన కీలక డేటాను చార్జిషీట్‌లో సిట్ ప్రస్తావించింది. నిందితులు ధ్వంసం చేసిన సెల్ ఫోన్లను ఐటీ నిపుణులతో డేటా రికవరీ చేసింది. దుబాయ్‌తో పాటు హైదరాబాద్, తాడేపల్లి డెన్‌ల ఫొటోలు సేకరించింది. లిక్కర్ ముడుపుల పర్యవేక్షణ, డెన్‌ల ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర వివరాలను అభియోగపత్రంలో పొందుపరిచింది. మద్యం పాలసీ తయారీ నుంచి లోకల్ బ్రాండ్ తయారీవరకు సాక్ష్యాధారాలను సేకరించింది. ముడుపుల సొమ్మును చలామణిలోకి తేవడంలో భాగంగా బ్లాక్‌ను వైట్‌గా మార్చినట్టు సిట్ గుర్తించింది. మద్యం ముడుపులను బంగారు షాపులలో పెట్టుబడులు పెట్టినట్టు కనుగొంది. మద్యం ముడుపులు షెల్ కంపెనీల ద్వారా 'అంతిమ లబ్ధిదారు'కు చేరడంపై 20రోజులలో మరో ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్టు సిట్ వర్గాలు తెలిపాయి.

ఆ ఎనిమిది మందీ పరారీలోనే..

సైమన్ ప్రసన్, కొమ్మారెడ్డి అవినాశ్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, సుజల్ బెహ్రాన్, మోహన్, రాజీవ్ ప్రతాప్, బొల్లారం శివకుమార్, ముప్పిడి అవినాశ్ రెడ్డి పేర్లు కొత్తగా నిందితుల జాబితాలో సిట్ అధికారులు చేర్చారు. వీరంతా పరారీలో ఉన్నారని సిట్ గుర్తించింది. ఇందులో ముప్పిడి అనిరుధ్ రెడ్డి....రాజ్ కసిరెడ్డి తోడల్లుడైన అవినాశ్ రెడ్డికి తమ్ముడు. అదాన్‌లో అనిరుధ్‌ను డైరెక్టర్‌గా పెట్టి రూ.800కోట్లకు పైగా లిక్కర్ ఆర్డర్లను రాజ్ కసిరెడ్డి ఇప్పించారు. బొల్లారం శివకుమార్‌ను అనిరుధ్ రెడ్డి స్థానంలోకి ఆ తర్వాత తెచ్చారు. ఇప్పటికీ ఆయనే కొనసాగుతున్నారు. సైమన్ ప్రసన్ ముడుపులు వసూళ్లచేసి రాజ్ కసిరెడ్డి చెప్పినట్లు సిద్ధం సభలకు, వైసీపీ వాళ్లకు చేర్చేవారు. రాజీవ్ ప్రతాప్ దుబాయ్ డెన్‌లో లెక్కలు చూసే ఐటీ పట్టభద్రుడు. మోహన్ కుమార్ హైదరాబాద్‌లో చికెన్ ఎంప్లాయ్ పేరుతో లిక్కర్ డెన్‌లను పర్యవేక్షించారు. సైమన్ ప్రసన్‌కు బావమరిది. సుజల్ బెహ్రాన్ మరో నిందితుడు తుతేకుల కిరణ్ కుమార్ రెడ్డికి స్నేహితుడు. ముడుపుల వసూళ్లలో క్రియాశీలకంగా వ్యవహరించారు. కొమ్మారెడ్డి అవినాష్ రెడ్డి తాడేపల్లి డెన్‌ను ప్రణయ్ ప్రకాశ్‌తో కలిసి పర్యవేక్షించారు. అనిల్ కుమార్ రెడ్డి డబ్బులు రూటింగ్ చేసేవారు. అనిరుధ్ రెడ్డికి బావమ్మర్ది. కాగా, గత ఏడాది సెప్టెంబరులో సీఐడీ కేసు నమోదు చేసినప్పుడు ఐదుగురి పేర్లు ఉండగా, కేసు సిట్ చేతికి చేరిన తర్వాత ఆ సంఖ్య 29కి చేరాయి. ఈ ఏడాది ఏప్రిల్ నాలుగో వారంలో రాజ్ కసిరెడ్డి(ఏ-1)ని అరెస్టు చేసినప్పుడు ఈ పేర్లు సిట్ బయటపెట్టింది. అందులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి (ఏ-4), విజయ సాయిరెడ్డి(ఏ-5) సహా పలువురు వ్యక్తులు, డిస్టిలరీలు ఉన్నాయి. ఆ తర్వాత దర్యాప్తులో లభించిన ఆధారాలతో మాజీ సీఎం జగన్ కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్ రెడ్డి పేర్లు చేర్చింది. కాఫీ షాపు ఉద్యోగిగా ఉంటూ 459కోట్లు లిక్కర్ టర్నోవర్ చేసిన లీలాడిస్టిలరీస్ డైరెక్టర్ వరుణ్ పురుషోత్తం(ఏ-40) పేరు చివర్లో ఉంది. తాజాగా ఎనిమిది మందిని చేర్చడంతో నిందితుల సంఖ్య 48కి చేరినట్లయింది.


వేములవాడలో భవనాలను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

రాజన్న ఆలయానికి ఇక రాజమార్గం

- వేములవాడలో మొదలైన రహదారి విస్తరణ
- 800 మీటర్ల పొడవు, 80 అడుగుల వెడల్పుతో రోడ్డు
- దాదాపుగా ముగిసిన ఇళ్ల కూల్చివేతల ప్రక్రియ

వేములవాడ కల్చరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఇక రాజమార్గం అందుబాటులోకి రానుంది. 54 ఏళ్లగా ఇరుకు రోడ్లతో భక్తులు, పట్టణ ప్రజలు పడుతున్న ఇబ్బందులకు తెరపడనుంది. స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండు నుంచి రాజన్న ఆలయం వరకు సుమారు 800 మీటర్ల పొడవు, 80 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించేందుకు మోక్షం లభించింది. రోడ్డు విస్తరణలో 243 మంది ఇళ్లను కోల్పోతున్నట్లు అధికారులు గుర్తించారు. వారికి నష్టపరిహారం చెల్లించేందుకు అంచనాలు వేసి చెక్కులను సిద్ధం చేశారు. రోడ్డు విస్తరణలో ఇళ్ల కూల్చివేత దాదాపు పూర్తి కావచ్చింది. 243 మంది నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించేందుకు నిర్ణయించి రూ. 47 కోట్లతో అంచనా వేశారు. జూన్ 16న 70 మంది నిర్వాసితులు ప్రభుత్వం అందించిన పరిహారం చెక్కులను తీసుకున్నారు. దీంతో అధికారులు భవనాల కూల్చివేతలను ప్రారంభించారు. తమకు పరిహారం తక్కువైందని పలువురు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నచ్చజెప్పడంతో సుమారు 200 మందికిపైగా నిర్వాసితులు పరిహారం చెక్కులు తీసుకున్నారు. దీంతో జూలై 18 నుంచి వారి ఇళ్లను కూల్చివేయడం మొదలైంది. కోర్టుకు వెళ్లి ఆరుగురు తెచ్చుకున్న స్టే గడువు జూలై 23న ముగియనుంది. వారి ఇళ్ల మినహా మిగిలిన అన్ని నిర్మాణాలు కూల్చివేడంతో రాజన్న ఆలయానికి రాజమార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది.

పెరిగిన పట్టణ విస్తరణ, జనాభా..

పేదల దేవుడిగా, కోడె కడితే కోటి వరాలు ఇచ్చే దైవంగా ప్రసిద్ధికెక్కిన రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రానురాను పెరుగుతోంది. బస్టాండు నుంచి రాజన్న ఆలయం వరకు వచ్చే రోడ్డు ఇరుకుగా ఉండటంతో భక్తులు, పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో పాటు పట్టణ విస్తీర్ణం, జనాభా కూడా పెరుగుతూ వస్తోంది. ఒకప్పుడు 10 వేలు ఉన్న పట్టణ జనాభా ప్రస్తుతం 60 వేలకు పైగా ఉంది. రోడ్డు వెడల్పుతో పట్టణ వాసులు, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ యాప్‌కు యువకుడి బలి

- అప్పు తీర్చలేదని నగ్న ఫొటోలు పెడతామని బెదిరింపులు
- మనోవేదనతో ఖమ్మం జిల్లాలో యువకుడి ఆత్మహత్య

వేంసూరు/సత్తుపల్లిరూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ యాప్‌లో అప్పు తీసుకొని చెల్లించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా వేంసూరు మండలం దుద్దేపూడిలో జరిగింది. దుద్దేపూడికి చెందిన ముత్యాల హరీశ్ (22) అలియాస్ హరి సత్తుపల్లి మండలం తుంబూరులో ఉంటూ హోటల్ నిర్వహిస్తున్నాడు. అలాగే కూలీ పనులకు వెళ్లే హరీశ్ ఓ ఆన్‌లైన్ యాప్‌లో రూ.5వేలు అప్పు తీసుకుని తిరిగి చెల్లించలేదు. ఈ క్రమంలో లోన్ యాప్‌కు సంబంధించిన వారు ఫోన్ చేసి హరీశ్‌ను బెదిరించారు. డబ్బులు చెల్లించకపోతే తన ఫొటోలను నగ్నంగా మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాలలో పెడతామని భయపెట్టారు. దాంతో తీవ్ర మనోవేదనకు గురైన హరీశ్ ఈ నెల 17న దుద్దేపూడి గ్రామ శివారులో కలుపు మందు తాగాడు. గ్రామస్థులు గమనించి అతని కుటుంసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే హరీశ్‌ను చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో.. శుక్రవారం రాత్రి హరీశ్ మృతిచెందాడు. హరీశ్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీళ్లనుకొని పురుగుల మందు తాగి యువకుడి మృతి

- ఆదిలాబాద్ జిల్లా కన్నాపూర్ గ్రామంలో ఘటన

సిరికొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దాహం వేస్తుండటంతో నీళ్లనుకొని పురుగుల మందు తాగి ఓ గిరిజన యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం కన్నాపూర్ గ్రామంలో జరిగింది. కన్నాపూర్ గ్రామానికి చెందిన ఆడ ప్రవీణ్ కుమార్ (22) గత మంగళవారం రాత్రి తన పొలంలో వేసిన మొక్కజొన్న పంటకు కాపలా కోసం వెళ్లాడు. అతనికి దాహం వేయడంతో పక్కనే ఉన్న పురుగుల మందు బాటిల్‌ను నీళ్ల సీసా అనుకొని తాగేశాడు. తర్వాత గమనించి వెంటనే తన కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. వారు వెంటనే అతడిని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ప్రవీణ్ కుమార్ శనివారం మృతి చెందాడు. ప్రవీణ్ కుమార్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బడిలో బ్యాంకు!

పెద్దపల్లి జిల్లా గర్రెపల్లి హైస్కూల్లో ప్రారంభం

- పిల్లలకు పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ, బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కల్పించడమే లక్ష్యం
- మేనేజర్ సహా 14 మంది సిబ్బంది.. అంతా విద్యార్థులే
- తరగతులకు అంతరాయం కలగకుండా నిర్వహణ


పెద్దపల్లి జిల్లా గర్రెపల్లిలో పాఠశాలలో విద్యార్థులకు బ్యాంక్ ఖాతా పాస్‌బుక్‌లు అందజేస్తున్న డీఈవో మాధవి

సుల్తానాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చక్కగా విద్యాబుద్ధులు నేర్చుకొని.. ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడ్డా ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగాలనుకునే జీవననౌకకు పొదుపు అనేది ఓ చుక్కానీ! కొదువలేనంతగా డబ్బు ఉన్నా ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోతే పరిస్థితులు తలకిందులయ్యేందుకు ఎంతో సమయం పట్టదు. ఈ పాఠాన్ని విద్యార్థులకు ఆచరణాత్మకంగా చెప్పేందుకు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు నడుంబిగించారు. జీవితంలో పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ అనేవి ఎంత విలువైనవో చెప్పేందుకు బడిలోనే ప్రత్యేకంగా 'స్కూల్ బ్యాంకు'ను ఏర్పాటు చేశారు. పొదుపుపై ఆసక్తిని పెంపొందించడమే కాదు.. విద్యార్థులకు బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కలిగించేందుకు ఈ 'స్కూల్ బ్యాంకు' నిర్వహణను చిన్నారులకే అప్పజెప్పాలని నిర్ణయించారు. అచ్చంగా బ్యాంకులో మాదిరే లావాదేవీలు ఉండేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. స్కూల్ బ్యాంక్‌లో డబ్బు జమ చేయాలనునే, విత్‌డ్రా చేయాలనుకునే విద్యార్థులు క్రెడిట్, డెబిట్ వోచర్లను స్వహస్తాలతో నింపుతారు. బ్యాంకింగ్ సేవల నిర్వహణ కోసం మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ సహా ఈ స్కూల్ బ్యాంకులో మొత్తంగా 14 మంది సిబ్బంది ఉంటారు. వీరంతా కూడా ఆ బడిలో చదివే పిల్లలే!! ఒకరు మేనేజర్, మరొకరు అసిస్టెంట్ మేనేజర్, ముగ్గురు చొప్పున క్యాషియర్లు, అకౌంటెంట్లు, ఇద్దరు క్లర్కులు, నలుగురు హెల్ప్‌డెస్క్ సిబ్బందిగా వ్యవహరిస్తారు. అయితే.. తరగతులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఉదయం, సాయంత్రం, మధ్యాహ్న భోజన విరామ సమయంలో కొద్దిసేపు నిర్వహిస్తారు. గర్రెపల్లి బడిలో స్కూల్ బ్యాంకును శనివారం డీఈవో మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా బడిలోని ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆమె అభినందించారు. జనగావ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఒకటి చొప్పున స్కూల్ బ్యాంకులు ఉన్నాయని.. గర్రెపల్లిలో ఏర్పాటు చేసిన స్కూల్ బ్యాంకు రాష్ట్రంలో మూడోదని ఆమె వివరించారు. బడి పిల్లల్లో 207 మంది విద్యార్థులు స్కూల్ బ్యాంకులో ఖాతాలు తెరిచారని చెప్పారు. వారికి ఆమె బ్యాంకు పాస్ బుక్కులు అందజేశారు.

సామాజిక చింతనాశీలి గురుకుల మిత్రా

తెలుగుభాష, జాతి, చరిత్ర, సంస్కృతులని లోతుగా అధ్యయనం చేసిన ప్రజ్ఞాశాలి డాక్టర్ గురుకుల మిత్రా. సకల అభ్యుదయ శక్తుల్ని మిళితం చేసి 'సమసంఘం' సంస్థను రూపొందించినవాడు. బడుగు, బలహీనవర్గాల రాజ్యాధికారం కోసం ఒక శాస్త్రీయ దృక్పథాన్ని వెలువరించిన మిత్రా, దేశంలోని వామపక్ష, ప్రగతిశీల సంఘాలన్నింటినీ సమన్వయం చేసి, 'బలహీన వర్గాల సమాఖ్య' ఏర్పరిచాడు. దళిత బహుజన శ్రేణులు అన్నింటినీ ఒక్క తాటి పైకి తీసుకొని రావడానికి ప్రయత్నం చేశాడు. అనాడే కులగణన కోసం గొంతు విప్పిన వ్యక్తి మిత్రా.

గుంటూరు జిల్లా రేపల్లెలో జూలై 21, 1933లో జన్మించిన మిత్రా, విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. గుడివాడలో హోమియో వైద్యం అభ్యసించాడు. రాడికల్ వామపక్ష ఉద్యమాలలో క్షేత్రస్థాయిలో పనిచేశాడు. పేదరికాన్ని అనుభవిస్తూనే అసాధారణ అధ్యయనం చేశాడు. కలకత్తాలో పీజీ చదివి, చైనా వెళ్ళి షాంఘై విశ్వవిద్యాలయంలో ఆక్యుపంక్చర్ ఎం.డి. చేశాడు. ఆధునిక పద్ధతులలో ఆ విధానాన్ని మెరుగుపరిచి, భారతదేశంలో ప్రత్యామ్నాయ ఆక్యుపంక్చర్ పద్ధతిని కనుగొన్నాడు. కొన్ని వందల హెల్త్ క్యాంపులు నిర్వహిస్తే, ప్రభుత్వం ప్రత్యేకంగా బస్సులు నడిపేదంటే, వాటికి ఉన్న ప్రజాదరణను ఊహించవచ్చు. ప్రత్యామ్నాయ వైద్యగ్రంథాలు రచించాడు. ఎందరో వైద్యుల్ని, ఆరోగ్య కార్యకర్తల్ని తయారు చేశాడు.



ఒకవైపు వైద్యుడిగా పనిచేస్తూనే, అన్నిరకాల భావోద్యమాల్లోనూ అవిశ్రాంతంగా కృషి చేశాడు. జాతి విముక్తి పోరాటాలు చేస్తున్న రాష్ట్రాలన్నింటిలో అధ్యయన పర్యటనలు చేయడమే కాక, అన్ని ప్రజాసంఘాలతో ఎల్లప్పుడూ చర్చిస్తూనే ఉండేవాడు. అక్రమ కేసుల్లో అనేకసార్లు అరెస్టయ్యాడు. ఒక దశలో మిత్రా మీద నిరంతరం రహస్య నిఘా ఉండేది. కొండపల్లి సీతారామయ్య మొదలుకుని వావిలాల గోపాలకృష్ణయ్య వరకు దేశంలోనూ, తెలుగు ప్రాంతంలో మిత్రాకి పరిచయం లేని బుద్ధిజీవులు లేరు. అటు వామపక్ష ప్రగతిశీల పార్టీల నుంచి, ఇటు నాస్తిక హేతువాద సంఘాల దాకా ప్రజాసంఘాలకి వెన్నుదన్నుగా నిలిచిన మేధావి మిత్రా. ఆ రోజుల్లో తాను దైవాంశ సంభూతుడినని ప్రచారం చేసుకుంటున్న ఒక ప్రఖ్యాత బాబా దగ్గర మారువేషంలో కొంత కాలం శిష్యుడిగా చేరి అక్కడి మోసాల్ని బట్టబయలు చేసి, మహిమలు లేవని నిరూపించిన వ్యక్తి.

భాష విషయంలోనూ మిత్రా తనదైన కృషి చేశాడు. సులువైన వర్ణ క్రమంతో తెలుగు అక్షరమాలని ఆయన ప్రయోగించేవాడు. తన కవితల్లో, రచనల్లో కూడా క్లిష్టమైన, గ్రాంధిక పదాల బదులు అందరికీ అర్థమయ్యే తేలికపాటి వాక్యాల్నే ఆయన ఉపయోగించేవాడు. రోజువారీ వ్యవహారాల్లో తెలుగు భాష ప్రాముఖ్యత గుర్తించాలనే డిమాండుతో మిత్రా అన్ని తెలుగు జిల్లాలలో సమావేశాలు నిర్వహించి, 'తెలుగు మహాసభ' స్థాపించాడు. ప్రజా పోరాటాలను నడిపాడు. "దైనందిన జనజీవన పాలనా విధానంలో, బోధనా రంగంలోనూ తెలుగు భాషనే వాడాలి" అంటూ నాటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు ఉత్తర్వులు జారీ చేయడంలో మిత్రా కృషి కూడా ఉంది.

అప్పటివరకూ కేవలం నినాదంగా ఉన్న బహుజన రాజ్యాధికారానికి స్పష్టమైన తాత్విక భూమికను మిత్రా రచించాడు. 'సామాజిక న్యాయం' అనే మౌలిక ప్రజాతంత్ర భావన ఆధారంగానే ప్రత్యామ్నాయ రాజకీయ స్రవంతులు ఉండాలని నిర్దేశించాడు. ఏ సామాజిక సిద్ధాంతానికైనా 'సమానతే' ప్రాతిపదిక కావాలని ప్రకటించాడు. పీడిత కులాలు ఏకం కావాలని చెబుతూ, దామాషా ప్రకారం అవకాశాలు అన్ని కులాలకు ఉండాలి అంటాడు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ జనాభా ఉన్న తెలగ, బలిజ, మున్నూరు కాపు, తూర్పు కాపు వంటి ఉప కులాలన్నీ సమాఖ్యగా ఏర్పడి కాపు కులం చోదక శక్తిగా మారాలని ఆశించిన మిత్రా 'కాపునాడు' రూపకర్త. పీడిత తాడిత, దళిత బహుజన సబ్బండ కులాల ఐక్య సంఘటన ప్రాధాన్యతను ఎన్నడో చాటి చెప్పినవాడు.

సామాజిక మార్పు కోసం కృషి చేసిన మిత్రా ఏప్రిల్ 13, 2007న మరణించాడు. తన మరణానంతరం పార్థివ దేహాన్ని నిట్టనిలువుగా పూడ్చమనే చిత్రమైన కోరిక ఆయన కోరాడంటారు. మిత్రా అముద్రిత రచనలు, శాస్త్రీయ ఆక్యుపంక్చర్ గ్రంథాలు వెలికి తీయాల్సి ఉంది. భావజాల పరంగా మిత్రా ఆలోచనలకు నేడు మరింత ప్రాసంగికత ఉంది. వైద్యునిగా, సామాజిక చింతనాశీలిగా, సాంస్కృతిక దార్శనికుడిగా మిత్రా కృషి ప్రశంసనీయమైనది. జూలై 21న గురుకుల మిత్ర జయంతి. ఆయన ఆశయాల్ని మరింత ముందుకు తీసుకువెళ్ళడమే ఆయనకి ఇవ్వగలిగే క్రియాశీలక నివాళి.

○ గౌరవ్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

కచ్చాతీవు వలలో భారత జాలరి!

తమిళనాట శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న కొద్దీ పొదిలో దాచిపెట్టిన ఆయుధాల తుప్పు వదిలించి, మళ్లీ పదునుపెట్టే ప్రక్రియ జోరందుకుంది. వాటిలో కీలకమైనది కచ్చాతీవు దీవి వివాదం. ఎప్పుడో శ్రీలంకకు ధారపోసిన ఆ దీవి– భారతీయ, ప్రత్యేకించి తమిళనాడుకు చెందిన మత్స్యకారుల పట్ల మరణశాసనం లిఖిస్తున్న నేపథ్యంలో– ఈ సమస్యకొక తార్కిక పరిష్కారం తప్పదన్న దృఢాభిప్రాయం వేళ్లూనుకుంటోంది. బాధ్యత ఎవరిదైనా, బాధితులు సామాన్య జాలర్లే. వలలో నుంచి వారిని విడిపించవలసిందే. కానీ ప్రతిసారీ ఎన్నికల వేళనే ఈ అంశం తెరమీదకు రావడం. తరువాత మరుగునపడి పోవడం పరిపాటైపోయింది. తాజాగా, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ మరోమారు కచ్చాతీవు అస్త్రాన్ని ప్రయోగించారు. కచ్చాతీవును తిరిగి స్వాధీనం చేసుకోవాలంటూ తమిళనాడు అసెంబ్లీ ఎప్పుడో తీర్మానం ఆమోదించినప్పటికీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంత మాత్రం పట్టించుకోవడం లేదంటూ బుధవారం విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో నేరుగా జోక్యం చేసుకుని, సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. అంత వరకు బాగానే ఉన్నా, చివరకు వివాదజలాల్లో ఓట్ల వేటగానే ఈ అంశం మిగిలిపోయే అవకాశాలే ఎక్కువ.

సంబంధిత పార్టీలు పుష్కలంగా రాజకీయ పంట పండించుకుంటున్న కచ్చాతీవు, వాస్తవంలో నిర్మానుష్య బంజరు దీవి. హిందూ మహాసముద్ర ప్రాంతంలో తిష్ట వేసి బలోపేతం అయ్యే దిశలో చైనా దూకుడు, మరోవైపు తమ జలాల్లోకి దూసుకొస్తున్నారంటూ సముద్రంలో వేటకు వెళుతున్న తమిళనాడు జాలర్లను శ్రీలంక తీర రక్షక దళాలు అరెస్టులు చేయడం, వారి మర పడవలను స్వాధీనం చేసుకోవడం నిత్యకృత్యంగా మారింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడీ దీవి చుట్టూ అల్లుకున్న వివాదం అగ్నిపర్వతమై పేలుతోంది. ఆ రాష్ట్రంలోని.. ముఖ్యంగా రామనాథపురం, నాగపట్టణం, తంజావూరు, పుదుకొట్టాయ్‌లకు చెందిన నాలుగువేల మందికి పైగా జాలర్లను శ్రీలంక నేవీ గత పదేళ్లలో అరెస్టు చేసింది. వారికి చెందిన 600కు పైగా బోట్లను స్వాధీనపరచుకుంది. తమిళనాడు జాలర్ల మీద కాల్పులు జరిపిన సందర్భాలు, ఆ కాల్పుల్లో వారు దుర్మరణం పాలైన ఘటనలు ఎన్నో! అందుకే ఇది చిన్న సమస్య ఏమీ కాదు. కచ్చాతీవు దీవిని అప్పనంగా శ్రీలంకకు అప్పగించి, సముద్ర జలాల్లో సరిహద్దు గీతలు గీయడం ద్వారా ఈ సంక్షోభానికి నాటి కాంగ్రెస్–డీఎంకే ప్రభుత్వాలు కారణమయ్యాయని, ఈ అరాచకానికి మొత్తం బాధ్యత వాటిదేనని నరేంద్ర మోదీ పలు సందర్భాల్లో ఆరోపించారు. ఆనాటి ఒప్పందాన్ని కాంగ్రెస్ సమర్థిస్తుండగా, అందులో భాగస్వామి అయిన డీఎంకే మాత్రం తమకేమీ తెలియదని, తమ పాపమేదీ లేదని అంటోంది. ఇంతకీ తప్పొప్పులు ఎవరివి?

భారత్, శ్రీలంక మధ్య పాక్ జలసంధిలో ఉన్న 285 ఎకరాల చిన్న దీవి ఇది. దీని పొడవు 1.6 కిలోమీటర్లు. వెడల్పు 300 మీటర్లు. ఇది, రామేశ్వరానికి దాదాపు 33 కిలోమీటర్ల ఈశాన్యంలో ఉంది. హిందూ మహాసాగరం మధ్యలో ఉందన్నమాటే కానీ, తాగడానికి గుక్కెడు మంచి నీళ్లు కూడా దొరకవు. సెయింట్ ఆంటోనీ చర్చిని మినహాయిస్తే, ఇక్కడ ఎలాంటి నిర్మాణాలూ లేవు. అడపాదడపా పర్యాటకులు వచ్చి పోవడమే తప్ప, ఇది జనావాస ప్రాంతమే కాదు. వార్షికోత్సవం మినహాయిస్తే ఆ చర్చి సైతం ఏడాది పొడవునా దాదాపు మూతపడే ఉంటుంది. 17వ శతాబ్దంలో జాఫ్నా సంస్థానం పరిధిలో ఉన్న ఈ కచ్చాతీవు దీవి, తర్వాతి కాలంలో రామనాథపురంలోని రాజారామనాథ సేతుపతి జమీందార్ చేతుల్లోకి చేరింది. బ్రిటిష్ వారి పాలనలో మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా ఉండేది. స్వాతంత్ర్యానంతరం జమీందారీల వ్యవస్థ రద్దు తర్వాత, తమిళనాడు ప్రభుత్వం అధీనంలోకి వచ్చింది. ఈ దీవి ప్రాంతంలో చేపల వేట విషయంలో భారత్, శ్రీలంక 1921 నుంచి తగాదా పడుతూనే ఉన్నాయి. ఇరుగు-పొరుగు దేశాలతో సత్సంబంధాలు పెంపొందించుకునే ప్రక్రియలో భాగంగా 1974 జూన్‌లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, నాటి శ్రీలంక ప్రధాని సిరిమావో బండారనాయకేతో దీనిపై అంగీకారం కుదుర్చుకున్నారు. ఆడమ్స్ బ్రిడ్జి వరకు గల సముద్ర జలాల్లో సరిహద్దు రేఖ గీస్తూ, ఈ దీవి మీద సర్వాధికారాలను శ్రీలంకకు కట్టబెడుతూ ఆనాడు నాయకులు ఇద్దరూ ఒప్పందంపై సంతకాలు చేశారు. రెండేళ్ల తర్వాత, 1976లో అది అమల్లోకి వచ్చింది. అప్పట్లో తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న డీఎంకే అధినేత కరుణానిధి ఎరుకతోనే ఒప్పందం కుదిరిందని, రాజకీయ కారణాలతో ఆయన దానికి బహిరంగ మద్దతు మాత్రం ప్రకటించలేదని ఐక్యరాజ్యసమితిలో భారత దౌత్యవేత్తగా పనిచేసిన ఆర్. కన్నన్ తన పుస్తకం... 'డీఎంకే ఇయర్స్: అసెంట్, డిసెంట్, సర్వైవల్'లో స్పష్టం చేశారు. అదేమీ తనకు తెలియనట్లే ఇప్పుడు స్టాలిన్ వ్యవహరిస్తుండటం ఆశ్చర్యకరం.

ఆనాటి ఒప్పందం ప్రకారం... తమిళనాడుకు చెందిన జాలర్లు చేపల వేట సందర్భంగా విశ్రాంతి తీసుకోవడానికి, వలలను ఆరబెట్టుకోవడానికి మాత్రమే కచ్చాతీవును ఉపయోగించుకోవాలి. సెయింట్ ఆంటోనీ చర్చి కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకోవచ్చు. దీవి వద్ద మత్స్య సంపద మీద వారికి ఎలాంటి హక్కూ లేదు. అదంతా శ్రీలంక సర్కారుకు ధారాదత్తం. ఈ నిబంధనలే తమిళనాడు జాలర్ల పాలిట శాపంగా మారాయి. సముద్రంపై గీత, వారి తలరాతనే తిరగరాసింది. వారి జీవనాధారాన్ని చెరిపివేసింది. వేటలో పడి జాలర్లు ఏ మాత్రం ముందుకు వెళ్లినా.. అంతర్జాతీయ జల సరిహద్దుల అతిక్రమణ పేరిట శ్రీలంకలో జైళ్ల పాలవుతున్నారు. పరిస్థితి తీవ్రతను తమిళనాడు ముఖ్యమంత్రిగా జయలలిత అప్పట్లోనే గ్రహించారు. రాజ్యాంగ సవరణ చేయకుండా ఒక దేశం మరో దేశానికి ఎలాంటి భూభాగాన్నీ బదిలీ చేయడానికి వీలులేదని, అందువల్ల కచ్చాతీవు భారత్‌కే చెందుతుందని ప్రకటించాలని కోరుతూ.. 2008లో ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాస్తవంలో, భూబదిలీని అప్పటి కేంద్ర క్యాబినెట్ కానీ, పార్లమెంట్ కానీ ఆమోదించిన దాఖలాలు సైతం లేవు. తమిళనాడు సర్కారు తరఫున ఆనాడు జయలలిత దాఖలు చేసిన పిటిషన్ మీద సెప్టెంబర్ 15న సుప్రీంకోర్టు విచారణ జరపనుండటం ఈ సందర్భంగా కీలకాంశం. ఉభయ దేశాల మధ్య ఒప్పందం అంటూ కుదిరాక.. అది అంతర్జాతీయ చట్టాల పరిధిలోకి వచ్చేసినట్టే. అందువల్ల దీనిపైన సుప్రీంకోర్టు కూడా చేసేదేమీ ఉండదు. ఇది ముగిసిన అధ్యాయమని, కచ్చా తీవును తిరిగి పొందాలంటే శ్రీలంకతో యుద్ధం అవసరమవుతుందని 2014 ఆగస్టులో అప్పటి అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టులోనే స్పష్టం చేశారు. అలాగని ఆశలన్నీ వదిలేసుకోవాల్సిన పని కూడా లేదు. సమస్యను ఉభయతారకంగా పరిష్కరించుకోవడానికి కొన్ని మార్గాలు ఇప్పటికీ ఉన్నాయి. కచ్చాతీవును శ్రీలంకకు అప్పగించడానికి ముందు వరకు తమిళనాడు జాలర్లు ఆ ప్రాంతంలో 24 నాటికల్ మైళ్ల దూరం వరకు వెళ్లి, చేపలు వేటాడేవారు. ఒప్పందం తర్వాత అది 12 నాటికల్ మైళ్లకు కుదించుకు పోయింది. ఏ మాత్రం గీటు దాటినా, వారు శ్రీలంక నేవీ వలకు చిక్కి, చేపల్లా గిలగిలలాడుతున్నారు. ఈ నేపథ్యంలో.. ఇదివరకటిలాగే 24 నాటికల్ మైళ్ల దూరం వరకు చేపల వేటకు అనుమతించాలన్న తమిళనాడు జాలర్ల డిమాండ్ సమంజసమైనదే. దీనిపై శ్రీలంక ప్రభుత్వంతో మోదీ సర్కారు చర్చించాలి.



కచ్చాతీవు దీవి ప్రాంతంలో చేపల వేట విషయమై భారత్–శ్రీలంక 1921 నుంచి తగాదా పడుతూనే ఉన్నాయి. ఈ దీవి మీద సర్వాధికారాలను శ్రీలంకకు కట్టబెడుతూ 1974లో ఇరు దేశాల ప్రధానులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో నిబంధనలే తమిళనాడు జాలర్ల పాలిట శాపంగా మారాయి. సాగర జలాల్లో వివాదాల వేటను మాని, ఇరు దేశాల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తే, దశాబ్దాల సమస్య నుంచి జాలర్లు బయటపడతారు.

మరో దారి ఉంది... పాక్ జలసంధిలో మూడు రోజుల పాటు శ్రీలంక జాలర్లకు, మరో మూడు రోజులపాటు భారత జాలర్లకు చేపల వేటకు అనుమతించవచ్చు. ఒక రోజు సెలవు ప్రకటించవచ్చు. ఇంకో దారీ లేకపోలేదు. ఉభయ దేశాల జాలర్లతో సహకార సంఘాలు ఏర్పాటు చేయాలి. సాగర జీవావరణ– పర్యావరణాలకు ఎలాంటి హాని కలగని రీతిలో, ఆధునిక పద్ధతుల్లో, పరస్పర సమన్వయంతో చేపల వేట సాగించే మార్గాలు అన్వేషించాలి. ఇలాంటి చర్యల వల్ల ఏ పక్షమూ కోల్పోయేదేమీ ఉండదు. సాగర జలాల్లో వివాదాల వేటను మాని, రెండు దేశాల ప్రభుత్వాలు ఈ దిశలో చిత్తశుద్ధితో కృషి చేస్తే... దశాబ్దాల సమస్యల వలలో నుంచి జాలర్లు సురక్షితంగా బయటపడతారు.

■ పి.దత్తారాం ఖత్రీ
సీనియర్ జర్నలిస్టు

అంబేడ్కరిస్టు సాహిత్యానికి దారిదీపం!

డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రతిపాదించిన సాంఘీక ప్రజాస్వామ్యం, ఆర్థిక సమానత్వం, అణగారిన వర్గాలకు రాజ్యాధికారం, ప్రత్యామ్నాయ సంస్కృతి, రాజ్యాంగ నైతికత తదితర అంశాల గురించి నేడు విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. అంబేడ్కర్ ఆలోచనా విధానం, జై భీమ్ నినాదం వర్తమాన కాలానికి నూతన కర్తవ్యాన్ని ప్రబోధిస్తున్నాయి. ఆధునిక తెలుగు కవిత్వంలో ఈ విధమైన దృష్టికి మార్గదర్శకంగా నిలిచిన కవి చోడగిరి చంద్రరావు. ఆరున్నర దశాబ్దాల క్రితమే అంబేడ్కర్ బహుముఖీన ఔన్నత్యాన్ని, మూర్తిమత్వాన్ని స్ఫూర్తిదాయకంగా కవిత్వంలో చాటి చెప్పిన కవి చంద్రరావు. డెబ్బయ్యో దశకంలో అరుణారుణ సృజన ప్రభంజనానికి ఎదురొడ్డినిలిచి, తన అస్తిత్వ చైతన్యంతో 'భీమైక' ఎరుకతో ప్రభావశీలమైన పద్య కవిత్వం రాసిన చంద్రరావు గురించి సాహిత్యంలో పెద్దగా చర్చ జరగలేదు.

'మధురకవి' చోడగిరి చంద్రరావు గోదావరి తీరంలో కోరుమిల్లి గ్రామంలో నిరుపేద మాల కుటుంబంలో 1932, జూలై 15న జన్మించాడు. రామచంద్రపురం జాతీయ ఉన్నత పాఠశాల, కాకినాడ పి.ఆర్. కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి, మైసూర్ శాండిల్ కంపెనీలో కొంతకాలం ఉద్యోగం చేసి, ఆ తరువాత రైల్వే శాఖలో సూపర్ వైజర్‌గా పదవీ విరమణ చేశాడు. హృదయవీణ (1968), భీమ శతకం(1972), చంద్రరావు గీతాలు (1974), చంద్రరావు కవిత (1977), అన్వేషణ (1981), భీమ శతకం రెండవభాగం (1989) వంటి కృతులు వెలువరించాడు. శతకం, ఖండకావ్యం, వచన కవిత, పాట తదితర సాహిత్య ప్రక్రియల్లో విలువైన రచనలు చేసిన చంద్రరావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, జ్ఞానానంద కవి, సి. నారాయణరెడ్డి వంటి కవుల మన్ననలు పొందాడు. తన గురువు, సుప్రసిద్ధ పద్యకవి వేదుల సత్యనారాయణశాస్త్రి ప్రోత్సాహంతో విద్యార్థిగా ఉన్నప్పుడే చంద్రరావు కవిత్వరచన ప్రారంభించాడు. 'వేకువ' (1950) పద్యసంపుటిని వేదులకు అంకితమిచ్చాడు. వేదుల సత్యనారాయణశాస్త్రి చంద్రరావును గుండెలకు హత్తుకొని ఆదరించాడు. 'అంటరానివాడిని ఎందుకు ఇంటికి తీసుకొస్తావు' అని బంధువులు మందలించినా లెక్కచేయకుండా తుదిశ్వాస విడిచేవరకు చంద్రరావును ప్రాణప్రదంగా ప్రేమించాడు. వేమన, వేదుల సత్యనారాయణశాస్త్రి, జాషువ, బోయి భీమన్నలను చంద్రరావు తన సాహిత్య గురువులుగా భావించాడు. ఈ నలుగురు కవనమూర్తుల ఉమ్మడి ప్రభావం వీరి కవిత్వంలో కనిపిస్తుంది.

కవిత్వంపట్ల, కవిత్వప్రయోజనం పట్ల చంద్రరావు స్పష్టమైన అభిప్రాయాలను ప్రకటించాడు. పీడితుల దుఃఖ విముక్తికి దోహదపడేదే ఉత్తమ కవిత్వమని సూత్రీకరించాడు. ప్రారంభ దశలో ఈ కవి 'నన్ను కన్నభూమి, నా అన్నదమ్ములన్/ చిత్రహింస జేసి చితుల ద్రోయ/ ప్రేమ కవిత నేను ఏ మొగమ్మున వ్రాతు?' అని ఆత్మవిమర్శ చేసుకొని తన జాతిజనుల బతుకువెతలను ఆర్ద్రంగా కవిత్వీకరించాడు. ఆకలి తెలిసిన, లోకం తెలిసిన సామాన్యుడే సర్వజ్ఞుడు అని నిర్ధారించాడు. సామాన్యుడు సుఖపడితే అది స్వర్గమని, దుఃఖపడితే అది నరకమని సగటు మనిషి కేంద్రంగా స్వర్గనరకాలను పునర్నిర్వచించాడు.



కవితా రచన చేయడానికి స్పష్టమైన తాత్త్విక మార్గం అవసరం. 1944లో ఆంధ్రా పర్యటనలో భాగంగా అంబేడ్కర్ కాకినాడ వచ్చినపుడు చంద్రరావు ఆయనను చూసి భావోద్వేగబంధాన్ని ఏర్పరచుకున్నాడు. ప్రముఖ అంబేడ్కరిస్టు, బౌద్ధ ఉపాసకులు శ్రీరాములు, మారెళ్ల కేశవరావులతో కలిసి కాకినాడలో చంద్రరావు అంబేడ్కర్ జయంతి సభలు, సాహిత్య సభలు నిర్వహించేవాడు. కుసుమ ధర్మన్న, రావూరి ఏకాంబరం ప్రేరణతో అంబేడ్కర్ భావాలను, ఆశయాలను అందిపుచ్చుకున్నాడు. అంబేడ్కర్ గురించి తెలుగులో తొలి స్మృతిగీతం (1956) రాసింది కూడా చంద్రరావే. 'నీ జీవితమును ఆదర్శముగ నిడుకొని బ్రతికెదమయ్యా/ నీ ఆశయములు నెరవేరగ నిరతము పోరెదమయ్యా/ నీ నవయానమును మేలగు పథముగ నెంచి/ నీవు నడిచిన పథమును విడువగా లేము' అంటూ అంబేడ్కర్‌కు అక్షర జోహారులు ప్రకటించాడు. హార్మోనియం వాయిస్తూ చంద్రరావు స్వయంగా స్వరపరిచిన ఈ పాట పాడుతుంటే గోదావరి జిల్లాల్లో ప్రజలు కన్నీటి పర్యంతమయ్యేవారు. దేశంలో మార్క్సిస్టు సాహిత్యం వెల్లువెత్తుతున్న దశలో 1960ల ప్రాంతంలో మరాఠీలో కూడా 'భీమ్ సాహిత్యం' అనే పేరు లేనప్పుడు ఎంతో దార్శనిక దృష్టితో చంద్రరావు కాకినాడలో 'భీమ్ సాహితీ స్రవంతి' అనే సంస్థను స్థాపించి అంబేడ్కర్ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశాడు. 'భీమ కవిని' నేను అని సగర్వంగా చెప్పుకున్నాడు. 'ఏమి సెప్పనయ్య! భీమ రాయ!' అనే మకుటంతో రెండు భాగాలుగా భీమశతకం రచించాడు. చంద్రరావు రచనల్లో భీమ శతకం అత్యంత విశిష్టమైనది. ఈ శతకం ఆధునిక సాహిత్యంలో అంబేడ్కర్ ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. తెలుగులో అంబేడ్కరిస్టు సాహిత్యానికి చంద్రరావు దారిదీపంలా కనబడతాడు. 'కవిత నీవు, నాకు కావ్య వస్తువు నీవు/ కంఠ మందు నీవు, కనుల నీవు/ నీవు లేని నేను నిర్జీవ ప్రతిమనే/ ఏమి సెప్పనయ్య భీమరాయ' అంటూ చంద్రరావు అసామాన్యమైన అంబేడ్కర్ స్ఫూర్తిని ఆవాహన చేసుకొని, ఆయన రాజకీయ, సామాజిక లక్ష్యాలను సుబోధకంగా పద్యీకరించాడు. మనువాదాన్ని, సమాజంలో వేళ్లూనుకున్న మూఢనమ్మకాలను చంద్రరావు తన కవిత్వం ద్వారా ఖండించాడు. 'అంటరానితనము అంతరించని యెడ/ భరత జాతిచరిత భ్రష్టమగును' అని కులనిర్మూలనాతత్త్వాన్ని ప్రబోధించాడు. 'భీమకవి'గా కోనసీమ ప్రజల నీరజనాలందుకున్న ఈ కవి 1997 అక్టోబర్ 8న మరణించాడు.

డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ గురించి విశ్వవ్యాప్తంగా సమాలోచనలు జరుగుతున్న సందర్భంలో భీమ దృక్పథాన్ని సమర్థవంతంగా చాటిచెప్పిన చోడగిరి చంద్రరావు కవిత్వంపై విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరగాలి. సమున్నత మానవీయ విలువలకు, రాజ్యాంగ నైతికతకు ఆలవాలమైన వీరి కవితలను పాఠ్యాంశాలుగా ఎంపిక చేయాలి.

◆ డాక్టర్ కోయి కోటేశ్వరరావు
(నేడు కాకినాడలో చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ)

బాలాజీ పీష్వా: శివాజీ స్వరాజ్య స్వప్నసాధకుడు

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ నెల 4వ తేదీన పూనేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ ప్రాంగణంలో బాజీరావు పీష్వా విగ్రహాన్ని ఆవిష్కరించి, బాజీరావు యుద్ధ కౌశలాన్ని ఘనంగా కీర్తించారు. ఛత్రపతి శివాజీ స్వరాజ్యకాంక్షను పీష్వాలు వందేళ్ళపాటు కొనసాగించకుంటే, భారతదేశ మౌలిక నిర్మాణం అంతరించిపోయి ఉండేదన్నారు అమిత్‌షా.

> **మరాఠా గొప్ప యోధులందరినీ ఛత్రపతి సాహు పక్షాన కూడగట్టి, ధమాజీ, ధోరాట్ లాంటి బందిపోట్ల ముఠాలను బలప్రయోగంతో అణిచివేసి, రాజ్యంలో శాంతి స్థిరత్వాలను మెరుగుపరిచాక బాలాజీ పీష్వా మొగలులపై దృష్టి పెట్టాడు. అతని కొడుకు బాజీరావు నిజామును పాల్‌కేడ్‌లోను, ఆ తర్వాత భోపాల్‌లోను చిత్తుగా ఓడించాడు. సిద్దిలు, పోర్చుగీసు వారు ఆక్రమించిన మరాఠా ప్రాంతాలను కూడా విముక్తం చేశాడు. రాజపుత్రుల సహాయంతో ఉత్తర భారతదేశాన్ని పూర్తిగా జయించాడు.**

"ఛత్రపతి శివాజీ, శంభాజీల మరణం తర్వాత ఏమి జరిగింది?"

శంభాజీ మరణానంతరం మరాఠా సామ్రాజ్యానికి ఆయన భార్య ఏసుబాయి తన ఏడేళ్ల కుమారుడిని కాకుండా, తన మరిది, శంభాజీ తమ్ముడైన రాజారామ్‌ను సింహాసనాధిష్టుణ్ణి చేసింది. శంభాజీని గెలిచాను కదా, ఇక మరాఠా సామ్రాజ్యం తన వశమైనట్లేనని ఔరంగజేబు కన్న కల మళ్ళీ వక్రీకరించి, ఆయన ఢిల్లీకి వెళ్లకుండా దక్షిణ భారతంలోనే మళ్లీ యుద్ధంలో కూరుకుపోయాడు. మరాఠాలు వారికే ప్రత్యేకమైన గెరిల్లా యుద్ధ తంత్రంతో ఆ పశ్చిమ కనుమల్లో ఔరంగజేబు సైన్యాల్ని చికాకుపరిచి ఓడించారు.

ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఛత్రపతి రాజారామ్ ఉంటున్న జింజికోటను ముట్టడించిన మొగల్ సైన్యానికి రాజారామ్ చిక్కలేదు. పైగా, 1698లో సతారను కూటమి కేంద్ర స్థానంగా చేసుకుని మొగలులపై యుద్ధం సాగించాడు. ఆయన చేసిన యుద్ధాల్లో ఎంతో సహకరించి కీలకమైన గెలుపులకు కారణమైన సేనాపతి శాంతాజీ గోర్పడే, ధనాజీ జాదవ్‌ల ప్రతాపాన్ని ఇక్కడ చెప్పుకోవాల్సిందే. శాంతాజీ పేరు చెబితే మొగల్ సైన్యం ఎలా హడలిపోయేదో మొగల్‌ల సమకాలికుడైన పర్షియన్ చరిత్రకారుడు 'ఖాఫిఖాన్' ఏమి చెప్పాడో చూడండి. "మరాఠాల సైన్యాధిపతి శాంతాజీని ఎదుర్కొనే ప్రతివాడూ చావనైనా చచ్చేవాడు, లేక బందీగానైనా చిక్కేవాడు, మొగల్ చక్రవర్తి కొలువులో ఏ సర్దార్‌కూ అతనిని నిరోధించేందుకు ధైర్యం చాలేది కాదు." 1699 డిసెంబర్ 22న రాజారామ్ రాసిన ఈ లేఖను చూస్తే మొగలులపై ఆయన సాధించిన కీలక విజయం మనకు అర్థమవుతుంది. "మేము ఔరంగాజేబు సైనిక శిబిరంపై దాడి చేసి ఆయన కుమార్తెనే బందీగా చేసుకున్నాం.. త్వరలోనే ఔరంగాజేబును పూర్తిగా ఓడిస్తాం." 1700 మార్చి 2న పిన్న వయసులోనే రాజారామ్ జబ్బుపడి, ఆకస్మికంగా మరణించాడు.

అనంతరం రాజారామ్ భార్య తారాబాయి తన సైనిక వ్యూహాలతో మొగల్‌లపై పోరాటాన్ని ఒక ప్రజాయుద్ధంగా మార్చివేసింది! దీంతో మరాఠాలకు ఇక వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. మరాఠాల విజయ పరంపరతో మొగలుల సైన్యం నానాటికీ క్షీణించింది. మరాఠాలపై విజయం ఎండమావిగా మారడంతో ఔరంగజేబు మనోవేదనతో కృంగి కృశించి తన 88వ యేట అహ్మద్ నగర్‌లో చనిపోయాడు.

మొగల్ పాలకులు అక్బర్ నుంచి ఔరంగజేబు వరకు దశాబ్దాల పాటు రాజ్యం పాలించగా, ఔరంగజేబు మరణానంతరం గద్దె నెక్కిన మొగల్ బాదుషాలు పట్టుమని ఐదేళ్లు కూడా కొనసాగలేదు. ఒక్కో సంవత్సరంలో అయితే ఇద్దరు గద్దె నెక్కిన సందర్భాలు కూడా ఉన్నాయి. తండ్రి ఎప్పుడు కాలం చేస్తాడా, తను ఎప్పుడు గద్దె నెక్కాలా! అని ఎదురు చూసిన ఔరంగజేబు కుమారుడు 'మువాజం', తండ్రి మరణానంతరం గద్దెనెక్కాడు. అటు తర్వాత ఐదు సంవత్సరాలకే 1712లో చనిపోయాడు.



'మువాజం' మరణానంతరం ఢిల్లీ సింహాసనం సార్వభౌమత్వాన్ని కోల్పోయి దర్బార్‌లో ఉన్న సర్దార్ల చేతిలోకి వెళ్లిపోయింది! అటు తర్వాత వరుసగా ఆ గద్దెనెక్కిన మొగల్ బాదుషాలు కాస్తా, సర్దార్ల చేతిలో కీలుబొమ్మగా మారిపోయారు. మొగలుల మంత్రి జుల్ఫికర్ అలీ ఖాన్, మువాజంకు పుట్టిన ముగ్గురు కుమారుల్లో పెద్దవాడైన జహందర్ షాను చేరదీసి, మిగతా వాళ్ళని చంపివేశాడు. తరువాత అతడిని ఢిల్లీ సింహాసనం మీద ఒక సంవత్సరం మాత్రమే కూర్చోబెట్టాడు.

ఇక ఇక్కడ మరాఠాల విషయానికొస్తే ఛత్రపతి శివాజీ మనవడైన 'సాహు', మరాఠా సామ్రాజ్యానికి ఛత్రపతిగా 1708 జనవరిలో సింహాసనమెక్కాడు. ఉమ్మడి శత్రువైన మొగల్ సామ్రాజ్యం ఛిన్నాభిన్నమై నానాటికీ కుంచించుకుపోయాక.. మరాఠా యోధులలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారయ్యారు. వాళ్ళలో వాళ్ళే తగవులు పడి చెట్టుకొకరు, పుట్టకొకరు అయ్యారు. ఈ సందర్భంలోనే జాతీయ స్వరాజ్య యవనికపై ముందుకు వచ్చాడు బాలాజీ పీష్వా. పీష్వా అంటే ఛత్రపతి యొక్క ప్రధానమంత్రి. ఈయన కింద పనిచేసే అష్ట ప్రధానులనే మంత్రులు ఉంటారు. ఈ బాలాజీ పీష్వానే మరాఠా సామ్రాజ్యంలో అత్యంత బలవంతుడైన 'కన్హోజీ ఆంగ్రే'ను ఛత్రపతికి ఎదురు తిరిగిన సందర్భంలో ఒప్పించి, జాతీయవాద స్వరాజ్య పోరాటంలో ఆయనను భాగం చేశాడు. అసంతృప్తితో ఉన్న మిగతా మరాఠా సర్దార్లను అందరినీ కలిపి శత్రువుకు వ్యతిరేకంగా పరస్పర సహకార పద్ధతిలో మరాఠా మహా మండల్ స్థాపించాడు. దాంతో మొగలులు ఆశించినట్టుగా మరాఠాలు విడిపోకుండా మహా మండల్ పేరుతో వాళ్లంతా ఐక్యమయ్యారు.

"మహా మండల్ తర్వాత నూరేళ్లపాటు దేశం మొత్తాన్ని మరాఠాలు నియంత్రించారు. అటు గుజరాత్ నుంచి ఇటు దక్షిణాన కర్ణాటక వరకు వాళ్లదే సామ్రాజ్యం. చివరికి ఢిల్లీ దర్బార్‌ను కూడా వారే నియంత్రించారు. వారి ప్రయోజనాలకు తగ్గట్టుగానే ఢిల్లీ దర్బారులో ఉన్న పాదుషాలను తమ చేతిలో కీలుబొమ్మలుగా చేసుకొని ఆడించారు. బేసన్ నుంచి పోర్చుగీసు వారిని ఓడించి తరిమేశారు. ఇంగ్లీష్ వారితో సమాన స్థాయిలో రెండు యుద్ధాలు చేశారు. పానిపట్ యుద్ధంలో ఘోర పరాజయాన్ని కూడా తట్టుకొని ఢిల్లీలోనూ, ఉత్తర భారతంలోనూ తమ స్వరాజ్యాన్ని స్థాపించగలిగారు.

మరాఠా గొప్ప యోధులందరినీ ఛత్రపతి సాహు పక్షాన కూడగట్టి, ధమాజీ, ధోరాట్ లాంటి బందిపోట్ల ముఠాలను బల ప్రయోగంతో అణిచివేసి, రాజ్యంలో శాంతి స్థిరత్వాలను మెరుగుపరిచాక బాలాజీ పీష్వా మొగలులపై దృష్టి పెట్టాడు. మొగల్ రాజ్యంలో భాగాలైన ఔరంగాబాద్, బేరార్, ఖాన్దేశ్, బీదర్, గోల్కొండ, బీజాపూర్ రాజ్యాలలో వసూలయ్యే 'చౌథ్' పన్నులను తమకే చెల్లించాలని అప్పటి ఢిల్లీ గద్దెపై ఉన్న మొగల్ కీలుబొమ్మ బాదుషా 'ఫారుక్ షియార్'ని కోరాడు. 1713లో జహందర్ షా మరణానంతరం ఆయన వారసుడిగా ఈ ఫారూక్ షియార్‌ను సయ్యద్ సోదరులని పిలవబడే మొఘల్ సర్దార్లు ఢిల్లీ గద్దె నెక్కించారు. అప్పటికే మొగల్ సామ్రాజ్యం కేవలం ఢిల్లీ నగరానికి మాత్రమే పరితమైంది.

బాలాజీ పీష్వా పెట్టిన ప్రతిపాదనను ఈ ఫారూఖ్ షియార్ ఒప్పుకోక, మరాఠాలతో యుద్ధానికి సిద్ధపడ్డాడు. 50వేల సైన్యంతో ఢిల్లీని ముట్టడించిన బాలాజీ పీష్వా, ఫారుక్ షియార్‌ని ఓడించాడు.. గద్దెనెక్కించిన సయ్యద్ సోదరులే షియార్‌ను ఖైదులో చంపివేశారు. మరో కీలుబొమ్మ ప్రభువైన మహమ్మద్ షాను ఢిల్లీ గద్దెపై మొగల్ ప్రభువుగా కూర్చోబెట్టారు.

ఈ మహమ్మద్ షానే దక్షిణ భారతదేశంలో వసూలయ్యే పన్నును మరాఠాలకే సమర్పిస్తానని ఒప్పందానికి వచ్చాడు. అంటే ఈ ఒప్పందంతో మొగలులు మారాఠాలకు సామంతులుగా మారారని అర్థం! శివాజీ కలలు కన్న నిజమైన స్వరాజ్యాన్ని బాలాజీ పీష్వా ఇలా సాకారం చేశాడు. దీని తర్వాతనే మరాఠాలైన పీష్వాలు ఛత్రపతుల స్థానంలో స్వరాజ్య స్థాపకులుగా మారారు. తర్వాత బాలాజీ పీష్వా కుమారుడైన బాజీరావు, ఛత్రపతి "సాహు" కొలువులో పీష్వాగా నియమించబడ్డాడు. రాజసభ మందిరంలో పైకప్పును దాదాపుగా తాకే నిలువెత్తు విగ్రహం, స్పష్టంగా ఖంగున మోగే గొంతు, ధైర్యం, పౌరుషం ఉట్టిపడే ముఖ కవళికలు, దర్పంతో ఆకట్టుకునే నల్లటి కళ్ళు, అన్నిటికీ మించి అనర్గళ వాగ్ధాటి... 'నేను మరాఠా పతాకాన్ని సింధూ నది తీరాన ప్రతిష్ఠిస్తాను' అని ఛత్రపతి సాహు వైపు చూస్తూ గంభీరంగా పలికాడు.

బాజీరావు మొగలుల దక్కన్ సుబేదారైన నిజామును పాల్‌కేడ్‌లోను ఆ తర్వాత భోపాల్‌లోను చిత్తుగా ఓడించాడు. సిద్దిలు, పోర్చుగీసు వారు ఆక్రమించిన మరాఠా ప్రాంతాలను కూడా విముక్తం చేశాడు. రాజపుత్రుల సహాయంతో ఉత్తర భారతదేశాన్ని పూర్తిగా జయించి, మొగలుల మహా సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించి వేశాడు. ఇదీ, సంక్షిప్తంగా గ్రేట్ మారాఠాల చరిత్ర... అంటే.. మన చరిత్ర!

• డా. అంబటి శ్రీనివాస్‌రాజు
('మన కాకతీయులు' గ్రంథకర్త)

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA

ఆదివారం 20 జూలై 2025

నిర్మాణమవుతున్న కోచ్ ఫ్యాక్టరీ లోపలి భాగం





మీడియాతో మాట్లాడుతున్న రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్



రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

మల్టిపుల్ ఫ్యాక్టరీతో కల సాకారం

- వచ్చే మార్చిలోగా మ్యానుఫ్యాక్చరింగ్ ప్రారంభం
- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్
- రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకే స్థానికులకు ఉద్యోగాలు: కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డి

కాజీపేటలో రూ.521 కోట్లతో ఫ్యాక్టరీ నిర్మాణం

వరంగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాజీపేటలో నిర్మిస్తున్న మల్టిపుల్ రైల్వే యూనిట్‌తో ప్రజల దశాబ్ధాల కల సాకారం అయిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే మ్యానుఫాక్చరింగ్ యూనిట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అనేక ఏళ్లుగా తెలంగాణ ప్రజల కలగా ఉండేదని, ఆ కలను సాకారం చేసిన ఘనత ప్రధాని మోదీకి దక్కిందని అన్నారు. రూ.521కోట్లతో నిర్మిస్తున్న ఈ ఫ్యాక్టరీలో 2026నాటికి మ్యానుఫాక్చరింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ యూనిట్ ఒక మెగా ఫ్యాక్టరీగా రూపుదిద్దుకుంటుందన్నారు. రైల్వే కోచ్‌లే కాకుండా ఇంజన్లు, మెట్రో రైళ్ల తయారీ, డిజైన్ పనులు కూడా జరుగుతాయని తెలిపారు. బహుళ రకాల రైల్వే ఉత్పత్తి (మిగతా 7వ పేజీలో)



కోచ్‌ఫ్యాక్టరీ నమూనాను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

పర్యటన సాగిందిలా..

కాజీపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పర్యటన శనివారం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటలకు రావాల్సిన రైల్వే మంత్రి 2.28 గంటలకు చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌లో పలువురిని కలిసి బొకేలు, వినతిపత్రాలు తీసుకున్న అనంతరం 3 గంటలకు కోచ్ ఫ్యాక్టరీలోకి ప్రవేశించారు. కోచ్‌ఫ్యాక్టరీ మోడల్ మ్యాప్‌ను పరిశీలించారు. కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం, ఏర్పాటు చేసిన షెడ్‌లు, మిషనరీల ఏర్పాటు, ట్రాక్‌ల నిర్మాణం గురించి రైల్వే అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. అనంతరం మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి మాట్లాడారు. అప్పటికే అయోధ్యపురం రైల్వే గేట్‌వద్దకు తీసుకువచ్చిన ప్రత్యేక రైలులో రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్‌లు 3.48 గంటలకు రైలెక్కి వెళ్లారు. మొత్తంగా కోచ్‌ఫ్యాక్టరీలో 40 నిమిషాలు మాత్రమే రైల్వే మంత్రి పర్యటన సాగింది. సికింద్రాబాద్‌లో మరో కార్యక్రమానికి హాజరుకావల్సి ఉండడంతో మంత్రి పర్యటన హడావుడిగా సాగింది.



అభిమానులతో సెల్ఫీ దిగుతున్న సినీ నటి నిధి అగర్వాల్

నిధి అగర్వాల్ సందడి

హనుమకొండ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'హరిహర వీర మల్లు' సినిమాలో పవన్ కల్యాణ్ సరసన హీరోయిన్‌గా నటించిన నిధి అగర్వాల్ శనివారం నగరంలో సందడి చేశారు. హనుమకొండలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆమె అభిమానులతో కలిసి సెల్ఫీలు దిగి ఉత్సాహపరిచారు. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వారిని చూసిన నిధి.. ఉత్సాహంగా అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఇస్మార్ట్ శంకర్ రిలీజ్‌కు ముందు వరంగల్ వచ్చానని, ఆ సినిమా సూపర్ హిట్ అయిందని గుర్తు చేసుకున్నారు. ఈ నెల 24న హరిహర వీరమల్లు రిలీజ్ కానుందని, ఇప్పుడు మళ్లీ వరంగల్‌కు రావడం తనకు సెంటిమెంట్‌గా కలిసి వస్తుందని ఆనందం వ్యక్తం చేశారు.

డీటీసీగా సురేశ్‌రెడ్డి



వరంగల్ క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా సురేశ్‌రెడ్డి నియమితులయ్యారు. సూర్యాపేట ఆర్‌టీవోగా విధులు నిర్వహిస్తున్న ఆయనను పదోన్నతిపై బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ డీటీసీగా పని చేస్తున్న పురుషోత్తం ఇంత కాలం ఇక్కడ ఇన్‌చార్జి డీటీసీగా వ్యవహరించారు. తాజాగా సురేశ్‌రెడ్డి నియామకంతో పూర్తి స్థాయి డీటీసీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. 1996 యంవిఐ బ్యాచ్‌కు చెందిన సురేశ్‌రెడ్డి... ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే ఆవకాశం ఉంది.



హనుమకొండ అశోక జంక్షన్‌లో..

దంచి కొట్టిన వాన

- 15.6 మి.మీ. వర్షపాతం నమోదు
- నగరంలో జలమయమైన రోడ్లు
- స్తంభించిన రాకపోకలు

6



హైదరాబాద్‌లోని సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సీతక్క

మేడారంలో గద్దెల రూపు మారదు..

ఆలయ పరిసరాలను మాత్రం ఆధునికీకరిస్తాం

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

ములుగు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల గద్దెల మార్పు లేకుండానే ఆలయ పరిసరాల ఆధునికీకరణ పనులు చేపడతామని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. వనదేవతల ఆలయ ఆధునికీకరణ పనులపై అధికారులు, పూజారులు, నిపుణులతో సమీక్షించారు. పూజారుల కోరిక మేరకు భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ఆధునికీకరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆదివాసి, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా సమ్మక్క-సారలమ్మ సన్నిధిని తీర్చిదిద్దుతామన్నారు. పూజారుల విశ్రాంతి గదులు, అత్యవసర సేవలు, భద్రత, వైద్య సిబ్బంది, మీడియా కోసం అదనపు వసతులు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకట్రావు, ములుగు కలెక్టర్ దివాకర, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, మేడారం ఆలయ పూజారులు, గిరిజన సాంస్కృతిక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై నోరు జారితే సహించం

- దాడులంటే ఎలా ఉంటాయో చూపిస్తాం.. మా సహనాన్ని పరీక్షించొద్దు
- మీ కుటుంబానికి జైలు ఖాయం
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఫైర్
- ఆయన నోరే.. పెద్ద మోరీ : ఎమ్మెల్యే నాగరాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'కేటీఆర్ ఖబర్దార్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నోటికొచ్చినట్లు దూషిస్తే తాట తీస్తాం' అని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. 'ముఖ్యమంత్రి అనే గౌరవం లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతావా.. ఇదేనా నీవు నేర్చుకున్న సంస్కారం' అంటూ ధ్వజమెత్తారు. శనివారం ఆయన హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.

ప్రజాస్వామ్యానికే మచ్చ తెచ్చేలా కేటీఆర్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. కేటీఆర్ కంటే తాము ఎక్కువ మాట్లాడగలమని, కానీ పద్ధతి కాదని ఊరుకుంటున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ జోలికి వస్తే.. అసలు దాడులంటే ఏమిటో చూపించాల్సి వస్తుందని కేటీఆర్‌ను హెచ్చరించారు. "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మగాడనే క్లారిటీ నీవు వచ్చి చూద్దువు రా" అంటూ రాజేందర్‌రెడ్డి విరుచుకుపడ్డారు. తెలంగాణను దోచుకున్న కేసీఆర్ కుటుంబానికి జైలు ఖాయమని జోస్యం చెప్పారు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ ఇలా చేయని అక్రమాలు లేవని, మీ పాలన అంతా దోపిడే లక్ష్యంగా జరిగిందని రాజేందర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. తెలంగాణ సెంటిమెంట్‌తో బీఆర్ఎస్.. రాముడి పేరుతో బీజేపీ రాజకీయ ఉనికి కోసం యత్నిస్తున్నాయని ఆరోపించారు. కేయూలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని బీఆర్ఎస్ అడ్డుకోవడం సిగ్గుచేటని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. స్కూల్‌ను అడ్డుకునేందుకు అనేక మార్గాల్లో పావులు కదుపుతున్నాడని దుయ్యబట్టారు.

కేటీఆర్ ఓ బఫూన్...

మాజీ మంత్రి కేటీఆర్ ఓ లుచ్చా... కచ్ రా... హౌలే... బఫూన్ అంటూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. కేటీఆర్ లాంటి నీచ రాజకీయ నాయకుడు ఇంకొకరు ఉండరని, శవాలపై పేలాలు ఏరుకునేవాడని ఆరోపించారు. అమెరికాలో టాయిలెట్స్‌ను కడిగిన కంపు అంతా బయటపెట్టుకుంటున్నాడని, కేటీఆర్ నోరే....పెద్ద మోరీ అని విరుచుకుపడ్డారు. మరోసారి ముఖ్యమంత్రిపై నోరు పారేసుకుంటే వరంగల్‌కు వచ్చిన సందర్భంలో కేటీఆర్‌ను ప్రజలు ఉరికించి కొడతారన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి కెనాల్‌లోకి నీరు వచ్చాక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు సోయి వచ్చిందని నాగరాజు ఎద్దేవా చేశారు. తానే ఏదో చేసినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, విజయశ్రీ రజాలీతో పాటు డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, మార్క విజయ్, పుప్పాల ప్రభాకర్, కూర వెంకట్, వీసం సురేందర్‌రెడ్డి, డాక్టర్ శ్రవణ్‌కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతు కన్నీటి సేద్యం

- జాడలేని రూ.2లక్షల రుణ వితరణ
- ఏడాదవుతున్నా ఆచరణకు రాని ఆర్‌బీఐ ఉత్తర్వులు
- రైతు భరోసా కింద కౌలు రైతులను గుర్తించేదెప్పుడు ?
- కార్యరూపం దాల్చని కాంగ్రెస్ ఎన్నికల హామీ
- గుర్తింపు కార్డుల జారీ జాడే లేదు
- రుణ అర్హత కార్డులనైనా పునరుద్ధరించాలి

హనుమకొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు కన్నీటి సాగు చేస్తున్నారు. ప్రభుత్వం గుర్తించకపోయినా... బ్యాంకులు రుణం ఇవ్వకపోయినా బతుకుదెరువు కోసం కష్టాల సేద్యం చేస్తున్నాడు. గత ప్రభుత్వంలో వందల ఎకరాలు కలిగిన భూస్వాములకు కనీసం సాగువైపు కన్నెత్తి చూడపోయినా రైతు భరోసా అందింది.

కానీ భూమిని నమ్ముకొని కష్టపడి పని చేసే కౌలు రైతుకు ఎక్కడా సాయం అందడం లేదు. పండినా పండకపోయినా వారు కౌలు మాత్రం కడుతూ వస్తున్నారు. రైతు బంధు పథకం కింద ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు పట్టా రైతుల ఖాతాల్లోనే జమవుతున్నాయి. దీంతో వాస్తవంగా పంటను సాగు చేసిన కౌలు రైతు పేరు ఎక్కడా రికార్డుల్లో లేకుండా పోతోంది.

రూ. 2 లక్షల రుణమేది ?

కౌలు రైతుల విషయంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా కొంత ఉదారంగా వ్యవహరించింది. కౌలు రైతులతో పాటు వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టేవారికి గరిష్ఠంగా రూ. 2 లక్షల బ్యాంకు రుణమివ్వాలని గతేడాది జారీ చేసిన ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు. సొంత భూమి ఉన్న రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ఆధారం చేసుకొని పంట రుణాలు ఇచ్చినట్టే కౌలు రైతులను ఆదుకోవడానికి ఆర్‌బీఐ ఈ వెసులుబాటు కల్పించింది. కానీ రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు రావడం లేదు. ఏ ఆధారం లేకుండా కౌలు రైతులకు రుణం ఇవ్వడానికి ససేమిరా అంటున్నాయి. దీంతో ఆర్‌బీఐ ఉత్తర్వులు బుట్ట దాఖలయ్యాయి.

రైతు భరోసా కింద గుర్తింపు ఏది ?

రైతు భరోసా కింద కౌలు రైతులను గుర్తిస్తామని శాసన సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వరంగల్ డిక్లరేషన్‌లో ఈ అంశాన్ని ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే రైతులతో పాటు



కౌలు రైతులను కూడా గుర్తించి వారికి రైతు భరోసాకింద ఆర్థికసాయం చేస్తామని చేసిన ప్రకటన కూడా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. ఈ విషయంలోప్రభుత్వం నుంచిఎటువంటి స్పందనా లేదు. పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలు, అకాల వర్షాలతో పాటు ప్రభుత్వ తోడ్పాటు లేకపోవడంతో కౌలు రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు.

3.60 లక్షల మంది కౌలు రైతులు..

ఉమ్మడి జిల్లాలో 12 లక్షల మంది రైతులు వివిధ పంటలు పండిస్తున్నారు. వీరిలో 30 శాతం మంది అంటే సుమారు 3.60 లక్షల మంది కౌలుదారులే. వరంగల్ జిల్లాలో 65 వేలు, (మిగతా 8వ పేజీలో)

దంచి కొట్టిన వాన

15.6 మి.మీ. వర్షపాతం నమోదు ● నగరంలో జలమయమైన రోడ్లు ● స్థంభించిన రాకపోకలు

హనుమకొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి వర్షం కురవడం మొదలైంది. దాదాపు నెలన్నర రోజుల తర్వాత మోస్తరు మొదలు భారీ వర్షం కురిసింది. ఈ రెండు జిల్లాల్లో వర్షం లోటు 29.2 శాతం ఉన్న నేపథ్యంలో శనివారం కురిసిన వర్షం రైతులకు కాస్త ఊరటనిచ్చింది. ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగించింది. హనుమకొండ జిల్లాలో రాత్రి 8 గంటల వరకు 15.6 మిమీ వర్ష కురిసినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. హసన్‌పర్తి, ఎల్కతుర్తి, కమలాపూర్ నడికుడ, పరకాల, శాయంపేట, ధర్మసాగర్, భీమదేవరపల్లి, మండలాల్లో మోస్తరు భారీ వర్షం కురిసింది. దామెర, ఆత్మకూరు, ఐనవోలులో తేలికపాటి వర్షం పడింది. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్, సంగెం, గీసుకొండ, వరంగల్ మండలాల్లో సాయంత్రం నుంచి వర్షం పడడం ప్రారంభమైంది. వరంగల్ నగరంలో వర్షం జోరుగా కురిసింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. హనుమకొండ, వరంగల్ పట్టణాల్లో భారీ వర్షం కురిసింది. పలులోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.



జలమయమైన హన్మకొండ బస్టాండ్ పరిసరాలు

వర్షపు నీరు రోడ్లపై పెద్ద ఎత్తున పారడంతో వాహనాల రాకపోకలకు కొద్ది సేపు అంతరాయం ఏర్పడింది.

శనివారం కురిసిన వర్షానికి రెండు జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో ఎండిపోతున్న, ముదురుతున్న నారుమల్లకు జీవం పోసినట్లయింది. ఈ సారి రుతుపవనాలు ముందుగానే రావడంతో తొలకరి వర్షాలు రైతులను మురిపించాయి. వర్షాలు విస్తృతంగా కురిసే అవకాశాలున్నాయన్న ప్రచారంతో రైతులు దుక్కులు దుని విత్తనాలు వేశారు. ఆ తర్వాత దాదాపు 50 రోజుల పాటు అసలు వర్షాలే లేవు. అక్కడక్కడ చిరుజల్లులు మురిపించాయి తప్ప భారీ వర్షాలు కురవలేదు. దీంతో లోటు వర్షం రికార్డయింది. మొలకలు ఎండిపోతున్న తరుణంలో శనివారం కురిసిన వర్షంతో రైతులు పులకరించారు. రాగల నాలుగు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వానలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది.



హనుమకొండ అశోక జంక్షన్ వద్ద కురుస్తున్న వర్షం

ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయాలి

● పురుగుల మందు డబ్బాతో ఆందోళన

● ఎంపీడీవో హామీతో శాంతించిన దంపతులు



పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న పోతన దంపతులు

పాలకుర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలంటూ దంపతులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట శనివారం పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేపట్టడం చర్చనీయాంశమైంది. పాలకుర్తి మండలం బమ్మెరకు చెందిన బరిగెల పోతన, రేణుక దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. తమకున్న రెండు గదుల్లో ఒకగదిలో అన్న కుటుంబ, మరో గదిలో పోతన కుటుంబం ఉంటోంది. ప్రస్తుతం ఇల్లు పూర్తిగా కూలిపోయే దశకు చేరింది. కాగా, రెండు నెలల క్రితం అధికారులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టగా పోతన ఇంటిని సైతం సర్వే చేశారు. గ్రామంలో సర్వే పరిశీలనకు వచ్చిన కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నాడు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ జాబితాలో ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు ప్రకటించిన తుది జాబితాలో పోతన పేరులో లేదు. దీంతో మనస్తాపం చెందిన పోతన దంపతులు శనివారం పాలకుర్తిలోని ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేపట్టారు. దీంతో ఎంపీడీవో రవీందర్ వారితో మాట్లాడారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

భూ తగదాలతో వ్యక్తిపై దాడి



దాడిలో గాయపడిన శ్రీశైలం

బచ్చన్నపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాలతో వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటన మండలంలోని కొడవటూరులో జరిగింది. ఎస్సై అబ్దుల్ హమీద్ కథనం ప్రకారం కొడవటూరుకు చెందిన మల్లం శ్రీశైలంకు బచ్చన్నపేట రెవెన్యూ శివారులో వ్యవసాయ భూమి ఉంది. 10గుంటల భూ వ్యవహారంలో కొంత కాలంగా శ్రీశైలం, శ్రీహరికి మధ్యన విబేధాలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ బావి వద్ద శనివారం ఉదయం పనులు చేస్తుండగా ఇరువురి మధ్య మాటామాట పెరిగాయి. శ్రీహరి అతని కుమారుడు చిరంజీవి కత్తితో శ్రీశైలంపై దాడి చేయగా చేతిపై గాయ మైంది. వెంటనే బచ్చన్నపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చి చికిత్స చేయించారు. శ్రీశైలం భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్ శివారులోని రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని సుమారు 50ఏళ్ల వ్యక్తి ఉరి వేసుకొన్న ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మృతుడు వంకాయ రంగు టీషర్టు, జీన్స్ పాయింట్ ధరించి ఉన్నాడు. రైల్వే ట్రాక్ సమీపంలోని చెట్ల పొదల్లో ఉన్న చెట్టుకు బట్టతో ఉరి వేసుకొని మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణు తెలిపారు.

పేదల ఆకలి తీర్చేది కాంగ్రెస్ ప్రభుత్వం

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆకలిని తీర్చేది కాంగ్రెస్ ప్రభుత్వం అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో శనివారం రైతు వేదికలో తహసీల్దార్ సదానందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేసి దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. హనుమకొండ జిల్లాలో 12 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని, 25, 349 మందికి కొత్త సభ్యుల చేర్పులు జరిగాయని తెలిపారు. ధర్మసాగర్ మండలంలో 924 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు కాగా 2,119మంది పేర్లు చేర్పులు జరిగాయని తెలిపారు. ఇంకా కొత్త రేషన్ కార్డులు రానివారు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో అనిల్ కుమార్, డీటీ సంతోష్, ఆర్ఐలు స్పందన, అనిత తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతనంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ,ఆదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి విచ్చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేలేరు మండలంలో 439 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ తొమ్మిది మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ కోమి, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, లబ్ధిదారులు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడియం

ఇనుపరాతి గట్లను సందర్శించిన సంరక్షణ అధికారి

ధర్మసాగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని ఏకైక ఫారెస్టు అయిన ధర్మసాగర్ మండలం దేవునూర్ ఇనుపరాతి గట్లను తెలంగాణ రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారి డాక్టర్ సువర్ణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇనుపరాతి గట్లలోని కొంత దూరం నడుచుకుంటూ వెళ్లి ఫారెస్టు ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. గుట్టలకు సంబంధించిన రికార్డులను స్వయంగా ఆమె పరిశీలించారు. ఫారెస్టుకు సంబంధించిన పూర్తి వివరాల గురించి అడవికి సంబంధించిన గ్రోతింగ్ ఎలా ఉందని డీఎఫ్‌వో భిక్షపతిని అడిగి తెలుసుకున్నారు. కాగా హనుమకొండ జూపార్కు అనుకూలంగా ఉంటుందా లేదని, ఫారెస్టు భూమిని అక్రమణకు గురి కాకుండా కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించినట్లు తెలిసింది. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు భీమనాయక్, అనుజ అగర్వాల్, కృష్ణామచారి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

బచ్చన్నపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రోమోర్, శివశంకర్ ఫర్టిలైజర్ షాపులను శనివారం జిల్లా వ్యవసాయాధికారిణి అంబికాసోని తనిఖీలు చేశారు. రిజిష్టర్‌లను పరిశీలించారు. రైతులకిచ్చే ఎరువుల రికార్డులు సరిగా ఉండాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న డీపీవో పోచన్నపేట, బచ్చన్నపేటలలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. నాణ్యతలో రాజీపడకుండా విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు.

పిడుగు పాటుకు మత్స్య కార్మికుడి మృతి



సుధాకర్(ఫైల్)

సంగెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన మత్స్య కార్మికుడు పిడుగుపాటుకు మృతిచెందిన సంఘటన మండలంలోని ఎల్గూరురంగంపేటలో జరిగింది. గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన బోనాల సుధాకర్ (48) శనివారం చేపల వేటకు గ్రామంలోని చెరువులోకి తోటి కార్మికులతో కలిసి వెళ్లాడు. ఇదే రోజు సాయంత్రం పిడుగుపడి చెరువులోనే మృతి చెందాడు విషయం గమనించిన కార్మికులు వెంటనే సంగెం ఎస్సై నరేశ్‌కు సమాచారం అందించి, చెరువులోంచి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌కు తరలించారు. మృతుని భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కలెక్టర్ స్నేహ శబరీష్

హసన్‌పర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. భీమారం పలివేల్పులలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్, తరగతి గదులు, రికార్డులను పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్‌తో పాటు కిచెన్, డైనింగ్ హాలులో ఎటువంటి సౌకర్యాలు ఉన్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూంలో నిల్వ చేసిన బియ్యం, కూరగాయలతో పాటు ఇతర వంట పదార్థాల నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. వంటచేస్తున్న కార్మికులతో పాటు విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్ బ్లాక్‌తో పాటు పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పర్యవేక్షకులను ఆదేశించారు. ప్రొవిజన్స్ ఎలా ఇండెంట్ చేస్తారని ఎక్కడి నుంచి వస్తాయని ఆరా తీశారు. పాఠశాలలో ఫోన్ సౌకర్యంతో పాటు కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగపడుతుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. గురుకుల విద్యాలయ నిర్వాహకులు, బోధన సిబ్బంది విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను అందించి కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా రాణించేలా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వ విద్యా రంగ సంస్థలు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా పోటీ పడితేనే మనుగడ ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతంగా రాణించి ప్రభుత్వ విద్యా సంస్థలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర వెంట ప్రిన్సిపల్ సుభాషిణితో పాటు బోధన బోధనేతర సిబ్బంది ఉన్నారు.

భూ వివాదంలో పురుగుల మందుతాగిన వ్యక్తి మృతి



మూర్తి(ఫైల్)

పర్వతగిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : భూ వివాదం ఒకరి ఆత్మహత్యకు దారి తీసింది. పర్వతగిరి ఎస్ఐ ప్రవీణ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రోళ్లకల్ గ్రామానికి చెందిన నాళ్లం మల్లయ్య గత 25 సంవత్సరాల కిందట ఇదే గ్రామానికి చెందిన జనగాం మల్లయ్య వద్ద 4 గుంటల భూమి, కొడుకు జనగాం సమ్మయ్య వద్ద ఒక గుంట భూమి ఖరీదు చేశారు. ఇతనికి ఒక మనవడు నాళ్లం మూర్తి (24) ఉన్నాడు. ఈ మధ్య జనగాం సమ్మయ్య, ఇతని కుమారుడు జనగాం రాజగౌడ్‌లు కలిసి తాము 4 గుంటలు మాత్రమే అమ్మామని ఒక గుంట తమదేనని వీరిద్దరిపై గొడవకు దిగి నానా బూతులు తిట్టారు. ఈ నెల 13న గ్రామానికి చెందిన పెద్ద మనుషులు బాదావత్ మంగ్యా, మడ్డి రాములుతో కలిసి భూమి మీదకు వచ్చి బలవంతంగా 4 గుంటల భూమికి గెట్లు పెట్టి ఒక గుంటను తీసుకోగా మనస్థాపానికి గురైన నాళ్లం మూర్తి పురుగుల మందు తాగాడు. వైద్యం నిమిత్తం వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. ఈ విషయమై ఈ నెల 15న నాళ్లం మల్లయ్య పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చికిత్స పొందుతూ నాళ్లం మూర్తి శనివారం మృతి చెందాడు. మృతికి కారకులైన జనగాం సమ్మయ్య, జనగాం రాజాగౌడ్, బాదావత్ మంగ్యా, మడ్డి రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

సెర్ప్ సిబ్బందితో నాయకుల వాగ్వాదం

గీసుగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తాము చెప్పిన వ్యక్తిని ఎందుకు విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్(వీవోఏ)గా నియమించటం లేదని సెర్ప్ ఏపీఎం సురేష్, సిబ్బందితో స్థానిక కాంగ్రెస్ నాయకులు మండల సమాఖ్య కార్యాలయంలోనే వాగ్వాదానికి దిగటం చర్చనీయాంశంగా మారింది. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలోకి చొచ్చుకువెళ్లిన నాయకులు ఏపీఎంను చుట్టుముట్టి చంద్రయపల్లి వీవోఏగా తాము చెప్పిన శివకుమార్‌ను ఎందుకు నియమించడం లేదని గొడువపడ్డారు. ఈ విషయమై ఏపీఎంను వివరణ అడుగగా.. గతంలో చంద్రయపల్లిలో వీవోఏగా పనిచేసిన రవీందర్ అవినీతికి పాల్పడడంతో స్థానిక పొదుపు సంఘం మహిళలు అతడిని విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు. అయితే అతని స్థానంలో స్థానికంగా ఉండే శివకుమార్‌ను నియిమించాలని సదరు కాంగ్రెస్ నేతలు గత కొన్ని రోజులుగా పట్టుబడుతున్నారన్నారు. కొత్త నిబంధనల ప్రకారం మహిళను వీవోఏగా నియమించాల్సి ఉందని ఆయన తెలిపారు. నిబంధనల ప్రకారమే పై అధికారుల ఆదేశానుసారంగా నియామకం జరుగుతుందని వివరించారు. కాగా శనివారం కొనాయిమాకుల వద్ద గల మండల సమాఖ్య భవనం ప్రహారీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే రేవూరి, ఎంపీ కడియం కావ్య శంకుస్థాపన చేసి మండల సమాఖ్య చాలా బాగా పనిచేస్తుందని కితాబ్ ఇచ్చారు. అయితే వారు అక్కడి నుంచి వెళ్లిన కొద్ది సేపటికే ఈ ఘటన జరగడం విశేషం.

పీఆర్‌టీయూ(టీఎస్) సంపాదవర్గ సభ్యురాలిగా చిట్ల శోభారాణి



రాయపర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ(టీఎస్) సంపాదవర్గ సభ్యురాలిగా రాయపర్తి మండలం జగన్నాథపల్లి ఎంపీపీపీఎస్ ఉపాధ్యాయిని చిట్ల శోభారాణి ఎంపికయ్యారు. ఈ మేరకు పీఆర్‌టీయూ (టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్‌టీయూ(టీఎస్)లో శోభారాణి కొన్నేళ్లుగా క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై గళాన్ని వినిపిస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ దాడులతో తగ్గిన రిజిస్ట్రేషన్లు

బ్రోకర్స్ కార్యాలయాల మూసివేత

ఖిలావరంగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆన్‌లైన్ బ్రోకర్స్ కార్యాలయాలపై దాడులు చేయడంతో వరంగల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయం (ఆర్టీఏ)లో శనివారం వివిధ విభాగాలకు చెందిన రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. ఉదయం రంగశాయిపేట(నాయుడుపంపు) వద్దగల ఆర్టీఏ కార్యాలయం సమీపంలో గల ఆన్‌లైన్ బ్రోకర్ కార్యాలయాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. తప్పుడు ధ్రువపత్రాలు కలిగి ఉన్న పలువురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకెళితే...

వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ద్విచక్ర, ఆటో, కార్లు, ట్రాలీ, గూడ్స్ ఆటోలు, లారీలు, బస్సు తదితర వాహనదారుల రద్దీతో ఉంటుంది. టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులతో ఆర్టీఏ కార్యాలయం వెలవెలబోయింది. ప్రతిరోజు సుమారు 100 నుంచి 150 వరకు జరిగే వివిధ విభాగాలకు చెందిన రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గిపోయాయి. కాగా, శనివారం ఉదయమే టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల కారణంగా వరంగల్ రవాణా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో వివి ధ విభాగాలలో మొత్తంగా 43 రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిసింది.



మూసివేసిన ఆన్‌లైన్ బ్రోకర్ కార్యాలయాలు

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2432	1521
పల్లికాయ (సూక)	5600	3450
పల్లికాయ (పచ్చిది)	4200	1575
కందులు	5922	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7720	5300
పసుపు (కాడి)	11509	9534
పసుపు (గోల)	10250	9700
తేజ మిర్చి	11000	8500
తేజ ఏసీ	13500	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	13000	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఉపాధ్యాయుడా.. సలామ్!


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్



పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు

- బడి బాగు కోసం రూ.4లక్షలు ఖర్చు చేసిన హెచ్‌ఎం
- పాఠశాల గోడలపై బొమ్మలు.. సీసీ కెమెరాల ఏర్పాటు
- ఆదర్శంగా నిలుస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్
- పాలకుర్తిలో కార్పొరేట్‌ను తలపిస్తున్న సర్కారు బడి

పాలకుర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆ ఉపాధ్యాయుడి సంకల్పం బడి ముఖ చిత్రాన్నే మార్చేసింది. కళా విహీనంగా.. ఆదరణ కొరవడి .. అధ్వానంగా మారిన సర్కారు బడికి జవసత్వాలు తీసుకువచ్చాడు. ఈ ప్రాథమిక పాఠశాల జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఉంది. ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్ బడి బాగు కోసం సొంతంగా రూ.4 లక్షలు వెచ్చించి కొత్త అందాలు తీసుకొచ్చారు. బదిలీల్లో భాగంగా గత సంవత్సరం ఇక్కడికి వచ్చిన శ్రీనివాస్ పాఠశాల పరిస్థితిని చూసి చలించిపోయాడు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం మరింత కలిచి వేసింది. మీరు ఎందుకు పిల్లలను చేర్పడం లేదని చుట్టు పక్కల తల్లిదండ్రులను అడగ్గా వారు అక్కడి కనీస సౌకర్యాలు లేవని చెప్పడంతో కలత చెందాడు. దీంతో రూ. 4లక్షలు సొంత ఖర్చులతో ప్రైవేటు పాఠశాలను మరిపించేలా గోడలపై రంగు రంగుల బొమ్మలను వేయించాడు. సందేశాత్మక సూక్తులు రాయించాడు.

ఇంగ్లిష్ అక్షరమాల, స్ఫూర్తినిచ్చే జాతీయ నాయకుల చిత్రాలను పర్యావరణం పరిరక్షణకు నడుం బిగించే బొమ్మలు, సూక్తులతో పాఠశాల గోడల్ని నింపాడు. అంతేకాదు, మూత్ర శాలలు, మరుగుదొడ్లకు రంగులు, టైల్స్ వేయించాడు. ఉపాధ్యాయుడి సంకల్పంతో 55 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారు. ప్రభుత్వ పాఠశాలలో 95 మంది విద్యార్థులు ఉండగా ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. శ్రీనివాస్ బోధనలోనూ వైవిధ్యం చూపుతూ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నారు. విద్యార్థులతో పాటు నేలపై కూర్చుని బొమ్మలు, చార్టులు ఇతర పరికరాలు ఆధారంగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నాడు. ప్రస్తుతం పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

చెరువును తలపించేది..

వర్షం కురిస్తే పాఠశాల చెరువును తలపించేది. సమస్య పరిష్కారం కోసం కూలీలను పెట్టి రెండు రోజుల పాటు చెత్తా చెదారాన్ని తొలగించారు. సీసీ చేయించారు. పాఠశాల ఆవరణ ఇప్పుడు చెట్లతో ఆహ్లాదకరంగా ఉంది. ఇప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు. బడులు అన్ని ఇలాగే ఉంటే ప్రైవేటు పాఠశాలలు తాళాలు వేసుకోవాల్సిందే..

బడిని బాగు చేయడం ఆనందంగా ఉంది..

చిదురాల శ్రీనివాస్, హెచ్‌ఎం



పుట్టిన ఊరు, జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరిచిపోవద్దు. సొంత ఊరు పాలకుర్తిలో సర్కారు బడిని బాగు చేసుకోవడం ఆనందంగా ఉంది. ఈ పాఠశాలకు బదిలీపై వచ్చినప్పుడు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. ప్రస్తుతం గోడలకు రంగులు వేయించాను. గేటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించా. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను మా పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పాఠశాల పరిసరాలు బాగుంటే విద్యార్థులను ఆకర్షించవచ్చని ఆలోచించాను. దాని కోసం నేను రూ.4 లక్షలు ఖర్చు చేశా.


డైట్ కాలేజీ ప్రాంగణంలో చెట్లను నరికివేసిన దృశ్యం

డైట్‌లో అడ్డగోలుగా చెట్ల నరికివేత

- 20కి పైగా నేలకూలిన భారీ వృక్షాలు
- ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై పై అటవీ శాఖ అధికారులకు పర్యావరణ వేత్తల ఫిర్యాదు

హనుమకొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): భావిభారత పౌరులను తీర్చిదిద్దే, వారికి విద్యా బుద్ధులు నేర్పే ఉపాధ్యాయులను తయారు చేసే జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలోనే నిబంధనలకు విరుద్ధమైన పనులు జరుగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యావరణానికి హాని కలిగించే చర్యలకు అధికారులే పూనుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెట్లను పెంచాలని ప్రభుత్వం ఒక పక్క చెబుతూ వన మహోత్సవాల పేరుతో రూ. కోట్లు వెచ్చిస్తుంటే.. అందుకు విరుద్ధంగా హనుమకొండలోని జిల్లా ఛాత్రోపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో విచక్షణా రహితంగా చెట్లను నరికివేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం డైట్ ప్రాంగణంలో ఏపుగా పెరిగిన సుమారు 20 చెట్లను నేలకూల్చారు. డైట్‌లోని విశాలమైన ప్రాంగణంలో పచ్చదనం కోసం మరిన్ని చెట్లను పెంచాల్సింది పోయి ఉన్న చెట్లను నరికి వేయడం పట్ల ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ మేరకు ఈనెల 17న ఈ విషయమై జిల్లా అటవీ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. డైట్ ప్రిన్సిపాల్ అబ్దుల్‌హైతో పాటు మరో ముగ్గురు సిబ్బంది ఎం.సోమయ్య, సతీశ్‌చంద్ర, మానస్... అటవీ శాఖ, పర్యావరణ పరిరక్షణ సంస్థ అధికారుల ముందస్తు అనుమతి లేకుండా డైట్ ప్రాంగణంలోని పెద్ద పెద్ద చెట్లను నరికించారని అందులో పేర్కొన్నారు. ఈ చర్య పర్యావరణ చట్టం-1980, ఇతర సంబంధిత పర్యావరణ పరిరక్షణ చట్టాలకు పూర్తి విరుద్ధమని, చెట్ల నరికివేత వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

నరికివేసిన చెట్లలో విలువైన టేకు తదితర చెట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఉన్నత పదవుల్లో ఉండి, చట్టాలు, నిబంధనలు తప్పకుండా పాటించాల్సిన అధికారులే ఇలాంటి చర్యలకు పాల్పడడం తీవ్రమైన తప్పిదంగా భావించి ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. దీంతో స్పందించిన అటవీ శాఖ అధికారులు డైట్‌లో నరికిన చెట్లను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. చెట్ల నరికివేతను తీవ్రంగా పరిగణించిన అట వీ శాఖ అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

హోటల్‌లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

2 బైక్‌లు ధ్వంసం.. ఒకరికి గాయాలు

నర్సంపేట టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట మునిసిపాలిటీకి చెందిన ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న హోటల్‌లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన నర్సంపేట పట్టణంలోని మల్లంపల్లిరోడ్‌లో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మునిసిపాలిటీకి చెందిన ట్రాక్టర్ పైపులైన్ మరమ్మతుల కోసం కమలాపురం నుంచి అంబేద్కర్ సెంటర్ వైపు వస్తుండగా మార్గమధ్యంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న హోటల్‌లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో అక్కడ ఉన్న రెండు బైక్‌లు ధ్వంసం కాగా, ఒకరికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. ఇదిలావుండగా సరైన డ్రైవింగ్ రాని వ్యక్తి నడపడం వల్లనే ట్రాక్టర్ హోటల్‌లోకి దూసుకెళ్లి ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


హోటల్‌లోకి దూసుకెళ్లి బోల్తా పడిన మునిసిపల్ ట్రాక్టర్

మల్టిపుల్ ఫ్యాక్టరీతో కల సాకారం

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పనులు వేగంగా జరుగుతున్నాయని, అనుకున్న సమయానికి మ్యానుఫ్యాక్చరింగ్ ప్రారంభిస్తామని రైల్వే మంత్రి తెలిపారు.

స్థానికులకు ఉద్యోగాలపై రాష్ట్రానిదే నిర్ణయం : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాజీపేట మల్టిపుల్ రైల్వే ఫ్యాక్టరీలో స్థానికులు, భూనిర్వాసితులకు ఉద్యోగాలపై రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ఫ్యాక్టరీ కోసం ఎవరెవరు భూములు ఇచ్చారో కలెక్టర్ ఇచ్చే నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సూచనల మేరకు ఫ్యాక్టరీలో స్థానికులు ఉద్యోగాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. గత 40ఏళ్లకు పైగా కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందన్నారు. గతంలో పీవీ నరసింహారావు హయంలో కూడా కోచ్ ఫ్యాక్టరీ కోసం ప్రయత్నాలు జరిగాయని అన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా కాజీపేటలో మల్టిపుల్ ఫ్యాక్టరీ కోసం భూమి పూజా చేశారని తెలిపారు. ఈ ఫ్యాక్టరీతో పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కలుగుతుందని, ప్రత్యక్షంగా 3వేల మందికి ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. స్థానికులకు ఉద్యోగావకాశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సూచనల ప్రకారం ముందుకు వెళతామని కిషన్‌రెడ్డి తెలిపారు.

వరంగల్ సమగ్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. వరంగల్ రింగ్‌రోడ్డులో 50శాతం కేంద్రమే పూర్తి చేసిందన్నారు. వరంగల్‌లో ఎయిర్ పోర్టు అవసరం ఎంతో ఎందని గత బీఆర్ఎస్ హయంలో అప్పటి సీఎం కేసీఆర్‌కు అనేకసార్లు లిఖితపూర్వకంగా విన్నవించానని తెలిపారు. ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని గత ప్రభుత్వం ఇవ్వలేక పోయిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎయిర్‌పోర్టుకు అవసరమైన భూమిని సేకరించి, విమానాయశాఖకు అందిస్తే పనులు మొదలు పెడుతామన్నారు.

ఈ కార్యక్రమంలో రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ భరతేష్ కుమార్‌జైన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఎంపీ కడియం కావ్య, మేయర్ సుధారాణితో పాటు బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, హరీష్‌రెడ్డితో పాటు జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

తోపులాట.. గందరగోళం

కాజీపేట (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి కాజీపేట పర్యటన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే వారిని స్టేషన్‌లోకి రా కుండా పోలీసులు అడ్డుకున్నారు. మంత్రులు రైల్వే స్టేషన్‌కు రాగానే కలెక్టర్ స్నేహ శబరీష్ పూలమొక్క ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం బీజేపీ కార్యకర్తలు స్టేషన్‌లోకి ఒక్కసారిగా తోసుకురావడంతో తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఓ వ్యక్తి చేయి, మరో వ్యక్తి కాలుకు తీవ్రగాయాలయ్యాయి.


కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న కావ్య, సుధారాణి

జంక్షన్ అభివృద్ధికి సహకరించండి : ఎంపీ కడియం కావ్య

తెలంగాణలో కీలకమైన కాజీపేట రైల్వే కనెక్టివిటీ, సౌకర్యాలను మెరుగు పర్చటంతో పాటు రైల్వే తయారీ యూనిట్ పనులను వేగవతం చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. ఈ మేరకు రైల్వే మం త్రికి ఎంపీ వినతిపత్రం ఇచ్చారు. కాజీపేటను రైల్వే డివిజన్‌గా మార్చాలని కోరారు. మల్టీ మోడల్ కనెక్టివిటీ ఇనిషియేటివ్ కింద కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. హసన్‌పర్తి- నష్కల్, చింతల్‌పల్లికి ప్రత్యామ్నాయ రైల్వే బైపాస్ ప్రతిపాదనల ను పునఃపరిశీలించాలని అభ్యర్థించారు. భూనిర్వాసితులు, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

డివిజన్ హోదా ఊసే లేదు..

నిరాశ పర్చిన రైల్వే మంత్రి పర్యటన

కాజీపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం కాజీపేట పర్యటన గంట ఆలస్యంగా సాగింది. కోచ్ ఫ్యాక్టరీలో 3.15 గంటలకు మీడియాతో మాట్లాడిన రైల్వే మంత్రి కోచ్‌ఫ్యాక్టరీ అభివృద్ధి, దాని నిర్మాణం తీరు మాత్రమే వివరించారు. అశ్వినీ వైష్ణవ్ కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేసే విషయం ఊసెత్తకుండానే తన ప్రసంగాన్ని ముగించారు. దీంతో స్థానికులు, రైల్వే కార్మిక వర్గాలు, పలు రాజకీయ పార్టీల నేతలు నిరాశ చెందారు. డివిజన్ ప్రస్తావన రాకపోవడం బాధాకరమని పలుకార్మిక నాయకులు బహిరంగంగానే చర్చించుకున్నారు. విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ జోన్ గా ప్రకటించినప్పుడు కాజీపేట డివిజన్ కూడా ప్రకటించాల్సి ఉంది. ఆలస్యమైనా శనివారం రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నేరుగా కాజీపేటకు వస్తుండడంతో డివిజన్ ప్రకటన ఉంటుందనే చాలా మంది ఊహించారు. అలాంటి ప్రకటన రాకపోవడంతో స్థానికులు నిరుత్సాహానికి గురయ్యారు. ఇదే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రైల్వే ప్రాజెక్ట్‌లైన కాజీపేట - సికింద్రాబాద్ మూడో రైల్వే లైన్, కాజీపేటలో ట్రయాంగిల్ ప్లాట్‌ఫారాలు, డోర్నకల్- మిర్యాలగూడ 105 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణం గురించికాని, నష్కల్ - హసన్‌పర్తి 461 కోట్లతో నూతన రైల్వే నిర్మాణం గురించి కూడా రైల్వే మంత్రి ప్రస్తావించలేదు.

భూ తగాదాలో 19 మందిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం ఇస్లావత్‌తండా (ఎం) పరిధిలోని భూ తగాదాలో ఘర్షణ పడిన 19 మందిపై కేసు నమోదు చేసినట్లు కురవి ఎస్సై సతీష్ శనివా రం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకా రం.. ఇస్లావత్ తండాకు చెందిన గిరిజన రైతులు భూ తగాదా విషయంలో గొడవపడి ఇరు వర్గాలు దాడులు చేసుకున్నారని చెప్పారు. ఈ ఘటనలో ఇస్లావత్ వనిత, మరోవర్గం భూక్య మోతీలాల్ ఇచ్చిన ఫిర్యాదులతో 19 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లైంగిక వేధింపులపై కమిటీ ఏర్పాటు

బీఈడీ విద్యార్థుల ఫిర్యాదుపై విచారణ

కేయూ క్యాంపస్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ బీఈడీ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డరనే ఆరోపణల నేపథ్యంలో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం విచారణ కమిటీని నియమించారు.

ఛైర్మన్‌గా ఆంగ్ల విభాగం అధిపతి ఆర్. మేఘనరావుతో పాటు క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.మమత, ఫిజిక్స్ విభాగాధిపతి డి.మంజుల, అకౌంట్స్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలతదేవి విచారణ కమిటీ బాధ్యులుగా నియమించారు. వీరు శనివారం కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో మొదటి దఫా విచారణ చేపట్టారు. క్యాం పస్ కళాశాల బీఈడీ విద్యార్థులు 24 మంది స్వయంగా సంతకాలు చేసి మహిళ విద్యార్థులపై జరిగిన లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేశారు. వాటి ఆధారంగా విచారణ జరిపారు. ఈ నెల 22న మంగళవారం మరో దఫా కళాశాలకు వచ్చి విద్యార్థులతో నేరుగా మాట్లాడి బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేసే అవకాశం ఉంది. కాగా, కొన్నేళ్ళుగా టీచింగ్ ప్రాక్టీస్‌లో ఉన్న ఇద్దరు అధ్యాపకులు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఎరువుల షాపులు తనిఖీ

కేసముద్రం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) :కేసముద్రంలో ఎరువుల షాపులను, పీఏసీఎస్ కేంద్రాలను శనివారం ఏవో వెంకన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని ఎరువుల నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. మండలంలో ప్రైవేటు దుకాణాలు, సొసైటీల్లో 323మెట్రిక్ టన్నుల యూరియా, 53 మెట్రిక్ టన్నుల డీఏపీ, 44 మెట్రిక్ టన్నుల పొటాష్, 115 మెట్రిక్ టన్నుల సూపర్, 534 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు ఉన్నాయని తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి.. పీఈటీ నాగేశ్వర్

- కవి, గాయకుడు, కళాకారుడిగా రాణింపు
- నిరుపేద కుటుంబంలో పుట్టి పీఈటీగా ఉద్యోగం సాధించి..
- వరించిన అవార్డులు, పురస్కారాలు

మహబూబాబాద్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబంలో జన్మించి.. మొక్కవోని దీక్షతో ముందుకు సాగి.. జీవనోపాధి కోసం దశాబ్ద కాలం కల్లుగీత వృత్తిని కొనసాగించి.. కష్టాలను అధిగమించి ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి పీఈటీగా ఉద్యోగం సంపాదించిన జక్కి. నాగేశ్వర్ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యను చదివి సర్కారు కొలువు సాధించి చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు... పీఈటీగా ఉద్యోగం నిర్వహిస్తూనే కవి, గాయకుడు, కళాకారుడిగా సామాజిక సేవ పాటలు రచిస్తూ, పాడుతూ, ప్రదర్శనలిస్తూ ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు.


నాటక ప్రదర్శనలో జక్కి. నాగేశ్వర్

క్రీడాకారులను తీర్చిదిద్దుతూ..

నెల్లికుదురు మండలం ఆలేరు ఉన్నత పాఠశాలలో తొలి పోస్టింగ్‌లో పీఈటీగా చేరారు. పాఠశాల వేళలు పూర్తయ్యాక ఇంటికి వెళ్లకుండా రాత్రి 7 గంటల వరకు విద్యార్థులకు క్రీడా మెళకువలు నేర్పించేవాడు. 22 మందిని కబడ్డీ, ఖో-ఖో విభాగంలో 20 సార్లు రాష్ట్ర స్థాయి, రెండు జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దారు. 2018-24 వరకు కురవి మండలం నేరడలో పని చేసి ఆరుగురు విద్యార్థినులు టెన్నికాయిట్‌లో 13 సార్లు రాష్ట్రస్థాయి, ఐదు జాతీయ స్థాయి ఆటల్లో పోటీపడేలా కృషి చేశారు. 2024 నుంచి తన సొంతూరు చిన్నగూడూరులో పని చేస్తున్నారు.


జక్కి.నాగేశ్వర్‌ను సన్మానిస్తున్న అప్పటి మహబూబాబాద్ కలెక్టర్ శశాంక

నిరుపేద కుటుంబంలో జన్మించి..

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరుకు చెందిన నిరుపేద దంపతులు జక్కి అంతయ్య, వరమ్మ దంపతుల కుమారుడు నాగేశ్వర్. టెన్త్ వరకు తన సొంతూరులో విద్యనభ్యసించాడు. 1991-93 వరకు మానుకోటలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. ఆర్థిక ఇబ్బందులతో విద్యను ఆపేసి 1995లో కుల వృత్తి కల్లు గీతను ఎంచుకున్నారు. 1997లో మళ్లీ విద్యను ఆరంభించి డిగ్రీ, ఎంఏ (హిస్టరీ), బీపీఈడీ పూర్తి చేశారు. 2008 డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా సర్కారు కొలువు సంపాదించి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు.

అక్కడ నుంచి విద్యార్థి ఫుల్‌చంద్ రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలో పాల్గొని ప్రతిభ చాటాడు. తాను కూడా 2017, 2022లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి (35 సంవత్సరాలు పైబడిన) మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్‌లో పతకాలు సాధించారు. 2023 సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజు కలెక్టర్ శశాంక చేతుల మీదుగా ఉత్తమ పీఈటీగా అవార్డును అందుకున్నారు.

వివిధ నాటకాల ప్రదర్శన

జక్కి. నాగేశ్వర్ తన తండ్రి అంతయ్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని సోదరులు వీరన్న, చంద్రయ్యలను అనుకరిస్తూ చిన్ననాటి నుంచి నాటకాలు ప్రదర్శించేవారు. చిన్నగూడూరులో తోటి కళాకారులతో కలిసి పండుగ రోజుల్లో కనకతార, సత్యహరిశ్చంద్ర, మార్కండేయ, భక్తప్రహ్లాద, చంద్రహాస లాంటి నాటికలు వేశారు. 2023 తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో తాను రాసిన 'ఇదిరా తెలంగాణ పోరు' అన్న కవితకు ఉత్తమ కవిగా ఎంపికయ్యారు.

గోల్డెన్ అవర్

- సైబర్ నేరాల కట్టడికి మొదటి గంటే కీలకం
- సకాలంలో ఫిర్యాదు చేస్తే సొమ్ము వెనక్కి

కృష్ణకాలనీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ మోసాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఓ వైపు పోలీసుశాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నా.. అదే రీతిలో మోసాలు జరుగుతున్నాయి. సులభంగా డబ్బులు సంపాదించాలని కొందరు అమాయకులు డబ్బులు పోగొట్టుకుంటున్నారు. సైబర్ చోరులు సరికొత్త పంథాలో మోసాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. భూపాలపల్లి జిల్లా పరిధిలో గడిచిన ఆరు నెలల్లో చాలా మంది బాధితులు సైబర్ మోసాల బారిన పడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. బాధితుల కోసం పోలీసుశాఖ గోల్డెన్ అవర్ పేరుతో సైబర్ చోరుల కట్టడికి నూతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకుంటే బాధితులకు కాస్త ఊరట లభించనుంది.

విద్యావంతులే అధికం..

సైబర్ మోసాల బారిన పడుతున్న వారు దాదాపు ఎక్కువ గా చదువుకున్న వారే ఉండడం గమనార్హం. ఎంతో శ్రమించి సం పాదించుకున్న డబ్బులను చాలా తెలివిగా, బెదిరింపులకు గురి చేసి, ఆశ చూపి.. ఇలా సైబర్ మోసాలకు పాల్పడుతుండగా బాధితులు మోసపోతూనే ఉన్నారు. ఏమి తెలియక కొందరు మోసపోతుంటే.. అన్నీ తెలిసిన వారే అధికంగా మోసపోతుండడం విస్మయానికి గురి చేస్తోంది.

మొదటి గంట కీలకం..

గోల్డెన్ అవర్ అంటే ఏదైన ఘటన జరిగిన గంట వ్యవధిలో తీసుకునే చర్య. ప్రమాదాల్లో గాయపడిన వారి ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్ కీలకం. అలాగే సైబర్ నేరాల్లో నిందితుల్ని పట్టుకునేందుకు, బాధితులు పోగొట్టుకున్న సొమ్మును రికవరీ చేసేందుకు తొలి గంట అంతే కీలకం. తమ డబ్బును పోగొట్టుకున్న గంటలో ఫిర్యాదు చేస్తే బ్యాంకు ఖాతాను హోల్డ్ చేస్తారు. సైబర్ ఉచ్చులో పడి నగదును పోగొట్టుకున్న బాధితులు గంటలోపు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే కాస్త మేలు జరిగే అవకాశం ఉంది.

పలు విధాలుగా వల

సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా అమాయకులు వలేస్తున్నారు. ప్రధానంగా టెలిగ్రామ్‌ను ఉపయోగిస్తున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బులు డబుల్ చేస్తామని మరికొందరు వాట్సాప్‌లలో వచ్చే తెలియని లింక్‌లను ఓపెన్ చేస్తూ ఇంకొందరు ఏదో రకంగా సైబర్ మోసాల బారిన పడుతున్నారు. రైతు బంధు సమయంలో ఓటీపీలు అడుగుతూ.. పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలని అప్‌డేట్ చేయాలని ఫోన్‌లు చేస్తుంటారు. అలాగే, ఒక వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి అందులో వారే 20 మంది ఉండి అమాయకుల ఒక నెంబర్ యాడ్ చేసి గ్రూపులు చర్చిస్తారు. ఎవరినైతే యాడ్ చేస్తారో వారినే టార్గెట్ చేసి మోసపోయే స్థితికి తీసుకొస్తారు. ఈ మధ్య డిజిటల్ అరెస్ట్ పేరుతో కొత్త మోసాన్ని తెరమీదకు తెచ్చారు. ఉన్నత చదువులు, ఉద్యోగాల చేస్తూ నాగ్‌పూర్, ఢిల్లీ, చెన్నై ఇతరత్రా ప్రాంతాల్లో ఉండేవారి వివరాలు సేకరిస్తారు. వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మేము నేషన్ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో నుంచి మాట్లాడుతున్నామని చెబుతారు. 'మీ కుమారుడిని గంజాయి కేసులో పట్టుకున్నాం.. కేసు కాకుండా వదిలేయాలంటే రూ. 2లక్షలు పంపించాలి' అని డిమాండ్ చేస్తారు. పూర్తి స్థాయిలో నమ్మించేందుకు వీడియో కాల్స్ సైతం చేస్తారు. ఈ తరహా మోసాలు వరంగల్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి.

ఆరు నెలల్లోనే రూ.96.70 లక్షలు మాయం

భూపాలపల్లి జిల్లాలో సైబర్ మోసాలు మితిమీరుతున్నాయి. గడిచిన ఆరు నెలల్లో జిల్లాలో 136 మంది సైబర్ నేరగాళ్ల వలలో పడ్డారు. వీరంతా కలిపి రూ.96,70,500 నగదును చేజేతులారా పోగొట్టుకున్నారు. ఫిర్యాదు చేసిన బాధితుల రూ.18,27,090 హోల్డ్ చేశారు. రెండు సర్కిళ్ల పరిధిలో 131 మంది బాధితులు రూ. 89,47,483 పోగొట్టుకున్నారు. ఇక కాటారం సబ్ డివిజన్‌లో రూ.1,09,678 సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లగా.. రూ.7,23,017 నగదును పోలీసులు స్తంభింపజేశారు.

గంటలోపే ఫిర్యాదు చేయాలి

కిరణ్‌ఖరే, ఎస్పీ భూపాలపల్లి జిల్లా



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఒకవేళ డబ్బులు పోగొట్టుకుంటే గంటలోపే 1930, స్థానిక పీఎస్‌లో గానీ ఫిర్యాదు చేయాలి. దీంతో డబ్బులను వెంటనే హోల్డ్ చేసి తిరిగి తెప్పించే వీలు ఉంటుంది. చాలా మంది ఆలస్యంగా స్పందిస్తున్నారు. తెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీలు చెప్పవద్దు. వాట్సాప్‌లలో వచ్చే తెలియని లింక్‌లను ఓపెన్ చేయొద్దు. అప్రమత్తంగా ఉండి మోసాల బారిన పడొద్దు.

సిమ్ కార్డుల దుర్వినియోగంపై కమిషనర్ ఆరా

వరంగల్ కార్పొరేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు సంబంధించిన గ్రూప్ సిరీస్ సిమ్‌కార్డులు దుర్వినియోగం అవుతున్నట్టు శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'సిమ్ ఒకరిది.. సోకు ఒకరిది' అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం విధితమే. ఈ విషయాన్ని కమిషనర్ చహత్ బాజ్ పాయ్ సీరియస్‌గా తీసుకుని సంబంధిత సెక్షన్ అధికారితో మాట్లాడినట్టు తెలిసింది. నగర పరిధిలో ప్రభుత్వం నుంచి ఎన్ని సిమ్‌కార్డులు ఉన్నాయి ? ఎన్ని ప్రస్తుతం పని చేస్తున్నాయి ? ఎంత మంది విశ్రాంత, బదిలీ అయిన అధికారుల వద్ద ఉన్నాయో నివేదిక సమర్పించాలని కోరినట్టు తెలిసింది. ఈ సందర్భంగా కొన్ని నెంబర్లకు ఫోన్ చేయగా విశ్రాంత అధికారులు వాడుతున్నట్టు గుర్తించి అవాక్కైనట్టు తెలిసింది. ఈ క్రమంలో సంబంధిత పరిపాలనా విభాగం అధికారి సిమ్‌కార్డుల లెక్క కోసం ఉరుకులు పరుగులు పెట్టారు. సిమ్‌కార్డులు వాడుతున్న అధికారులు వెంటనే అప్పగించాలని కోరినట్టు తెలిసింది. అయితే, జీడబ్ల్యూఎంసీ సిరీస్‌తో ఉన్న సిమ్‌కార్డులను కొందరు పర్మనెంట్ చేసుకున్నారని పర్యవేక్షణ అధికారి రావుల ఆనంద్ తెలిపారు.



పైథాన్ ప్రోగ్రాంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి తదితరులు

నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి

ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాల మెరుగుదలతోనే విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య అందించడం సాధ్యమవుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఐ.రాజశ్రీరెడ్డి అన్నారు. అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ పైథాన్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా విద్యార్థులకు బోధన చేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీఎస్ఈఈ విభాగం అధ్యాపకులు ఎం.మృత్యుంజయ, ఇ.సుదర్శన్, సమన్వయకర్త బి.కళ్యాణి, ఏవో వేణుగోపాలస్వామి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'సాట్' చైర్మన్‌ను కలిసిన తైక్వాండో కార్యదర్శి



సాట్ చైర్మన్ శివసేనారెడ్డికి మెమెంటో ఇస్తున్న గణేష్

వరంగల్ స్పోర్ట్స్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) చైర్మన్ శివసేనారెడ్డిని హైదరాబాద్‌లోని సాట్ కార్యాలయంలో పారా తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎల్లావుల గణేష్‌యాదవ్ శనివారం మార్యాదపూర్వకంగా కలిసారు. రా ష్ట్ర వ్యాప్తంగా పారా తైక్వాం డో క్రీడాభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమం గురించి శివసేనారెడ్డితో చర్చించారు. ఈ నెల 26నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు మలేషియాలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పారా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొనే ముగ్గురు క్రీడాకారులు, ఒక కోచ్‌కు ఆర్థిక సహాయంతో పాటు అవసరమైన సదుపాయాలను కల్పించాలని శివసేనారెడ్డిని కోరారు. మలేషియాలో జరిగే అంతర్జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్ర పారా క్రీడాకారులు తప్పకుండా పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి, ప్రతిష్ఠలు తీసుకవస్తారని గణేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నేతలు





అశ్విని వైష్ణవ్‌తో బీజేపీ నేతలు, వినతి పత్రం ఇస్తున్న రంజిత్‌రావు

మడికొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): అయోధ్యాపురంలోని ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ సందర్శనకు వచ్చిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను శనివారం స్థానిక బీజేపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. అయోధ్యపురంలో ఏర్పాటు చేస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని కార్పొరేటర్ జలగం అనిత రంజిత్‌రావు కోరారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మార్తినేని ధర్మారావు, జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు తదితరులు ఉన్నారు.

మడికొండలో పిచ్చికుక్క స్వైర విహారం

ఒకరికి తీవ్రగాయాలు

మడికొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మడికొండలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసి పలువురిపై దాడి చేసింది. శనివారం స్థానిక వైన్‌షాప్ సమీపంలో రోడ్డుపైకి వచ్చి పలువురిని గాయపరిచింది. కుక్క దాడిలో ముప్పిడి కమలాకర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఓ మహిళతో పాటు పలువురు గాయాలపాలై ఆస్పత్రికి వెళ్లారు. కాగా కుక్కలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కొద్ది రోజుల క్రితమే స్థానికులు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించినా స్పందించలేదని, ఇప్పటికైనా వీధికుక్కల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో రౌండ్ టేబుల్ క్లాస్‌రూం



రౌండ్ టేబుల్ పద్ధతిలో కూర్చున్న విద్యార్థులు

మడికొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో మాదిరిగా కాజీపేట మండలం అయోధ్యాపురం ప్రభుత్వ పాఠశాలలో శనివారం ప్రయోగాత్మకంగా రౌండ్ టేబుల్ పద్ధతిలో విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మన్నె చంద్రయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శారదాదేవి, హెడ్ కానిస్టేబుల్ జయరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయడానికే సాంస్కృతికోత్సవాలు

పింగిళి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి గౌడ్

వడ్డెపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికే సాంస్కృతికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పింగిళి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మూడో శనివారం సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతి కోత్సవాల్లో విద్యార్థినిలు ప్రదర్శించిన ఆట, పాట ఆద్యంతం అలరించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రమౌళి గౌడ్ మాట్లాడుతూ విద్యార్థినిలలో ఆత్మవిశ్వాసం, మానసిక వికాసం సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీకాంతం, అధ్యాపకులు మమత, అరుణ, రాజేశ్వరి, సురేష్‌బాబుతో పాటు విద్యార్థినిలు పాల్గొన్నారు.

నాసిరకంగా రోడ్డు నిర్మాణ పనులు



రామకృష్ణకాలనీలో రోడ్డు నిర్మాణం కోసం మొరంనకు బదులు నిర్మాణ వ్యర్థాలు, బురదమట్టిని పోయించిన కాంట్రాక్టర్

- నిర్మాణ వ్యర్థాలు, బురదమట్టితో పనులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

హనుమకొండ చౌరస్తా, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 10వ డివిజన్ పద్మాక్షికాలనీ సమీపంలోని రామకృష్ణ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం గతంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సుమారు రూ. 35లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో నాణ్యతతో రోడ్ల నిర్మాణం చేపట్టాల్సిన కాంట్రాక్టర్ నాసి రకంగా పనులు ప్రారంభించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రామకృష్ణకాలనీతో పాటు సమీపంలోని పలు వీధుల్లోని అంతర్గత మట్టి రోడ్ల ఎత్తు తక్కువగా ఉండటంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టే క్రమంలో మొరంతో రోడ్ల ఎత్తు పెంచాల్సి ఉంది. కానీ సదరు కాంట్రాక్టర్ అందుకు భిన్నంగా నిర్మాణ వ్యర్థాలను, బురదమట్టి, చిన్న చిన్న బండరాళ్లతో కూడిన మట్టిని రోడ్డు నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు పలు కాలనీల్లో మురుగు బయటకు వెళ్లేందుకు సైడ్ డ్రైన్‌లు నిర్మించాల్సి ఉండగా ఆదిశగా పనులు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రామకృష్ణకాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి కాంట్రాక్టర్ పై చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం పీసీ, పీఎన్‌డీటీ జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారి వివరాలు తెలియజేసేందుకు వాట్సాప్ నెంబరు 6300030940 ను ఏర్పాటు చేశామని, అదేవిధంగా కలెక్టరేట్‌లో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ మంజుల, డాక్టర్ ఎస్.కవిత, లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈవో తాల్లూరి లత, జిల్లా కోర్టు నుంచి నాగరాజు, డాన్‌బాస్కో స్వచ్ఛంద సంస్థ నుంచి పి.శారద, ఇ.రాజు, వి.అశోక్‌రెడ్డి, ప్రసన్న కుమార్, రాజేశ్వర్ రెడ్డి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులు ఉదార స్వభావం కలిగి ఉండాలి

కేఎంసీ బేసిక్ వర్క్‌షాప్‌లో ప్రిన్సిపాల్ సంధ్య



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ సంధ్య

వరంగల్ మెడికల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు సమాజం పట్ల ఉదార స్వభావం కలిగి ఉండాలని కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సంధ్య అన్నారు. శనివారం కేఎంసీలో సేవర్ధ్ క్లబ్, అనస్థీషియా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంధ్య మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్ ద్వారా ప్రతీ విద్యార్థి సంపూర్ణ అవగాహన కల్పించుకొని వారి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఇక్కడ నేర్చుకున్న ప్రతీ అంశాన్ని వైద్య వృత్తి చేపట్టిన తరువాత ఉదార స్వభావంతో చికిత్స అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఉరుకుల పరుగుల జీవనంలో అనేక మంది శారీర రుగ్మతలకు గురవుతున్నారని, ప్రాథమిక వైద్య అవగాహనతో జీవితాలను నిలబెట్టుకోవచ్చని తెలిపారు. ప్రపంచంలోనే వైద్య వృత్తి ఎంతో గొప్పదని ఈ కళాశాల ఎంతో మంది గొప్ప వైద్యులను తీర్చిదిద్దిందని ఆ స్ఫూర్తితోనే వైద్య విద్యార్థులు భవిష్యత్‌లో ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ కె.రామ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రామక శ్రీనివాస్, డాక్టర్ జి.హనుమంతరావు, డాక్టర్ అలివేలు, సేవర్ధ్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు జి.అనన్య, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సాయి సుధాంశ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు సిహెచ్.రామకృష్ణారావు, ఐ.హేమాంగిని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎం.శ్రీనిధి, ఎస్.లాస్యప్రియ, వివిధ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన 15 మంది డాక్టర్లు, 350 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు రైతు కన్నీటి సేద్యం

(5వ పేజీ తరువాయి)

హనుమకొండ జిల్లాలో 65వేలు, జనగామ జిల్లాలో 85వేలు, మహబూబాబాద్ జిల్లాలో 80వేలు, ములుగు జిల్లాలో 35వేలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 30వేల మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని మొత్తం సాగు విస్తీర్ణంలో 25 శాతం మేర పంటలు కౌలు రైతులే పండిస్తున్నారు. కౌలు రైతులను అధికారికంగా గుర్తించేందుకు సరైన విధానం లేకపోవటం వల్ల ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ పథకాలు భూయజమానులకే వర్తిస్తున్నాయి. కౌలు రైతులకు మాత్రం ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. వారికి గుర్తింపు లేకపోవడంతో బ్యాంకులు రుణాల మంజూరుకు నిరాకరిస్తున్నాయి.

రుణ అర్హత కార్డులేవీ ?

గతంలో కౌలు రైతులను ఆదుకునేందుకు రుణ అర్హత కార్డులు (ఎల్ఈసీ) జారీ చేశారు. వీటి ద్వారా వారు బ్యాంకుల నుంచి కొంత మేరకు రుణాలు పొందేవారు. పంటలు పండిన తర్వాత వచ్చిన ఆదాయంలో కొంత రుణాలు తీర్చేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చాలా కాలం వరకు ఇది అమలులో ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాయిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కార్డులను రద్దు చేసింది. కౌలు రైతులను మరో విధంగా ఆదుకుంటానని వాగ్ధానం చేసింది. ఆ హామీ ఆ తర్వాత అటకెక్కింది.

భూ అధీకృత చట్టం కింద..

భూ అధీకృత సాగుదారుల చట్టం-2011ను అమలు చేసి కౌలు రైతుల గుర్తింపు కోసం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా 2023 సెప్టెంబర్ 13న అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ కౌలు రైతులకు రాసిన బహిరంగ లేఖను గుర్తు చేస్తున్నారు. ఆ లేఖలో కౌలు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని, భూ అధీకృత సాగుదారుల చట్టం-2011ను అమలు చేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మళ్లీ ఇస్తామని, రైతు భరోసాతో పాటు ఇతర పథకాలు, పంట రుణాలను కూడా అందిస్తామంటూ హామీ ఇచ్చారని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌తో పాటు ఆరు గ్యారెంటీల్లోనూ కౌలు రైతులకు కూడా పథకాలు ఇస్తామని స్పష్టంగా పేర్కొన్నారని అంటున్నారు.

డిమాండ్లు..

కౌలు రైతుల గుర్తింపు విధానాన్ని తీసుకురావాలని, భూమి పత్రాలపై ఆధారపడకుండా పంట ఆధారిత రుణాలివ్వాలని, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఎదురయ్యే పంట నష్టాలను ఎదుర్కొనేందుకు పంటల బీమా, మద్దతు ధరలు కల్పించాలని, భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ పథకాలు వర్తించేలా కౌలు రైతులకు రుణ అర్హత కార్డుల విధానాన్ని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

నగరంలో ఫేక్ ఇన్సూరెన్స్‌లు

- ఆర్టీవో కార్యాలయాలే అడ్డాగా కొనసాగుతున్న దందా
- నకిలీ పత్రాలను అంటగడుతూ వాహనదారులకు బురిడీ
- బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- బ్రోకర్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్న టాస్క్‌ఫోర్స్

వరంగల్ క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ ఇలా ఏ పని కావాలన్నా ఆర్టీఏ కార్యాలయాలను అంటిపెట్టుకుని ఉండే బ్రోకర్లను ఆశ్రయించి వారికి కావాల్సింది ముట్టజెప్తే క్షణాల్లో పని అయిపోతుంది. ఇలా ప్రజల నమ్మకాన్ని క్యాచ్ చేసుకున్న హనుమకొండ, వరంగల్ ఆర్టీఏ కార్యాలయాల్లోని బ్రోకర్లు వాహనదారులకు ఫేక్ ఇన్సూరెన్స్‌లను అంటగట్టడం మొదలుపెట్టారు. ఎవరికీ అనుమానం రాకుండా ప్రముఖ కంపెనీల పేర్లతో పత్రాలను జారీ చేసి డబ్బులు దండుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రమాదాలకు గురైన వాహనదారులు ఇన్సూరెన్స్ డబ్బుల కోసం సదరు కంపెనీలను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై మోసపోయిన బాధితులు కమిషనరేట్‌లోని పలు పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదులు చేసినట్లుగా తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో రంగంలోకి దిగిన వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు హనుమకొండ, వరంగల్ ఆర్టీఏ కార్యాలయాల్లో ఫేక్ దందా కొనసాగిస్తున్న బ్రోకర్లను శనివారం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ప్రముఖ కంపెనీలను పోలిన ఇన్సూరెన్స్ పత్రాలు బ్రోకర్లకు ఎక్కడి నుంచి వచ్చాయి...? ఎన్నాళ్ల నుంచి ఈ దందా కొనసాగిస్తున్నారు...? ఇప్పటి వరకు ఎంత మందికి ఇన్సూరెన్స్ పత్రాలు జారీ చేశారు..? ప్రమాదాలకు గురై లబ్ధిపొందిన వారు ఎంత మంది ఉన్నారు అనే దానిపై కూపీ లాగుతున్నట్లుగా తెలుస్తోంది. ఒక ఇన్సూరెన్స్ వరకే పరిమితమయ్యారా లేక డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్, ఇతర పత్రాలను సైతం నకిలీవి జారీ చేశారా అనే దానిపై కూడా లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. కాగా కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు చేస్తున్నారనే విషయం తెలుసుకున్న చాలా మంది బ్రోకర్లు షాపులకు తాళాలు వేసి పరారయ్యారు. దీంతో నిత్యం వాహనదారులతో రద్దీగా ఉండే ఆర్టీఏ కార్యాలయాల్లో నిశబ్ద వాతావరణం ఏర్పడింది. బ్రోకర్ల ఈ దందాకు తెరలేపడానికి ముందు నుంచీ ఆర్టీఏ అధికారుల అందిస్తున్న ప్రోత్సాహమే కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.



బోనం నెత్తిన ఎత్తుకున్న డైరెక్టర్ మూగల రమ, ప్రిన్సిపాల్ ప్రగతిరెడ్డి, విద్యార్థులు

షైన్ హైస్కూల్‌లో బోనాల వేడుకలు

రాంనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బోనాల విశిష్టతను తెలియజేసేలా శనివారం రాంనగర్‌లోని షైన్ ఉన్నత పాఠశాల ఎలైట్ క్యాంపస్‌లో విద్యార్థుల మధ్య ఘనంగా బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ హాజరై విద్యార్థుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల డైరెక్టర్ మూగల రమ, ప్రిన్సిపాల్ ప్రగతి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బనకచర్లపై విద్యార్థులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నేతలు

కేయూ క్యాంపస్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నీటి వాటాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కేయూ బీఆర్ఎస్వీ నేతలు జెట్టి రాజేందర్, కలకోట సుమన్ పిలుపునిచ్చారు. శనివారం కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో బనకచర్లపై బీఆర్ఎస్వీ నేతృత్వంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోదావరిలో తెలంగాణ వాటా దక్కాలని, బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీతో కుమ్మక్కై జలదోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలుసుమన్, కందికొండ తిరుపతి, పస్తం అనిల్, చందూ, కుమార్, రాజజేశ్, సురేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్యాబిన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాజీపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట బోడగుట్ట సమీపంలోని రైల్వే క్యా బిన్ వద్ద శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే సీఐ వడ్డే నరేశ్ తెలిపారు. మృతుని వివరాలు ఇలా ఉన్నాయి.. ఎరుపు పొడవు ముఖం, ఎత్తు 5.5 వయస్సు (35) .బ్లాక్ జీన్స్, బ్లాక్, ఆరెంజ్‌కలర్ అడ్డగీతల టీ షర్ట్ ధరించి ఉన్నాడు. కుడి చాతిపై పుట్టుమచ్చ ఉంది. మృతున్ని గుర్తించడానికి ఎలాంటి ఆధారాలు లేవు. ఆనవాళ్లబట్టి చూస్తే మృతుడు అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలుస్తోంది. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో బధ్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి మొబైల్ నంబర్ 94400 27342, 99483 48070 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



తీన్మార్ మల్లన్నను పరామర్శిస్తున్న మేడారపు సుధాకర్, నరేశ్‌గౌడ్ తదితరులు

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు పరామర్శ

కేయూ క్యాంపస్ జూలై 19, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో క్యూన్యూస్ కార్యాలయంపై దాడి ఘటనలో గాయపడిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మేడారపు సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి నరేశ్ గౌడ్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతి పేరుతో రౌడీలు, సంఘ విద్రోహ శక్తులను పెంచి పోషిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే ఆమె సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు కోడం సాయిరాం, జోగుకృష్ణ, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో అలరించిన చిన్నారులు


హనుమకొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జవహర్ కాలనీలోని విశ్వవ్యాలీ స్కూల్లో శనివారం ముందస్తు బోనాల పండుగ ఘనంగా కన్నుల పండువగా నిర్వహించారు. బోనాలకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. బోనాల పండుగ విశిష్టత గురించి డైరెక్టర్ అచ్చ జగదీశ్వర్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఆట, పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.



బోనాల వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు







ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మండల మర్డర్స్	హిందీ చిత్రం	జూలై 25
అమెజాన్ ప్రైమ్		
జస్టిస్ ఆన్ ట్రయల్	వెబ్‌సిరీస్	జూలై 21
టిన్ సోల్జర్	హాలీవుడ్ మూవీ	జూలై 23
రంగీన్	హిందీ సిరీస్	జూలై 25
జియో హాట్‌స్టార్		
సర్జామీన్	హిందీ చిత్రం	జూలై 25

ఒకప్పుడు వేడి వేడి ఫిల్టర్ కాఫీ తాగితే ఆ మజానే వేరు అనుకొనేవారు. ఇప్పుడు ఆ ఫిల్టర్ కాఫీ మాత్రమే కాదు.. రకరకాల చల్లటి కాఫీలు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. ఈ కాఫీలను తయారుచేయటానికి అనువైన కాఫీ గింజలు కూడా మన దేశంలో లభిస్తున్నాయి. కాఫీ ప్రేమికుల కోసం ప్రపంచంలో ఉన్న రకరకాల కాఫీలను అందించటానికి దక్షిణభారత దేశంలో తొలిసారి స్టార్‌బక్స్ హైదరాబాద్‌లో ఒక ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌ను ప్రారంభించింది. ఇక్కడ దొరికే కొన్ని రకాల కాఫీల తయారీ ప్రక్రియలో **చెఫ్ నిఖిత** కూడా పాలుపంచుకున్నారు. తాను తయారుచేసిన కాఫీల వెనకున్న కథను ఆమె 'నవ్య'తో పంచుకున్నారు.

రుచులు మారుతున్నాయి





కాఫీ అంటే చాలా మందికి ఫిల్టర్ కాఫీనే కదా... ఇలా రకరకాల కాఫీల ఆలోచన ఎలా వచ్చింది?

తరాలు మారుతున్న కొలది రుచులు మారతాయి. ఒక పదార్థాన్ని మనం వండేటప్పుడు అనుసరించే ప్రక్రియలు మారతాయి. కాఫీనే ఒక ఉదాహరణగా తీసుకుందాం. మొదట్లో కాఫీ గింజలను గుండగా చేసి.. దానిని వేడి నీళ్లలో ఉడికించి తాగేవారు. ఆ తర్వాతి కాలంలో పాలు, పంచదార కలిపి తాగటం మొదలుపెట్టారు. ఇప్పుడు రకరకాల పాలను కలుపుతున్నారు. అంటే కాఫీని తయారు చేసే ప్రక్రియలోను.. దానిని తాగే తీరులో మార్పు వచ్చినట్లే కదా! ఒకప్పుడు కాఫీని వేడిగా మాత్రమే తాగేవారు. ఇప్పుడు కోల్డ్ కాఫీ కూడా తాగుతున్నారు. ఇలాంటి మార్పులు జరుగుతున్న సమయంలో ఈ కాఫీకి అదనపు రుచులు చేరిస్తే బావుంటుందనే ఆలోచనతో కొత్త తరహా కాఫీలు తయారుచేశాం. ఇప్పటి దాకా మేము చేసిన ప్రయత్నాలకు మంచి ఆదరణ లభించింది. కొత్త కాఫీలకు ఆదరణ లభిస్తుందనే నమ్మకం కూడా ఉంది.

బెల్లం, జామకాయ, మిరపకాయ, షికెన్‌జీ... ఈ రుచుల్లో కాఫీ బావుంటుందా?

మీరు చెప్పినవన్నీ మన చిన్ననాటి జ్ఞాపకాలు. జామకాయను కారం, ఉప్పు వేసుకొని తినని పిల్లలు ఉండరు. ఉత్తరభారత దేశంలో షికన్‌జీని ఇంటికి వచ్చిన వారందరికీ షర్బత్ రూపంలో ఇస్తారు. కర్ణాటకలో పానకం చాలా ఫేమస్. వీటికి కాఫీ టేస్ట్ చేరిస్తే ఎలా ఉంటుందనేదే ఆలోచన. వీటిని కొత్త తరం వారు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం నాకు ఉంది. కాలంతో పాటుగా రుచులు మారుతున్నాయి. మన వాళ్లు ఇతర దేశాలకు వెళ్లి అక్కడి రుచులను ఆదరిస్తున్నారు. ఉదాహరణకు కోల్డ్ కాఫీనే తీసుకుందాం. గతంలో మన దగ్గర కోల్డ్ కాఫీ తాగే వారు తక్కువ మంది ఉండేవారు. ఇప్పుడు వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికి ఒక కారణం- చాలా మంది విదేశాలకు వెళ్లి అక్కడ కోల్డ్ కాఫీని తాగటం. అయితే ఇప్పటికీ ఫిల్టర్ కాఫీని ఆస్వాదించేవారు ఎంతో మంది ఉన్నారు. వారికి కాఫీ ఒక జ్ఞాపకం. ఎవరిదాకానో ఎందుకు.. మా అమ్మ వేడి ఫిల్టర్ కాఫీనే తాగుతుంది. చల్లారితే తాగదు. నేను శీతాకాలంలో వేడి కాఫీ తాగుతా! వేసవిలో చల్లటి కాఫీ తాగుతా. పైగా కొంత తాగి కొంత దాచుకుంటా! వేడి కాఫీ తాగేవారికి ఈ సౌలభ్యం ఉండదు.

చెఫ్‌గా మీ అనుభవాలేమిటి?

చెఫ్ జీవితం అంత సులభం కాదు. ప్రతి రోజు కొత్తదనం కోసం ఆలోచించాలి. అదే సమయంలో కస్టమర్ల రుచి కూడా మనకు చాలా ముఖ్యం. చాలా సందర్భాలలో మనకు నచ్చింది..కస్టమర్లకు నచ్చాల్సిన అవసరం లేదు. అందువల్ల కస్టమర్లకు ఎలా ఇష్టమో అలాగే వండాలి. నేను పేస్ట్రీ చెఫ్‌ను. అంటే కేక్‌లు, డిజర్ట్స్ తయారుచేస్తారు. మనకు పాశ్చాత్యులే కేకుల తయారీని నేర్పారు. రకరకాల మిఠాయిల తయారీ మనకు ఎప్పటి నుంచో తెలుసు. ఈ మధ్యకాలంలో ఈ మిఠాయిలను కూడా సృజనాత్మకంగా తయారుచేస్తున్నారు. ఈ విధంగానే కేక్‌ల విషయంలో మేము సృజనాత్మకంగా ఉండాలి.



ఈమధ్య కాలంలో రకరకాల వివాదాల్లో చిక్కుకున్న నటుల్లో **రాజ్‌తరుణ్** ఒకరు. ఈ వివాదాలను పట్టించుకోకుండా ఆయన తన కెరీర్‌పైనే శ్రద్ధ చూపిస్తున్నారు. ఇటు ఓటీటీల్లో, అటు సినిమాల్లో బిజీగా ఉంటున్నారు. గతంలో హిట్ అయిన ఆయన సినిమా 'కుమారి 21 ఎఫ్' ఇటీవల రీ-రిలీజై... మంచి కనెక్షన్లు రాబట్టింది. ఈ నేపథ్యంలో ఆయనతో 'నవ్య' ముఖాముఖి.

నిజ జీవితంలో చాలా ఇంట్రావర్ట్‌ని...

ఎలా ఉన్నారు? అన్ని గొడవల నుంచి బయటకు వచ్చినట్లేనా?

అన్నింటినుంచి బయటకు వచ్చేసా. ఈ మధ్య హైదరాబాద్ సుదర్శన్ థియేటర్‌లో 'కుమారి 21 ఎఫ్' చూడటానికి వెళ్లాను. ప్రేక్షకులు సినిమాను ఎంజాయ్ చేస్తుంటే చాలా తృప్తిగా అనిపించింది. ఈ మధ్యకాలంలో నేను ఎక్కువగా బయటకు వెళ్లటం లేదు. ఈ తరహా అనుభవం కొత్తగా అనిపించింది.

మీరు ఎదుర్కొన్న గొడవలన్నింటిలో మీకు బాసటగా నిలిచిందెవరు?

అమ్మానాన్నలు, నా స్నేహితులతోపాటు సినిమాల పట్ల నాకున్న ప్రేమ నన్ను నడిపించింది. గొడవల వల్ల నేను, నా తల్లిదండ్రులు, స్నేహితులు... అందరం బాగా ఎఫెక్ట్ అయ్యాం. సినీనటుల జీవితంపై అందరికీ ఆసక్తి ఉంటుంది. వారి గురించి ఎలాంటి అపవాదు వచ్చినా వెంటనే నమ్మేస్తారు. నిజం బయటకు వచ్చే సమయానికి జరిగాల్సిన డ్యామేజి జరిగిపోతుంది. నా విషయంలోను అదే జరిగింది. అయితే నేను మీడియాలో రాసిన న్యూస్ చదవలేదు. టీవీల్లో, సోషల్ మీడియాలో వచ్చిన వీడియోలు చూడలేదు. నా స్నేహితులే వాటిని చూసేవారు. ఏం జరుగుతోందో చెప్పేవారు. వాస్తవానికి నిజ జీవితంలో కూడా నేను చాలా ఇంట్రావర్ట్‌ని. షూటింగ్ లొకేషన్‌కు వెళ్లిన వెంటనే ఎక్స్ట్రావర్ట్‌గా మారిపోతా. నాకు సంబంధించిన గొడవల విషయంలో నేను ఇంట్రావర్ట్‌గానే ఉండిపోయాను.

గొడవల ప్రభావం సినిమాలపై ఉందా? ఇప్పుడు ఏ ప్రాజెక్టులు చేస్తున్నారు?

ప్రభావం అస్సలు లేదండి. నేను నా సినిమాల బిజీలోనే ఉన్నాను. 'రామ్‌భజరంగ్' అనే సినిమా పాటలు తప్ప మిగిలినదంతా పూర్తయిపోయింది. 'పాంచ్ మినార్' సినిమా పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. ఒక ఓటీటీ ప్లాట్‌ఫామ్ కోసం 'చిరంజీవ' అనే డైరక్ట్ ఫిల్మ్ చేశాను.
అది కూడా విడుదల కు సిద్ధంగా ఉంది. 'కూర్మావతారం' అనే సినిమా జరుగుతోంది. వీటితో పాటుగా తమిళ్‌లో.. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నా. ఇలా ప్రస్తుతం ఈ సినిమాల బిజీలో ఉన్నా.

ఓటీటీ వల్ల ప్రేక్షకుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందా?


కచ్చితంగా వచ్చింది. ఒకప్పుడు సినిమా చూడాలంటే డబ్బులు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. నా చిన్నప్పుడు డీవీడీలు రెంట్‌కు తీసుకొని చూసేవాళ్లం. ఒక్క రోజు లేట్ అయినా అదనంగా డబ్బులు కట్టాల్సి వచ్చేది. అందువల్ల దీక్ష పట్టినట్లు సినిమాను చూసేసేవాళ్లం. ఓటీటీ వచ్చిన తర్వాత ఇలాంటి సమస్యలు తప్పాయి. ప్రపంచంలోని రకరకాల సినిమాల మన ముందుకే వస్తున్నాయి. దీనివల్ల ప్రేక్షకుల జడ్జిమెంట్‌లో మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా నటీ నటులకు ఇది ఒక అగ్నిపరీక్ష లాంటిది. ఈ మధ్య 'టూరిస్ట్ ఫ్యామిలీ' అనే సినిమా చూశాను. అద్భుతమైన ఎమోషన్స్ ఉన్న సినిమా. ఓటీటీలో చూసి, మళ్లీ థియేటర్‌లో కూడా చూశా. మా అమ్మనాన్నలను తీసుకువెళ్లి చూపించా.

ఓటీటీల వల్ల థియేటర్లకు రావటం లేదనే వాదన నిజమంటారా?

అలా ఉండదు. నా ఉద్దేశంలో సినిమా బావుంటే చూడటానికి వస్తారు. లేకపోతే రారు. అయితే ఒకప్పుడు సినిమా యావరేజ్‌గా ఉన్నా చూసేసేవారు. కానీ ఇప్పుడు సినిమా చాలా బావుంటే తప్ప థియేటర్‌లో చూడటం లేదు. అంతేకాదు... ఓటీటీకి, మామూలు సినిమాకు మధ్య తేడా ఉంది. ఓటీటీలో ఇంటర్వెల్ ఉండదు. దీనివల్ల దర్శకుడి మీద ఒత్తిడి ఉండదు. కథను తనకు నచ్చినట్లు చెప్పగలుగుతాడు. సినిమాలో అయితే మొదటి సీన్ నుంచి దర్శకుడు ప్రేక్షకులను ఇంప్రెస్ చేయటానికి ప్రయత్నించాలి.

మన వాళ్లు ఓటీటీకి తగినట్లుగా సినిమాలు తీస్తున్నారా?

ఇంకా ఓటీటీ లాంగ్వేజ్ పూర్తిగా తెలియలేదు. 'ఓటీటీలలో బూతులు వాడచ్చు. శృంగారం చూపించవచ్చు' అనుకొని సినిమాలు తీసేవాళ్లు ఉంటారు. మన దగ్గర హాలీవుడ్ డైరక్టర్ల మాదిరిగా నేరుగా ఓటీటీకి సినిమాలు తీసే వారు తక్కువ. పెద్ద డైరక్టర్లు ఓటీటీ కోసం సినిమాలు తీయటం మొదలుపెడితే చాలా మార్పులు వస్తాయి.



• సీవీఎల్ఎన్ ప్రసాద్

మొక్కలు ఆరోగ్యంగా ఇలా...

మనం సాధారణంగా నర్సరీల నుంచి మొక్కలు తెచ్చుకుని కుండీల్లో నాటుకుంటూ ఉంటాం. మొదట బాగానే ఉన్నప్పటికీ క్రమంగా మొక్కలు వాడిపోవడం, ఎండిపోవడం చూస్తూ ఉంటాం. అలా జరగడానికి కారణాలతోపాటు మొక్కలను జాగ్రత్తగా ఎలా కాపాడుకోవాలో తెలుసుకుందాం...



- వర్షాకాలంలో మొక్కలకు ఎక్కువగా తెగుళ్లు, చీడలు పడుతూ ఉంటాయి. అందుకే తరచూ మొక్కలను గమనిస్తూ ఉండాలి. ఆకుల మీద రంధ్రాలు, గుడ్లు, కొమ్మలపై పురుగులు, గూళ్లు కనిపిస్తే ఆ భాగాలను వెంటనే కత్తిరించాలి. నీళ్లలో వేప నూనె లేదా బేకింగ్ సోడా కలిపి పిచికారీ చేయాలి. మొక్కలకు బాగా ఎండ తగిలేలా చూసుకోవాలి.
- మొక్క సరిగా ఎదగక పోయినా, ఆకులు వెంట వెంటనే పసుపు రంగులోకి మారిపోతున్నా తగిన పరిమాణంలో నైట్రోజన్ లభించడంలేదని అర్థం. వెంటనే మట్టిలో ఆవుపేడ, కాఫీ గింజలు, సేంద్రీయ ఎరువులు కలిపితే ప్రయోజనం ఉంటుంది. ఒక్కోసారి ఆకులు తెల్లగా మారుతుంటాయి. అలాంటప్పుడు కుండీలను ఎండలో పెడితే సమస్య తీరుతుంది.
- నీరు సరిపోకపోతే ఆకులు ఎండిపోయి పెళుసుగా మారతాయి. మొక్కల స్వభావాన్ని బట్టి రోజూ కుండీల్లో నీళ్లు పోస్తూ ఉండాలి.
- ఆకుల మధ్యలో ఉండే ఈనెలు పసుపు రంగులోకి మారితే మొక్కలకు మెగ్నీషియం, ఇతర పోషకాలు అందడంలేదని తెలుసుకోవాలి. అలాంటప్పుడు కుండీలో ఎప్సమ్ సాల్ట్ లేదా ఆలుగడ్డ పొట్టు, తేలికపాటి ఎరువులు కలిపితే సరిపోతుంది.
- కొమ్మలు ఎండిపోతూ ఆకుల అంచులు గోధుమ రంగులోకి మారుతుంటే మొక్కలకు పొటాషియం కావాలని గుర్తించాలి. మొక్కల మొదట్లో అరటి పండు తొక్కలు, కోడి గుడ్డు పెంకులు వేసి మట్టిని కదుపుతూ ఉండాలి.
- ఆకులు ఊదా రంగులోకి మారుతుంటే వేర్లు బలహీనమవుతున్నాయని తెలుసుకోవాలి. కోడిగుడ్డు పెంకులు, కూరగాయ తొక్కలను మట్టిలో కలుపుతూ ఉంటే మొక్కలు బలంగా పెరుగుతాయి.



పిల్లలు ఆత్మవిశ్వాసంతో ఎదగడానికి నాయకత్వ లక్షణాలు ఉపకరిస్తాయని నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే వీటిపై అవగాహన కల్పించడం మంచిదంటున్నారు. ఇందులో భాగంగా పిల్లలకు తల్లిదండ్రులు ఎలాంటి శిక్షణ అందించాలో తెలుసుకుందాం...

నాయకత్వ లక్షణాలతో ఆత్మవిశ్వాసం

- చేసే ప్రతి పనిలో పిల్లలను భాగస్వాములుగా చేయాలి. బజారు నుంచి సరుకులు తేవడం, డబ్బులు ఇచ్చి పుచ్చుకోవడం, కరెంట్ తదితర బిల్లులను ఆన్‌లైన్లో కట్టడం, హోటల్‌కి వెళ్లినప్పుడు ఆహారాన్ని ఆర్డర్ చేయడం, గ్యాస్ బుక్ చేయడం లాంటి పనులను పిల్లలకు అప్పజెప్పాలి. వివిధ సందర్భాల్లో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలో చేసి చూపించాలి. దీంతో బాధ్యత, క్రమశిక్షణ, పనులను పూర్తిచేసే నేర్పరితనం అలవడతాయి.
- వారికంటే చిన్నవారైన తమ్ముళ్లు, చెల్లెళ్లను జాగ్రత్తగా చూసుకోవడం, దగ్గరుండి హోంవర్క్ చేయించడం, పెద్దవారైన అక్కలు, అన్నలకు సహాయం చేయడం లాంటివి చెప్పి చేయించాలి. దీనివల్ల పిల్లలు తెలియకుండానే నాయకులుగా ఎదుగుతారు.
- ఇంటిని శుభ్రం చేయడం, తోటపని, కూరగాయలు కోయడం, బడికి వెళ్లేముందు బాక్సులు సర్దడం, వాటర్ బాటిల్స్ నింపడం లాంటి పనులు నేర్పించాలి. వీటివల్ల పిల్లలకు బాధ్యతగా ప్రవర్తించడం అలవాటవుతుంది.
- మీవల్ల ఏదైన పొరబాటు జరిగినప్పుడు దాన్ని ఒప్పుకోవాలి. అప్పుడే తప్పులు, పొరబాట్లు జరగడం కూడా సహజమే అన్న అంశం పిల్లలకు అర్థమవుతుంది. నేర్చుకుంటూనే ఎదగాలని తెలుసుకుంటారు.
- సంగీతం, నృత్యం, ఆటలు, రచనా వ్యాసాంగం... ఇలా దేనిలో ఆసక్తి ఉందో సూటిగా తెలిపేలా ప్రోత్సహించాలి. దీనివల్ల నేరుగా అభిప్రాయాన్ని తెలపడం, మాట్లాడే నైపుణ్యం, మానసిక ధైర్యం లాంటివి పిల్లలకు అలవడతాయి.





సంప్రదాయం

మేలిముసుగుతో మనోహారంగా



మేలిముసుగు అనేది రాణితనానికి చిహ్నం. సంప్రదాయానికి ప్రతీక. అందుకే మేలిముసుగు లేకుండా పెళ్లికూతురి అలంకరణ పూర్తికాదు. యువరాణిలా పెంచుకున్న తమ కూతురిని మేలిముసుగులో చూసి మురిసిపోతుంటారు తల్లిదండ్రులు. ఇలా వివాహం, సీమంతం, బిడ్డను ఉయ్యాలలో వేయడం లాంటి సంప్రదాయ వేడుకల్లో మేలిముసుగుకు ప్రత్యేక స్థానం ఉంది. పూర్వకాలం నుంచి కొనసాగుతూ వస్తున్న ఈ సంప్రదాయం.... ఎప్పటికప్పుడు సరికొత్త మార్పులు సంతరించుకుంటూ యువతులను, మహిళలను ఆకర్షిస్తోంది.

మేలిముసుగు ఎందుకు?

వివాహ వేడుకలో వధువుకు మేలిముసుగు ధారణ తప్పనిసరి. పలుచగా తేలికగా ఉండే అందమైన చున్నీ లేదా ఓణీని వధువు తలపై నుంచి భుజాల మీదుగా జాలువారేలా అమరుస్తారు. ఇది ఆమె గౌరవానికి, దర్పానికి, వినయానికి, సౌశీల్యానికి గుర్తుగా నిలుస్తుంది. వివాహ సమయంలో కలిగే భయం, బెరుకు, దుఃఖం లాంటి భావోద్వేగాలను దాచిపెడుతుంది. పెద్దవారి పట్ల పూజనీయత, వారినుంచి ఆశీస్సులు కోరే వినమ్రతను సూచిస్తుంది.

ట్రెండీగా ఇలా...

- మేలిముసుగు కోసం పారదర్శకంగా మెరిసే వస్త్రాన్ని ఎంచుకోవాలి. టిష్యూ, ఆర్గంజా వస్త్రాలతో తయారుచేసినవాటిని యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. పెళ్లి చీర, బ్లౌజ్‌లకు మ్యాచ్ అయ్యేలా ఎంపిక చేసుకుంటున్నారు. చీరకు వెడల్పాటి పెద్ద అంచు ఉంటే దానికి సరిపోలేలా చూసుకుంటున్నారు. మేలిముసుగు ఎంత పలుచగా ఉంటే అంత అహ్లాదకరంగా కనిపిస్తుంది. రంగుల కలయికలా కాకుండా ఒకే రంగులో ఉంటే మరింత శోభనిస్తుంది. పొడవుగా నేలను తాకే మేలిముసుగు మీద వధూవరుల పేర్లు, చిన్న చిన్న పూలు, నక్షత్రాలు, చుక్కలు ఎంబ్రాయిడరీ చేసి అందుబాటులోకి తెస్తున్నారు. తళతళ మెరిసే తెల్లని రాళ్లను అతికించి సరికొత్త మేలిముసుగులను రూపొందిస్తున్నారు. రాత్రి సమయంలో వివాహం ముహూర్తం ఉన్న యువతులు వీటిని ఎంపిక చేసుకుంటున్నారు. అచ్చం బంగారంలా మెరిసే మేలిముసుగు ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది.

ఎలా ఎంచుకోవాలంటే...

- మేలిముసుగు తయారుచేసే వస్త్రం మందంగా ఉండకూడదు. వెడల్పాటి లేసులు, భారీ ఎంబ్రాయిడరీ వర్క్‌లు, జర్దోసి వర్క్‌లు ఉండకూడదు. వీటి వల్ల మేలిముసుగు బరువు పెరుగుతుంది. ధరించినప్పుడు భారంగా అనిపిస్తుంది. పలుచగా, మెత్తగా, జాలువారేలా ఉండే మేలిముసుగులను మాత్రమే ఎంచుకోవాలి.
- ఛాయ తక్కువగా ఉన్నవారు నెట్టెడ్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన మేలిముసుగును ధరిస్తే బాగుంటుంది. చీరకు భిన్నంగా ఉన్న రంగును ఎంచుకుంటే ఆకర్షణీయంగా కనిపిస్తారు.
- మంచి ఛాయతో ఉన్నవారు చీర రంగుతో మ్యాచ్ అయ్యే వాటిని ధరించవచ్చు.
- నేలను తాకుతూ ఆకర్షణీయమైన రంగులో మెరిసే మేలిముసుగు అందరికీ చక్కగా నప్పుతుంది.



• ఖ్యాతి,
ఖ్యాతి డిజైనర్ స్టూడియో
హైదరాబాద్, 6300386749

ఆర్థిక వివాదాల వల్లే... చందు రాథోడ్ హత్య

పార్టీలో ఆధిపత్యపోరుతో పాటు తన భార్యతో వివాహేతర సంబంధం ఉందనడమే కారణం

విచారణలో ప్రధాన నిందితుడి వెల్లడి

చాదర్‌ఘాట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలు, పార్టీలో ఆధిపత్య పోరుతోపాటు తన భార్యతో వివాహేతర సంబంధమున్నట్లుగా చెబుతూ అనుచరులను తనవైపు తిప్పుకుంటున్నాడన్న కారణంతో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కెతావత్ చందు రాథోడ్‌ను హత్య చేయించినట్లుగా ప్రధాన నిందితుడు దొంతి రాజేష్ వెల్లడించినట్లు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ తెలిపారు. చందు రాథోడ్ హత్య కేసులో అరెస్ట్ చేసిన ఐదుగురు నిందితులను సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మీడియా ముందుంచారు. డీసీపీ వెల్లడించిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం నర్సాయిపల్లికి చెందిన చందు రాథోడ్ (50) దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలోని ద్వారకాపురి కాలనీలో ఉంటున్నారు. ఈ నెల 15న జనగాం జిల్లా సీతారాంపురం గ్రామానికి చెందిన దొంతి రాజేష్ అలియాస్ రాజన్న(48) తన ఐదుగురు అనుచరులతో కలిసి ముసారాంబాగ్ శాలివాహననగర్ కాలనీలోని చందు రాథోడ్ వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా తుపాకులతో కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఈయన హత్యకు భూపేష్ గుప్తా కుంబ ఏడుకొండలు, శ్రీను అలియాస్ నాగరాజు, కందులూరి ప్రశాంత్, ఏపీకి చెందిన అర్జున్ జ్ఞానప్రకాష్, లింగిబేడి రాంబాబులు దొంతి రాజేష్‌కు సహకరించినట్టు డీసీపీ తెలిపారు. వీరిలో శ్రీను పరారీలో ఉన్నాడని, మిగతా ఐదుగురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. హయత్‌నగర్‌లోని కుంటూర్లులో గల దాదాపు వంద ఎకరాల ప్రభుత్వ స్థలంలో సుమారు 1,300 వరకు సీపీఐ తరఫున నిరుపేద కుటుంబాలకు గుడిసెలు వేయించారు. ఒక్కో గుడిసె నుంచి సుమారు రూ.వెయ్యి చొప్పున రూ.13 లక్షల వరకు చందు రాథోడ్ వసూలు చేశాడు. ఇందులోంచి రాజేష్‌కు చందు డబ్బులు ఇవ్వకపోవడంతోపాటు అతని భార్యతో తనకు వివాహేతర సంబంధమున్నట్టుగా చెప్పుకుంటూ అనుచరులను రాజేశ్‌కు దూరం చేశాడు. దీంతో రాజేశ్.. చందు రాథోడ్‌ను హత్య చేసేందుకు మరో ఐదుగురితో కలిసి పథకం వేశాడు. 15న ముసారాంబాగ్ శాలివాహననగర్ కాలనీలోని జీహెచ్‌ఎంసీ పార్క్‌లో వాకింగ్ ముగించుకుని బయటికి వచ్చిన చందు రాథోడ్‌పై ముందు ప్రశాంత్ కళ్లలో కారం చల్లాడు. ఆ వెంటనే అర్జున్ జ్ఞానప్రకాష్, శ్రీను రెండు తుపాకులతో ఏడు రౌండ్ల కాల్పులు జరిపారు. దీంతో చందు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో సీసీ ఫుటేజీలు, కాల్‌డేటాతో పలువురిని అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులకు అర్జున్ జ్ఞానప్రకాష్, రాంబాబు అదుపులోకి తీసుకుని విచారించారు. హత్యకు ప్రధాన సూత్రధారి రాజేష్‌తో ఏడుకొండలు జనగామలో ఉన్నట్లు గుర్తించి వారిని పట్టుకున్నారు. ప్రశాంత్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

శృంగారం.. వయాగ్ర మాత్ర

సెక్స్‌లో విఫలమవుతున్న పురుషులకు స్వల్ప మోతాదులో సూచిస్తున్న వైద్యులు

- ఎలాంటి లోపం లేకున్నా.. శృంగారంలో విఫలమవుతున్న పురుషులు
- 'పర్ఫార్మెన్స్ యాంగ్జైటీ డిజార్డర్'తో ఇబ్బంది
- దీంతో వైద్యుల వద్దకు పరుగు
- విశ్వాసం పెంచేందుకు తాత్కాలిక వినియోగం
- అదే సమయంలో కౌన్సెలింగ్‌తో అవగాహన

హైదరాబాద్ సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి ముందు పురుషులు శృంగారంపై చాలా అంచనాలు వేసుకుంటుంటారు. ఎక్కువ సేపు శృంగారం చేయాలని, భార్యను సంతోషపెట్టాలని భావిస్తుంటారు. అమ్మాయిలు కూడా ఎన్నో ఊహల్లో ఉంటుంటారు. కానీ ఊహించుకున్న విధంగా పెళ్లి తర్వాత పరిస్థితులు కనిపించకపోవడంతో ఆందోళన పెరుగుతుంది. పోర్న్ వీడియోల్లో చూసినట్టుగా చేయాలనే ఆరాటం, అవగాహన లేకపోవడంతో పురుషులు అత్యుత్సాహంతో వ్యవహరిస్తుంటారు. మొదట్లోనే ఏమాత్రం తేడా వచ్చినా కుంగిపోతుంటారు. తనలో లైంగిక సామర్థ్యం సరిగా లేదేమోనని అనుమానాలు, దానితో భార్యకు దూరంగా ఉండటం, ఇతర ఒత్తిళ్లతో అంగస్తంభన లోపం, శీఘ్రస్ఖలనం వంటి సమస్యల బారినపడుతుంటారు. దీనిని 'పర్ఫార్మెన్స్ యాంగ్జైటీ డిజార్డర్'గా వ్యవహరిస్తారు. దీనితో భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు వస్తున్నాయి. చివరకు విడాకుల వరకు వెళుతున్నాయి. ఇలా సమస్యలు ఎదుర్కొంటున్నవారిలో చాలా మంది 25, 30 ఏళ్ల యువకులేనని.. వారిలో ఒకసారి నాటుకుపోయిన భయం వారిని శృంగార జీవితానికి దూరం చేస్తోందని సెక్సాలజిస్టులు, ఆండ్రాలజిస్టులు చెబుతున్నారు. లైంగిక సామర్థ్యం బాగానే ఉన్నా లేనిపోని భయాందోళనతో ఇబ్బందిపడుతున్నారని అంటున్నారు. ఈ క్రమంలో వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు స్వల్ప మోతాదులో వయాగ్రాను కొంతకాలం పాటు వాడాలని సూచిస్తున్నామని, ఇది వారి లైంగిక సామర్థ్యంపై నమ్మకం రావడానికి తోడ్పడుతోందని వివరిస్తున్నారు. ఆ తర్వాత వయాగ్రా అవసరం లేకుండానే శృంగార జీవితాన్ని గడుపుతున్నారని చెబుతున్నారు.

ఆదిలాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో ఓ వైద్యుడి వద్దకు వచ్చారు. ఆయనకు గుండె జబ్బు సమస్య ఉంది. బలహీనంగా ఉన్నారు. లైంగిక సామర్థ్యం సరిగా లేక తాను, తన భార్య అసంతృప్తిగా ఉన్నట్టు వైద్యుడికి చెప్పారు. డాక్టర్ ఆయనకు పరీక్షలు చేయగా.. శరీరంలో హార్మోన్ల స్థాయిలు సరిగా లేవు. దీనితో హార్మోన్లు పెరగడానికి మందులతోపాటు బలం కోసం మల్టీవిటమిన్లు ఇచ్చారు. అవి నెల రోజులు వాడాక.. తక్కువ మోతాదులో రెండు, మూడు నెలల పాటు వయాగ్రా వాడాలని సూచించారు. వైద్యుడి సూచన మేరకు వ్యవహరించిన ఆ వ్యక్తి తన శృంగార జీవితం బాగుందని, తన భార్య గర్భవతి అయిందని వైద్యుడికి చెప్పి సంతోషం వ్యక్తం చేశారు.

... శరీరంలో అంతా సవ్యంగానే ఉన్నా, లేక ఏదో చిన్న సమస్య ఉన్నా.. మానసిక ఒత్తిళ్లు, ఉద్వేగాలతో శృంగార జీవితాన్ని సరిగా గడపలేకపోతున్న పురుషులకు వైద్యులు చేస్తున్న చికిత్స ఇది. ఏదో పోర్న్ వీడియోల్లో చూసినట్టుగా చేయలేకపోతున్నామేనన్న ఆందోళనతో సమస్యను మరింత పెంచుకుంటున్న వారికి వైద్యులు స్వల్ప మోతాదులో 'వయాగ్రా'ను సూచిస్తున్నారు. నిజానికి దీనితో పనిలేకున్నా.. పురుషుల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం పెరిగేందుకు తాత్కాలికంగా వాడాలని చెబుతున్నారు. బంధాలు నిలబడేందుకు కాసింత వయాగ్రా తోడ్పడుతోందని అంటున్నారు.

20శాతానికిపైగా యువతే..

శృంగార సామర్థ్య సమస్యలతో తమ వద్దకు వస్తున్నవారిలో 20 శాతం మందికిపైగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయసువారే ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. 40 నుంచి 60 ఏళ్ల మధ్యవారు 60శాతం.. 60 ఏళ్లు దాటినవారు మిగతా 20 శాతం మంది ఉంటున్నారని వివరిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి రోజూ 20 మందికిపైగా, బంజారాహిల్స్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి నెలకు 90 నుంచి 100 మంది బాధితులు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. శృంగార పటుత్వ సమస్యలతో వస్తున్నవారిలో 80శాతం మంది ఒత్తిడి, మానసిక సమస్యలతో శీఘ్రస్ఖలనం, అంగ స్తంభన ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారని.. వీరిలో చాలా మందిలో కౌన్సెలింగ్, స్వల్ప మోతాదులో వయాగ్రాతో పరిస్థితి చక్కబడుతోందని వివరిస్తున్నారు. మిగతా 20% మందిలో హార్మోన్లలో హెచ్చుతగ్గులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటున్నాయని.. వారికి మందులు, మల్టీ విటమిన్లు, చికిత్సలు అందిస్తున్నామని చెబుతున్నారు.



విచ్చలవిడిగా పెరిగిన వినియోగం

శృంగార పటుత్వ సమస్యలతో బాధపడుతున్నవారు, మరింతగా ఆనందం పొంద వచ్చనే భావనతో ఉండేవారు కొందరు విచ్చలవిడిగా వయాగ్రాను వినియోగిస్తున్నారు. వైద్యులను సంప్రదించకుండానే, తగిన ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల దుకాణాల్లో, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో వయాగ్రా మాత్రలను కొని వినియోగిస్తున్నారు. దీంతో చాలా మంది అవగాహన లేక అధిక మోతాదులో వాడుతున్నారు. మాత్రలు, ఇతర రూపాల్లో వయాగ్రాను తయారు చేస్తున్న కంపెనీలు సోషల్ మీడియాలో విపరీత ధోరణిలో ఇస్తున్న ప్రకటనలు కూడా యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయి. దీనితో ఇటీవల వయాగ్రా వినియోగం బాగా పెరిగిందనే అంచనాలు వెలువడుతున్నాయి. అవసరం లేకున్నా ఇలా వయాగ్రాను వాడటం సమస్యాత్మకంగా పరిణమిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అతిగా వాడితే సమస్యలు తప్పవు!



"వయాగ్రా ఎక్కువ డోసు వేసుకుంటే ఎక్కువ సమయం, ఎక్కువ సార్లు శృంగారం చేయవచ్చనే భావనతో కొందరు ఎక్కువ డోసులో, తరచూ వేసుకుంటారు. వైద్యుల సలహా లేకుండా విపరీతంగా వాడటం ఇబ్బందులకు దారితీస్తుంది. అలాంటి వారిలో శృంగార పటుత్వంపై ప్రభావం పడుతుంది. నిజానికి చాలా మంది పురుషుల్లో మానసిక సమస్యలే శృంగార పటుత్వ సమస్యకు కారణం. మా వద్దకు వచ్చినవారిలో సమస్య ఏమిటో ముందు పరిశీలిస్తాం. మానసిక, పని ఒత్తిడి ఉన్నవారిలో చాలా మందికి కౌన్సెలింగ్‌తో మందుల అవసరం లేకుండానే పరిష్కారం దొరికేలా చేస్తాం. మరికొందరిలో రెండు, మూడు నెలల పాటు స్వల్ప మోతాదు వయాగ్రా సూచిస్తాం. వెన్నెముక సమస్య, నడుము నొప్పి, అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వంటి ఇబ్బందులు ఉన్నవారు కూడా.. సమస్యలు నియంత్రణలోకి వచ్చే వరకు వయాగ్రా వాడితే చాలు. కొందరు ఆరు నెలల నుంచి ఏడాది పాటు వాడాల్సి వస్తుంది."

- డాక్టర్ శ్రీకాంత్ మున్నా, ఆండ్రాలజిస్టు, కిమ్స్ ఆస్పత్రి

తాత్కాలికంగా సూచిస్తున్నాం



"శీఘ్ర స్ఖలనం, అంగ స్తంభన సమస్యలతో నెలకు 80 నుంచి 90 మంది వస్తున్నారు. అందులో 20 మందికిపైగా 25, 30 ఏళ్ల యువకులే ఉంటున్నారు. భార్యను సంతృప్తిపర్చలేకపోతున్నామనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి వారికి పరీక్షలు చేసి, అవసరం మేరకు వయాగ్రా సూచిస్తున్నాం. స్వల్పంగా 2.5 ఎంజీ (మిల్లీగ్రాములు) నుంచి 20ఎంజీ వరకు వాడాలని చెబుతున్నాం. సమస్య తీరు, అవసరం, వయసు, ఆరోగ్య పరిస్థితిని బట్టి మోతాదులో హెచ్చుతగ్గులు ఉంటాయి. తక్కువ మోతాదులో నెలా రెండు నెలలు ఇచ్చి, వారిలో శృంగార సామర్థ్యంపై విశ్వాసం పెరిగేలా చూస్తున్నాం. తర్వాత వయాగ్రా వాడకం నిలిపివేయిస్తున్నాం"

- డాక్టర్ ప్రియాంక్ సలేచా, ఆండ్రాలజిస్టు, అపోలో ఫెర్టిలిటీ ఆస్పత్రి

రాజ్ పాకాల కోసమే సన్‌రైజర్స్‌పై ఒత్తిడి!

ఐపీఎల్ కాంప్లిమెంటరీ టికెట్లలో గోల్‌మాల్

సీఐడీ విచారణలో వెలుగులోకి

హైదరాబాద్, జూలై19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసులో సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలోని హెచ్‌సీఏ కార్యాలయంలో శనివారం కూడా సీఐడీ అధికారులు తనిఖీలు చేశారు. తమ కస్టడీలో ఉన్న హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాసరావు, సీఈవో సునీల్ కాంతేను స్టేడియానికి తీసుకువచ్చారు. అయితే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది అయిన రాజ్ పాకాలకు లబ్ధి చేకూర్చేందుకే జగన్‌మోహన్ బృందం అదనపు టికెట్ల కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీపై ఒత్తిడి తీసుకొచ్చినట్టు సీఐడీ అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. సన్‌రైజర్స్ ప్రతీ ఐపీఎల్ మ్యాచ్‌కు 3,900 టికెట్లను హెచ్‌సీఏకి కాంప్లిమెంటరీగా ఇచ్చేది. ఇందులో 2,400 టికెట్లను జిల్లా క్రికెట్ సంఘాలకు, అపెక్స్ కౌన్సిల్ సభ్యులకు హెచ్‌సీఏ ఇవ్వాలి. మిగిలిన టికెట్లను ఇతర స్టేక్‌హోల్డర్లు, హెచ్‌సీఏతో సంబంధాలు ఉన్నవారికి ఇవ్వవచ్చు. కానీ, జగన్‌మోహన్ బృందం జిల్లా, స్థానిక క్రికెట్ క్లబ్‌లకు ఇవ్వాల్సిన టికెట్లలో సగానికిపైగా నొక్కేసిందని గుర్తించారు. అంతేకాక, అదనంగా మరో 10 శాతం టికెట్లు కావాలని సన్‌రైజర్స్ ఫ్రాంచైజీని బ్లాక్‌మెయిల్ చేయడం వెనుక.. రాజ్‌పాకాలకు లబ్ధి చేకూర్చాలనే లక్ష్యం ఉందనేందుకు ప్రాథమిక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. ఇక, శ్రీనివాసరావు, సునీల్ కాంతే సమక్షంలో హెచ్‌సీఏ అకౌంట్స్ విభాగంలోని పలు రికార్డులను కూడా తనిఖీ చేశారు.

అంబుడ్స్‌మన్‌గా రిటైర్డ్ జస్టిస్ సురేష్ కుమార్

ఉప్పల్, హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హెచ్‌సీఏ 87వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) కొనసాగింపు సమావేశం శనివారం ఐదు నిమిషాల్లోనే గందరగోళంగా ముగిసింది. బోర్డు తాత్కాలిక అధ్యక్షుడు దల్జిత్ సింగ్ అధ్యక్షతన ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఈ సమావేశంలో అంబుడ్స్‌మన్‌గా రిటైర్డ్ జస్టిస్ సురేష్ కుమార్, ఎథిక్స్ ఆఫీసర్‌గా జస్టిస్ కేసీ భానును నియమించారు. వీరి పేర్లను మాజీ క్రికెటర్ శివ్‌లాల్ యాదవ్ ప్రతిపాదించగా, చాముండేశ్వర్‌నాథ్ బలపర్చారు. దీంతో వీరి నియామకాన్ని ప్రకటించిన దల్జిత్ సింగ్ వెంటనే సమావేశాన్ని ముగించారు. అయితే, గత ఏజీఎంలో అంబుడ్స్‌మన్, ఎథిక్స్ ఆఫీసర్ పదవులకు ప్రతిపాదించిన పేర్లు కాకుండా కొత్త వారిని నియమించడాన్ని సీనియర్ క్లబ్ సెక్రటరీ లక్ష్మణ్ రావు తప్పుబట్టారు. ఇక, గత రెండు ఏజీఎంలకు అనుమతించిన 57 క్లబ్‌లను ఈ సమావేశానికి అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ మాజీ క్రికెటర్ అజరుద్దీన్, హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి శేష్‌నారాయణ్ సహా పలువురు సభ్యులు ఏజీఎంకు హాజరు కాలేదు. ఇక, ఏజీఎం జరుగుతుండగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పేరును తెలంగాణ క్రికెట్ సంఘంగా మార్చాలని, జిల్లాల్లోనూ క్రికెట్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని తెలంగాణ క్రికెట్ జేఏసీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో స్టేడియం బయట ధర్నా జరిగింది. పోలీసులు వారిని అరెస్టు చేసి మేడిపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

కేరళలో పాట చిత్రీకరణ



మెగాస్టార్ చిరంజీవి, నయనతార జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ('మెగా157-వర్కింగ్ టైటిల్)' షూటింగ్ కేరళలో శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం కేరళలోని అందమైన లోకేషన్లలో చిరంజీవి, నయనతారపై పెళ్లి నేపథ్యంలో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. 'కొన్ని కీలకమైన ఘట్టాలను కూడా ఈ షెడ్యూల్‌లో షూట్ చేస్తున్నాం, ఈనెల 23 నాటికి ఈ షెడ్యూల్ పూర్తవుతుంద'ని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

గాయపడిన షారుక్.. షూటింగ్‌కు బ్రేక్



సినిమా కోసం చెమటోడ్చే హీరోల్లో షారుక్ ఖాన్ ముందుంటారు. ప్రేక్షకులను అలరించడానికి మూడు దశాబ్దాలుగా ఆయన కృషి చేస్తూనే ఉన్నారు. 60 ఏళ్ల వయసులోనూ తెరపై షారుక్ చేసే సాహసాలు అబ్బురపరుస్తాంటాయి. డూప్ లేకుండా యాక్షన్ సీన్లలో పాల్గొనే షారుక్ తాజాగా 'కింగ్' చిత్రం షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. ముంబైలోని గోల్డెన్ టుబాకో స్టూడియోలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ తీస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. అయితే ఇది తీవ్రమైన గాయం కాదు, కండరానికి సంబంధించింది కనుక చికిత్స అవసరం అని అమెరికాకు ఆయన్ని తీసుకెళ్లారు. నెల రోజుల పాటు షారుక్‌కు విశ్రాంతి అవసరమని వైద్యులు వెల్లడించారు. దీంతో ఆగస్టు నెల వరకూ ఏకధాటిగా జరగాల్సిన 'కింగ్' షూటింగ్‌కు బ్రేక్ ఇచ్చారు. షారుక్ కోలుకుని తిరిగి వచ్చిన తర్వాత సెప్టెంబర్‌లో కానీ అక్టోబర్‌లో కానీ మళ్లీ షూటింగ్‌ను ప్రారంభిస్తామని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఇండియాతో పాటు యూరప్‌లో కూడా 'కింగ్' షూటింగ్ జరపాలని ప్లాన్ చేశారు. షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ప్రధాన పాత్ర పోషిస్తున్న 'కింగ్' చిత్రాన్ని సిద్ధార్థ్ ఆనంద్ రూపొందిస్తున్నారు.



ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే చిత్రం

- నిర్మాత ఏ.ఎం.రత్నం



'మొఘల్ సామ్రాజ్య చక్రవర్తుల కాలంనాటి కథే 'హరిహర వీరమల్లు'. బయట ప్రచారం జరుగుతున్నట్టుగా ఇది నిజ జీవిత కథ కాదు. ఓ కల్పిత పాత్రను తీసుకొని, దాని చుట్టూ కథ అల్లాము. హరిహర అంటే విష్ణువు, శివుడు కలయిక. ఆ రెండు పేర్లు సూచించేలా వీరమల్లు అని పెట్టాము. 'హరిహర వీరమల్లు' ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే గొప్ప చిత్రం అవుతుంది' అని అన్నారు నిర్మాత ఏ.ఎం. రత్నం. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఆయన నిర్మించిన 'హరిహర వీరమల్లు' ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

- నేను 'భారతీయుడు' సహా ఎన్నో భారీ చిత్రాలను నిర్మించాను. అయితే నా సినీ జీవితంలో ఇంత సుదీర్ఘ ప్రయాణం చేసిన సినిమా ఇదే. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. షూటింగ్ పూర్తవడానికి బాగా ఆలస్యమవడంతో సినిమా ఎలా ఉంటుందోననే అనుమానాలు కొందరు వ్యక్తం చేశారు. అయితే ట్రైలర్ విడుదలతో వారి అనుమానాలు పటాపంచలు అయ్యాయి. నేను నిర్మించిన సినిమాల్లో 90 శాతానికి పైగా విజయం సాధించాయి. ఆ అనుభవంతో చెబుతున్నా.. 'హరిహర వీరమల్లు' ఘన విజయం సాధిస్తుంది.
- సినిమాను మొదట రెండు భాగాలు అని అనుకోలేదు. సినిమా వినోదంతో పాటు, సందేశాన్ని అందించాలనేది నా భావన. నేను రూపొందించిన సినిమాలు అలాగే ఉంటాయి. చారిత్రక నేపథ్యమున్న కథ. ఇలాంటి గొప్ప కథలో సందేశం ఉంటే..ఎక్కువ మందికి చేరువవుతుందని భావించాము. అలా చర్చలో కథ విస్తృతి పెరిగింది.
- 'ఖుషి, 'బంగారం' తర్వాత పవన్ కల్యాణ్‌తో చేసిన మూడో చిత్రమిది. పేరుకు మూడు సినిమాలే కానీ.. మా మధ్య 25 ఏళ్ల అనుబంధం ఉంది. పవన్ కల్యాణ్‌ని దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా.. ఓ నటుడిగా కంటే కూడా మంచి ఆశయాలున్న మనిషిగా ఆయనను నేను ఎక్కువగా ఇష్టపడతాను.
- మా అబ్బాయి అని చెప్పడం కాదు గానీ.. జ్యోతికృష్ణ దర్శకత్వ ప్రతిభ చూసి ఆశ్చర్యపోయాను. మేమందరం చూడని ఓ కొత్త కోణంలో ఈ కథని సిద్ధం చేశాడు. మన చరిత్రను ముడిపెడుతూ ఈ తరానికి చేరువయ్యేలా 'ఇండియానా జోన్స్' తరహాలో సినిమాని గొప్పగా మలిచాడు.

ఏపీలో 'హరిహర వీరమల్లు' టికెట్ ధర పెంపు

● 14 రోజులు అడిగిన మేకర్స్.. పది రోజులకే అనుమతి..

'హరిహర వీరమల్లు' టికెట్ ధరలు పెంచుకోవడానికి ఏపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 24న థియేటర్లలో విడుదల కాబోతున్న ఈ సినిమాకు 14 రోజుల పాటు అదనపు రేట్లకు అనుమతించాలని ప్రభుత్వానికి మేకర్స్ విన్నవించారు. పరిశీలించి పది రోజుల పాటు పెంపునకు అనుమతిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 23 రాత్రి 9.30 గంటలకు సెకండ్ షో, 24వేకువ జామున 4గంటలకు బెనిఫిట్ షోలకు అనుమతి పెండింగ్‌లో పెట్టింది. పవన్ కల్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం అయ్యాక విడుదలవుతోన్న మొదటి సినిమా కావడంతో అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. దిగువ తరగతి రూ.100, అప్పర్ క్లాస్ రూ.150, మల్టీప్లెక్స్ రూ.200 అదనంగా పెంచుకోవడానికి అనుమతి లభించడంతో సినిమా టిక్కెట్ల ధరలు సింగిల్ స్క్రీన్‌లో బాల్కనీ రూ.250, మధ్య తరగతి రూ.150-190, మల్టీప్లెక్స్‌లలో రూ.350దాకా ఉండబోతున్నాయి.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

సందేశంతో రాజు గాని సవాల్



లెలిజాల రవీందర్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'రాజు గాని సవాల్'. రితికా చక్రవర్తి కథానాయిక. రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఆగస్టు 8న శ్రీ లక్ష్మీ పిక్చర్స్ ద్వారా విడుదలకు సిద్ధమవుతోంది. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా లెలిజాల రవీందర్ మాట్లాడుతూ 'నా జీవితంలో జరిగిన కొన్ని నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. కల్చరల్ ఈవెంట్స్ నేపథ్యంలో కథ సాగుతుంది. ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం ఇచ్చే చిత్రమిది' అని తెలిపారు. నిర్మాత దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'సినిమా టీజర్ చూశాం చాలా బావుంది. ఇప్పుడు ట్రైలర్ కూడా ఆకట్టుకుంటోంది. రవీందర్ కొత్తతరహా కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించిన తీరు ప్రేక్షకులను అలరిస్తుంది' అని అన్నారు.

సామ్రాజ్య టైటిల్‌తో



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'కింగ్‌డమ్' చిత్రం ఈ నెల 31న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న విషయం తెలిసిందే. శనివారం చిత్ర బృందం హిందీ టైటిల్‌ను ప్రకటించింది. అక్కడ ఈ చిత్రాన్ని 'సామ్రాజ్య' పేరుతో హిందీలో విడుదల చేస్తున్నారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌ను గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సంగీతం: అనిరుధ్



ఎస్. జే సూర్య కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'కిల్లర్'. వీసీ ప్రవీణ్, బైజు గోపాలన్ కలసి నిర్మిస్తున్నారు. ప్రీతి అస్రాని కథానాయిక. ఇటీవలే చిత్రీకరణ మొదలైంది. శనివారం చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. గన్ పట్టుకొని, ప్రీతి అస్రానీని భుజాన ఎత్తుకున్న లుక్ ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

ఫిష్ వెంకట్‌కు ప్రముఖుల నివాళి



నటుడు ఫిష్ వెంకట్ శుక్రవారం రాత్రి మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమ ఓ విలక్షణ నటుడిని కోల్పోయిందని అన్నారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, టి. పద్మారావు గౌడ్, నటి కరాటే కల్యాణి, కమెడియన్ రచ్చ రవి తదితరులు శనివారం ఉదయం అడ్డగుట్టలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

అడ్డగుట్ట (ఆంధ్రజ్యోతి)

వలసదారులకు మద్దతుగా సహాయ కేంద్రం

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వలసదారులు, వారి కుటుంబాల సంక్షేమం, జీవనోపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు మొబైల్ వలస సహాయ కేంద్రాలు దోహదం చేస్తాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ వలస సంస్థ , ఆహార, వ్యవసాయ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో అందుబాటులోకి తెచ్చిన మొబైల్ వలస సహాయ కేంద్రం వాహనాలను మంత్రి తుమ్మల హైదరాబాద్‌లో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. నిజామాబాద్, నారాయణపేట జిల్లాల్లో వలస వెళ్లే గ్రామీణ కుటుంబాలకు.. వలసకు ముందు, వలస సమయంలో, తిరిగి వచ్చిన తర్వాత అవసరమైన సమాచారం, సేవలను ఈ వాహనాలు అందిస్తాయని చెప్పారు. అయితే, ఎంపిక చేసిన ప్రాంతాల్లోని రైతులకు ఈ వాహనాల ద్వారా మట్టి పరీక్షలు, సేంద్రీయ వ్యవసాయం, పశుపోషణపై వర్చువల్ శిక్షణ ఇవ్వాలని సూచించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌దే గెలుపు

» బనకచర్లపై హరీశ్‌వి అబద్ధాలు: మహేశ్ గౌడ్

» కాంగ్రెస్‌లో చేరిన జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌దే గెలుపని, భారీ మెజారిటీ ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బనకచర్ల విషయంలో హరీశ్ రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో బీఆర్ఎస్ నేతలు మురళిగౌడ్, సంజయ్‌గౌడ్‌తోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మహేశ్‌గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక నుంచి ఏ ఎన్నిక వచ్చినా బీఆర్ఎస్ ఉనికే ఉండబోదన్నారు. కేసీఆర్, కేటీఆర్, కవిత అబద్ధాలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. హైదరాబాద్‌ను ప్రపంచపటంలో ఉంచేందుకు సీఎం రేవంత్ కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షల మేరకే పాలన సాగుతోందని.. అందుకే కాంగ్రెస్‌లో చేరికలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా, మహేశ్‌తో ఆదిలాబాద్ జిల్లా నేతలు భేటీ అయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మల్లెపూల నర్సయ్యను నియమించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్.. నీది ఒక బతుకా!

» రావుగారి రాసలీలలు బయటికొస్తే అంతే..: సంపత్

» ఇప్పటికీ రక్తనమూనాలు ఎందుకివ్వలేదు?: బల్మూరి

» అధికారం లేక పశువులా ప్రవర్తిస్తున్నాడు: మైనంపల్లి

హైదరాబాద్/హనుమకొండ సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్‌కు ఏం రోగమొచ్చిందో.. మతి భ్రమించి మాట్లాడుతున్నాడంటూ ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మండిపడ్డారు. 'కేటీఆర్.. నీది ఒక బతుకా? రావు గారి రాసలీలలు చాలా ఉన్నాయి. ఇప్పటివరకు వాటిలో ఒక్క పేజీ మాత్రమే చదివాం. పాగల్, మెంటల్, క్రాక్ కలిపితే కేటీఆర్..' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కల్వకుంట్ల కథా కమామిషు, రావుగారి రాసలీలలు, తారకుడి తోడేళ్లు వంటి పుస్తకాలను చదివితే ఆయన కుటుంబసభ్యులే చీ కొడతారన్నారు. తెలంగాణ రాజకీయాలకు మచ్చ రావొద్దనే సైలెంట్‌గా ఉంటున్నామని చెప్పారు. అమెరికాలో 3 నెలలు ఉండి డ్రగ్స్ డిటాక్స్ చేయించుకొని వచ్చి రక్త నమూనాలు ఇస్తానంటున్న కేటీఆర్.. ఇన్ని రోజులు ఎందుకు మౌనంగా ఉన్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రశ్నించారు. కేదార్‌తో కేటీఆర్‌కు సంబంధాలు లేకపోతే పూర్తి విచారణ చేయాలని సీఎంకు లేఖ రాయాలని డిమాండ్ చేశారు. అధికారం కోల్పోయిన బాధలో కేటీఆర్ పశువులా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మండిపడ్డారు. మతి స్థిమితం లేని కేటీఆర్.. జీవితకాలంలో సీఎం కాలేరని విమర్శించారు. అహంకారపూరితంగా మాట్లాడుతున్న కేటీఆర్.. ఫోన్ ట్యాపింగ్‌తో సినీ, ప్రజా ప్రతినిధుల కుటుంబాల్లో చిచ్చుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోల్పోయినప్పటి నుంచి కేటీఆర్ సైకోలా ప్రవర్తిస్తున్నాడని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ అన్నారు. సీఎంపై రోత వ్యాఖ్యలు మానుకోవాలని.. లేదంటే కాంగ్రెస్ కార్యకర్తలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 'కేటీఆర్.. నువ్వు ఎలాంటోడివో నీ చెల్లి కవితే చెప్పింది. నీది నీచ చరిత్ర. సీఎంపైనే నోరు పారేసుకుంటావా..? మరోసారి నోటికొచ్చినట్లు దూషిస్తే తాట తీస్తాం' అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. హనుమకొండలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికే మచ్చ తెచ్చేలా సీఎంపై కేటీఆర్ వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు.

కమలదళంలో కలకలం

(మొదటిపేజీ తరువాయి)

నాయకత్వంపై ఒత్తిడి తెచ్చే లక్ష్యంతో ఈటల ఎత్తువేశారా? అని చర్చించుకుంటున్నారు. బండి సంజయ్‌కి, ఈటలకు మధ్య విభేదాలు పరాకాష్టకు చేరాయని గత కొద్దిరోజులుగా విస్తృత ప్రచారం జరిగినా, ఎక్కడ కూడా ఇద్దరు నేతలు ఇప్పటివరకు బహిరంగంగా ఆరోపణలు, విమర్శలు చేసుకోలేదు. కానీ, ఈటల ఒక్కసారిగా సంజయ్‌పై విరుచుకుపడ్డ తీరు మాత్రం పార్టీ నేతలను విస్మయానికి గురి చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ స్థానాల్లో పోటీచేసి ఓటమి చవిచూసిన ఈటల.. ఆ తర్వాత మల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా గెలిచారు. అయితే ఆ తరువాత కేంద్ర మంత్రి పదవిని ఆశించి భంగపడ్డారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేసుకున్నా ఫలితం దక్కలేదు. బండి సంజయ్ వల్లే తనకు ఈ పదవి దక్కలేదన్న భావనతో ఈటల ఉండిపోయారని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సంజయ్‌పై పరోక్షంగా తీవ్ర విమర్శలు చేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జాతీయ నాయకత్వం ఆరా..

కేంద్రమంత్రి సంజయ్‌పై ఈటల చేసిన విమర్శలపై బీజేపీ జాతీయ నాయకత్వం ఆరా తీసింది. ఆయన ప్రసంగించిన వీడియో క్లిప్పింగ్‌లను, ఆయన వ్యాఖ్యల అనంతరం స్థానికంగా వ్యక్తమైన స్పందనలతో కూడిన ఒక నివేదికను రాష్ట్రపార్టీ శనివారం జాతీయ నాయకత్వానికి పంపించిందని బీజేపీ వర్గాలు తెలిపాయి. సొంత పార్టీ నేతను అసభ్య పదజాలంతో దూషించడం, మల్కాజ్‌గిరి ఎంపీగా ఉంటూ.. పార్టీని సంప్రదించకుండా 'హుజూరాబాద్ లో పాగా వేస్తా.. మండలాల వారీగా ఆఫీసులు తెరుస్తా. గెలిపించుకుంటా' అనడం ద్వారా పార్టీ లైన్‌ను క్రాస్ చేశారన్న వాదన కూడా పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు కూడా.. పార్టీ కంటే తమకు ఈటలే ముఖ్యమన్న అభిప్రాయాన్ని చెప్పినట్లుగా ఉన్నాయని బీజేపీ వర్గాలు అంటున్నాయి. "అసలు హుజూరాబాద్ లో బీజేపీయే లేదు. 10 ఓట్లు కూడా రావు. కాషాయ జెండాతో మాకు పనిలేదు. ఈటలే మాకు ముఖ్యం. ఆయనే రావాలి" అంటూ ఆయన అనుచరులు చేసిన వ్యాఖ్యలను ఈటల ఖండించకపోవడం విస్మయానికి గురిచేసిందని పార్టీ ముఖ్య నేత ఒకరు అన్నారు. దీనిపై అధినాయకత్వం ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉందన్నారు.

వివాదం ముదిరింది అక్కడే..!

ఈటల, బండి సంజయ్ మధ్య విభేదాలు ఉన్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నా.. సైకిళ్ల పంపిణీ కార్యక్రమంతోనే ఇవి ముదిరాయి. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శ్రీకారం చుట్టారు. అయితే ఆరు నియోజకవర్గాల్లో సజావుగా సాగిన ఈ కార్యక్రమం హుజూరాబాద్‌లో వర్గపోరుకు తెరలేపింది. ఈ సమావేశ స్థలిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎంపీ ఈటల రాజేందర్ ఫొటో కనిపించకపోవడంతో ఆయన వర్గీయులు వాగ్వాదానికి దిగారు. దాంతో ఈటల రాజేందర్ ఫొటోతో కొన్ని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మరోవైపు ఈటల వర్గీయులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి సమాచారం ఇవ్వకపోవడంతో వారు నియోజకవర్గ వ్యాప్తంగా రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారు. సైకిళ్ల పంపిణీ కార్యక్రమం అనంతరం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. ఇక ఆ కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. బీజేపీలో వర్గం అంటూ ఏదీ లేదని, ఉన్నది ఒకటే మోదీ వర్గమని అన్నారు. కష్టపడ్డ వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు కేటాయిస్తామని, వర్గాల పేరు చెబితే టికెట్లు రావని తేల్చిచెప్పారు. దీంతో తమకు స్థానిక సంస్థల ఎన్నికల్లో మొండిచెయ్యి తప్పదని, తమ రాజకీయ భవిష్యత్తుకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భావించిన ఈటల వర్గీయులు శనివారం ఆయన వద్దకు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

రేపు ఢిల్లీకి రామచందర్‌రావు

హైదరాబాద్, జులై 19(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు సోమవారం ఢిల్లీ వెళ్లనున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాని నరేంద్ర మోదీ, హోం శాఖ మంత్రి అమిత్ షాలను మర్యాద పూర్వకంగా కలుసుకుంటారు. తెలంగాణ బీజేపీ సారథ్య బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన తొలిసారిగా ఢిల్లీ వెళుతున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

బీ కేర్‌ఫుల్.. కొడకా!

కేంద్రమంత్రి బండి సంజయ్‌పై పరోక్షంగా ఎంపీ ఈటల సంచలన వ్యాఖ్యలు


శామీర్‌పేటలోని తన నివాసంలో హుజూరాబాద్ బీజేపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

హైదరాబాద్/మేడ్చల్/హుజూరాబాద్, జులై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్.. సాక్షాత్తూ సొంత పార్టీకే చెందిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'బీ కేర్‌ఫుల్.. కొడకా.. బీ కేర్‌ఫుల్' అంటూ హెచ్చరిక జారీ చేశారు. "వాడు సైకోనా.. శాడిస్టా? మనిషా.. పశువా? ఏ పార్టీలో ఉన్నడు? ఎవని అండతో ధైర్యం చేస్తున్నడు? మేం శత్రువుతో కొట్లాడుతం. కానీ, కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకునే సంస్కృతి మా రక్తంలో లేదు. నీ శక్తి ఏంది? యుక్తి ఏంది? నీ చరిత్ర ఏంది? మా చరిత్ర ఏందిరా?" అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియాలో ఏమేం పెడుతున్నారో అన్నీ పైకి పంపిస్తానన్నారు. ఇలాంటి వాటిని అరికట్టకపోతే తనకేమీ నష్టం లేదని వ్యాఖ్యానించారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని హుజూరాబాద్ అసెంబ్లీ సెగ్మెంటుకు సంబంధించి ఈటల రాజేందర్‌కు, బండి సంజయ్‌కి మధ్య అంతర్గతంగా విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో శనివారం పలువురు హుజూరాబాద్ నాయకులు, కార్యకర్తలు శామీర్‌పేటలోని ఈటల నివాసానికి వచ్చారు. ఈటలతోపాటు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన తమకు స్థానికంగా ప్రాధాన్యం ఇవ్వడం లేదని తెలిపారు. జిల్లాలో ఇతర బీజేపీ నాయకులు.. ఈటల వర్గాన్ని పార్టీకి దూరం చేయాలని చూస్తున్నారని మొర పెట్టుకున్నారు. స్థానిక ఎన్నికల్లో తమకు సీట్లు కేటాయించేలా చూడాలని కోరారు. దీంతో ఆగ్రహానికి గురైన ఈటల.. పరోక్షంగా సంజయ్‌పై నిప్పులు చెరిగారు.

మౌనంగా ఉంటే బలహీనుడిగా చూడొద్దు..

"మౌనంగా ఉండేవాణ్ని బలహీనుడిగా చూడవద్దు. పిచ్చి వేషాలు వేస్తే నష్టం ఎవరికో మీకు తెలుస్తుంది. నా జోలికి రావద్దు.. అడ్డు రావద్దు. శామీర్‌పేట బీజేపీ అడ్డా. ఇక్కడ ఎంపీని నేను. ప్రధాని మోదీ మొదట ప్రచారం చేసిన గడ్డ ఇది. గ్రామంలో క్రెడిబులిటీ ఉన్న లీడర్ లేకపోతే పార్టీ బతకదని నమ్మినవాణ్ని. వ్యక్తులు ఎదగకుండా పార్టీలు ఎదగవు. మానవ సంబంధాలు మీకేం తెలుసు? సోషల్ మీడియాను నమ్ముకొని, అబద్ధాల పునాదుల మీద, కుట్రలు కుతంత్రాల మీద కొంత మంది బతుకుతున్నారు. నాది స్ట్రెయిట్ ఫైట్. స్ట్రీట్ ఫైట్ ఉండదు. రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ లాంటి వాళ్లతోనే కొట్లాడాం. ధీరుడు ఎక్కడా భయపడడు. కొంతమంది వెకిలిగాళ్లు ఇంకెక్కడి తెలంగాణ ఉద్యమం అంటున్నారు. కానీ, హుజూరాబాద్‌లో మేము చేసిన ఉద్యమం ఇంకా మా గుండెల్లో ఉంది. చైతన్యం, ముక్కుసూటితనంతో బరిగీసి కొట్లాడిన గడ్డ హుజూరాబాద్ గడ్డ. మేము అక్కడి నుంచి వచ్చిన వాళ్లం" అని ఈటల అన్నారు. ధీరుడితో కొట్లాడుతాం తప్ప కుట్రదారులతో కొట్లాడేవాళ్లం కాదన్నారు. బీఆర్ఎస్ నుంచి తమకు తాముగా బయటకు రాలేదని, అనేక అవమానాలకు గురిచేసి బలవంతంగా బయటకు పంపారని తెలిపారు.. దేశచరిత్రలో ఆరు నెలల పాటు ఎన్నికల ప్రచారం జరిగింది హుజురాబాద్‌లోనే అని, అయినా.. తెలంగాణ ఆత్మగౌరవం గెలిచిందని, ప్రజలు కేసీఆర్ చెంప చెళ్లుమనిపించారని తెలిపారు. తాను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి అంకితభావంతో పనిచేశానని పేర్కొన్నారు.

పదిరోజులకోసారి హుజురాబాద్ వస్తా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తాను అడుగుపెట్టని గ్రామం లేదని ఈటల అన్నారు. "ప్రతీ పదిరోజులకోసారి హుజురాబాద్ వస్తా. మీ గెలుపుకోసం పని చేస్తా. నియోజకవర్గంలోని ప్రతీ మండల కేంద్రంలో ఆఫీసు ఉంటుంది. ప్రతి ఊర్లో మన సర్పంచ్ ఉంటారు. నన్ను నమ్ముకున్న గడ్డ. గుర్తించి టికెట్ ఇస్తే సరే.. లేదంటే వార్డు మెంబర్ నుంచి సర్పంచ్.. ఎంపీటీసీ నుంచి ఎంపీపీ వరకు, జడ్పీటీసీ నుంచి జడ్పీ చైర్మన్ వరకు అన్నీ ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తారనే నమ్మకం ఉంది" అని అన్నారు.

ఈటల వ్యాఖ్యలపై స్పందించవద్దు

» సోషల్ మీడియాలో పోస్టులు పెట్టొద్దు

» అన్నీ అధిష్ఠానం చూసుకుంటుంది

» బీజేపీ నేతలకు బండి సంజయ్ సూచన



కరీంనగర్/హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నుంచి శామీర్‌పేటకు వెళ్లిన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడిన సందర్భంలో ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై ఎవరూ స్పందించవద్దని కేంద్రమంత్రి బండి సంజయ్ కరీంనగర్ జిల్లా బీజేపీ నేతలకు సూచించినట్లు తెలిసింది. ఈటల మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ఈ వ్యవహారాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని ఆయన చెప్పినట్లు సమాచారం. ఈటల వ్యాఖ్యలపై స్పందించేందుకు ఆయన నిరాకరించారు. అయితే ఈటల తీవ్ర పదజాలంతో వ్యాఖ్యలు చేయడంతో రాష్ట్రంలోని పార్టీ నాయకులు, శ్రేణులు ఆగ్రహం, ఆందోళన వ్యక్తం చేస్తూ బండి సంజయ్‌కి పెద్ద ఎత్తున ఫోన్లుచేశారు. దీంతో "దయచేసి ఏ ఒక్కరూ వ్యతిరేకంగా మాట్లాడొద్దు. మీడియా, సోషల్ మీడియాలో వ్యతిరేకంగా పోస్టులు పెట్టొద్దు. పార్టీ పరువును కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. పార్టీ అంతర్గత వ్యవహారాలను జాతీయ నాయకత్వం చూసుకుంటుంది. మీరెవరూ బహిరంగంగా మాట్లాడటానికి వీల్లేదు. స్థానిక ఎన్నికలు రాబోతున్నాయి. కేంద్ర పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లండి. పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయండి" అని సంజయ్ సూచించారు.

వైద్య శాఖలో చిరుద్యోగులకు షాక్

» ఎన్‌హెచ్ఎమ్ సిబ్బంది జీతాల్లో భారీ కోత

» సుమారు 10 వేల మందికి వేతనాలు కట్

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆయన పేరు గౌరీ శంకర్. హైదరాబాద్‌లోని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయంలో 18 ఏళ్లుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారు. కమిషనర్ పేషీలో చిరుద్యోగి. జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్ఎమ్)లో 2007లో చేరారు. మొన్నటిదాకా ఆయనకు నెలకు రూ.22 వేలు జీతం వచ్చింది. ఉన్నట్టుండి ఆయన వేతనంలో రూ.7వేలు కోత పెట్టారు. ఇది ఒక్క గౌరీ శంకర్ సమస్యనే కాదు. రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న మెజారిటీ ఉద్యోగుల ఆవేదన. తెలంగాణలో ఎన్‌హెచ్‌మ్ కింద 23 రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటిలో 51,451 మంది పనిచేస్తున్నారు. ఇందులో 31 వేల మంది ఆశా కార్యకర్తలు. మిగిలిన 20వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే. వీరిలో రూ.10,400 నుంచి మొదలుకొని రూ.లక్ష వరకు వేతనం పొందేవారున్నారు. ఇందులో మెజారిటీ ఉద్యోగుల వేతనాలు రూ.10,400 నుంచి రూ.25 వేలలోపు ఉన్నాయి. ఎన్‌హెచ్ఎమ్‌లో పనిచేసే ఉద్యోగుల సర్వీసును ఏటా పొడిగిస్తూ కొనసాగింపు ఉత్తర్వులను జారీ చేస్తారు. ఇది ఏటా జరిగే తంతే. అయితే ఈ ఏడాది కొనసాగింపు జీవో దాదాపు 3 నెలలు ఆలస్యంగా వచ్చింది. ఏప్రిల్‌లో రావాల్సిన జీవో జూలై 19న విడుదలైంది. ఆ జీవోలో ఆయా ఉద్యోగుల క్యాడర్ కింద ఎంత వేతనం చెల్లిస్తున్నారో కూడా సర్కారు పేర్కొంది. అందులో ఆయా క్యాటగిరీల కింద పని చేసే ఉద్యోగులు తమ వేతనాలు ఎంతున్నాయో చూసుకుని కంగుతిన్నారు. అందులో మెజారిటీ ఉద్యోగుల జీతం సుమారు రూ.7-9 వేల మధ్య తగ్గి ఉంది. ఈ స్థాయిలో కోత పడిన వారి సంఖ్య సుమారు 10 వేలు ఉంటుందని వైద్య శాఖ వర్గాలు పేర్కొన్నాయి. వాస్తవానికి ఏటా తదుపరి కొనసాగింపు జీవో ఆర్థిక శాఖ నుంచి విడుదలవుతుంది. అయితే ఇప్పటి వరకు ఉద్యోగాల సంఖ్యతో పాటు కొనసాగింపునకు సంబంధించిన వివరాలే ఉత్తర్వుల్లో ఉండేవి. తొలిసారిగా ఎన్‌హెచ్ఎమ్ కింద పని చేసే అన్ని క్యాటగిరీలకు సంబంధించిన ఉద్యోగులు, వారి హోదా, ఏ కార్యక్రమం కింద పనిచేస్తున్నారు, వారికి ఎంత వేతనం చెల్లించబోతున్నారన్న వివరాలన్నీ ఆ జీవోలో పేర్కొన్నారు. దాంతో తమ వేతనాల్లో కోత పడిన విషయాన్ని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గుర్తించారు. అలాగే కొన్ని ఉద్యోగాలను తొలగించినట్లు చెబుతున్నారు.ఎన్ని ఉద్యోగాలకు కోత పెట్టారు? ఏ విభాగంలో కట్ చేశారు? అన్నది త్వరలోనే బయటకొస్తుందని అంటున్నారు.

ఎందుకిలా అంటే..?

ఎన్‌హెచ్ఎమ్‌లో పరిధిలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల.. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల మధ్య వ్యత్యాసం ఉంది. ఎన్‌హెచ్ఎమ్ ఉద్యోగులకు ఏటా 5 శాతం పెంపు ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఇస్తే అందుకు తగ్గట్లుగానే రాష్ట్రంలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల్లోనూ పెంపు ఉంటుంది. అయితే రాష్ట్ర ఉద్యోగులతో పోలిస్తే ఎన్‌హెచ్ఎమ్ వారి వేతనాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే ఈసారి ప్రభుత్వ శాఖల్లో పని చేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వర్తించే జీవోనే ఎన్‌హెచ్ఎమ్ ఉద్యోగులకు వర్తింపజేసేలా(ఆన్ పార్ విత్ గవర్నమెంట్ జీవో) తాజా ఉత్తర్వులను విడుదల చేశారు. రాష్ట్ర సర్కారీ ఒప్పంద ఉద్యోగుల మాదిరిగానే వీరు కూడా ఆ జాబితాలో చేరిపోయారు. దాంతో ఒక్కసారిగా వారి వేతనాల్లో కోతపడింది.

వందలోపు ముగ్గురు.. వెయ్యిలోపు 187

» ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌కు ర్యాంకర్లు దూరం

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్‌లో టాపర్లుగా నిలిచిన చాలా మంది రాష్ట్రంలో ప్రవేశాలే తీసుకోలేదు. వారంతా జేఈఈ, ఇతర జాతీయ స్థాయి పోటీ పరీక్షలు రాసి.. కేంద్ర విద్యాసంస్థల్లో చేరడంపైనే దృష్టిపెట్టారు. శుక్రవారం జరిగిన ఎప్‌సెట్ తొలివిడత కౌన్సెలింగ్‌లో 77,561 మందికి సీట్లు కేటాయించగా.. టాప్-50 ర్యాంకర్లు ఒక్కరూ లేరు. టాప్-100లోపు ర్యాంకులు సాధించినవారిలోనూ ముగ్గురు (ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి) మాత్రమే కౌన్సెలింగ్‌లో పాల్గొని ప్రవేశాలు పొందారు. టాప్-200 ర్యాంకర్లలో ఐదుగురు, టాప్-500లో చూస్తే 44 మందే ఉన్నారు. వెయ్యి ర్యాంకులలోపు వారిలో 187 మంది, 5వేల లోపు 2,720 మంది, 10వేల లోపు 6,409 మంది ప్రవేశాలు పొందారు. మొత్తంగా లక్ష లోపు ర్యాంకు సాధించినవారిలో 59,089 మంది.. లక్ష నుంచి 1.50 లక్షల మధ్య ర్యాంకువారు 17,753 మంది సీటు సాధించారు. 1.50 లక్షలకుపైగా ర్యాంకు వచ్చిన వారిలోనూ 739 మంది ప్రవేశాలు పొందారు. మొదటి విడతలో ప్రవేశాలు పొందిన 77,561 మందిలో బీసీలు 53శాతం, ఓసీలు 19.9, ఎస్సీలు 16.9, ఎస్టీలు 10.2 శాతం ఉన్నారు. ఎప్‌సెట్ కన్వీనర్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన శనివారం ఈ వివరాలను విడుదల చేశారు.

బిన్నీకి 70 ఏళ్లు దాటినా..
పదవిలో కొనసాగేనా?

- బీసీసీఐ చీఫ్ మార్పుపై ఉత్కంఠ!
- పార్లమెంట్‌లో చర్చకు రానున్న కొత్త క్రీడాబిల్లు
- బిల్లు ఆమోదం పొందితే మళ్లీ రోజర్‌కు చాన్స్?



న్యూఢిల్లీ: బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీకి శనివారంతో 70 ఏళ్లు నిండాయి. దీంతో బోర్డు రాజ్యాంగం ప్రకారం గరిష్ఠ వయోపరిమితి దాటడంతో బిన్నీ తన పదవికి అనర్హుడవుతాడు. ఈ నేపథ్యంలో.. సెప్టెంబరులో జరిగే వార్షిక సర్వసభ్య సాధారణ సమావేశం (ఏజీఎం) వరకు అతడు కొనసాగుతాడా? లేదా ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించి తప్పుకొంటాడా? అనే విషయమై ఉత్కంఠ కొనసాగుతోంది. అంతేకాకుండా జాతీయ క్రీడా బిల్లు ముసాయిదా రూపంలో మరో ట్విస్ట్ బిన్నీకి అనుకూలంగా మారే అవకాశం కనిపిస్తోంది. సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో నూతన క్రీడా బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ఈ డ్రాఫ్ట్ ప్రకారం పాలకుల వయోపరిమితిని 70 నుంచి 75 ఏళ్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందితే.. జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)లకు అన్నింటికీ ఈ నిబంధన వర్తించనుంది. బీసీసీఐ కూడా ఎన్ఎస్ఎఫ్ కావడంతో.. ఆ చట్టం ప్రకారం నడుచుకోవాల్సిందే. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిబంధనల్లో కూడా ఎక్కడా వయో పరిమితులు విధించలేదు. ఇలా చూస్తే బోర్డు అధ్యక్షుడిగా బిన్నీ మరో ఐదేళ్లు కొనసాగవచ్చు. ఇదే విషయమై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, న్యాయనిపుణులతో బిన్నీ ఈపాటికే చర్చించినట్టు తెలుస్తోంది. మరోవైపు, బోర్డులో చక్రం తిప్పగల పెద్దలు కూడా మరో మూడేళ్లు బిన్నీనే కొనసాగించాలని భావిస్తున్నారట. కొందరు మాత్రం కొత్త బిల్లు వచ్చే వరకు శుక్లాకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలంటున్నారట.

క్వార్టర్స్‌కు యువ భారత్
ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్

సోలో (ఇండోనేసియా): ఆసియా బ్యాడ్మింటన్ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-డిలో భాగంగా శనివారం జరిగిన పోరులో భారత్ 110-83తో యూఏఈ జట్టును ఓడించింది. దీంతో వరుసగా రెండు విజయాలతో భారత్ క్వార్టర్స్ బెర్త్ ఖరారు చేసుకుంది.

అర్జున్ పరాజయం

లాస్ వెగాస్: ఫ్రీ స్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్‌లో సెమీఫైనల్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి కథ ముగిసింది. శనివారం జరిగిన సెమీస్‌లో అర్జున్ 0-2తో అమెరికా గ్రాండ్‌మాస్టర్ లివోన్ అరోనియన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. మరో సెమీస్‌లో హాన్స్ మోకె నీమన్ చేతిలో ఫాబియానో కరువాన ఓడాడు. ఫైనల్లో అరోనియన్‌తో నీమన్ తలపడనున్నాడు. కాగా, 3 నుంచి 8 స్థానాల కోసం జరిగిన పోరులో విన్సెంట్ కీమర్‌పై ప్రజ్ఞానంద 1.5-0.5తో గెలిచాడు.



తొలి గేమ్‌లో హంపి గెలుపు

మహిళల చెస్ వరల్డ్‌కప్ క్వార్టర్స్

బటూమి (జార్జియా): తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల వరల్డ్‌కప్ సెమీఫైనల్‌కు అర పాయింట్ దూరంలో నిలిచింది. శనివారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ తొలి గేమ్‌లో చైనా క్రీడాకారిణి యుక్సిన్ సాంగ్‌పై హంపి విజయం సాధించింది. తెల్లపావులతో ఆడిన హంపి 53 ఎత్తుల్లో ప్రత్యర్థి ఆట కట్టించింది. ఆదివారం జరిగే రెండో గేమ్‌ను డ్రా చేసుకొన్నా చాలు.. హంపికి సెమీస్ బెర్త్ ఖరారవుతుంది. కాగా, భారత్‌కే చెందిన ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్ మధ్య క్వార్టర్స్ మొదటి గేమ్ డ్రాగా ముగిసింది. ఇక, మరో క్వార్టర్స్ తొలి గేమ్‌లో మాజీ వరల్డ్ చాంపియన్ జోంగి టాన్ (చైనా)తో వైశాలి పాయింట్ పంచుకొంది. ఇక, క్వార్టర్స్‌లో హారిక, దివ్య తలపడుతుండడంతో భారత్ తరఫున ఒకరు సెమీస్ చేరడం ఖాయమైంది.

మూడో నెంబర్
మ్యూజికల్ చైర్!





(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఇంగ్లండ్‌తో మూడో టెస్టు ఓటమి నేపథ్యంలో భారత జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో మూడో నెంబర్ స్థానంపై మరోసారి చర్చ మొదలైంది. గతంలో దిగ్గజ ఆటగాడు రాహుల్ ద్రవిడ్, అనంతరం చటేశ్వర్ పుజార నెం.3 స్థానాన్ని సమర్థవంతంగా భర్తీ చేశారు. అయితే పుజార జట్టులో స్థానం కోల్పోవడంతో కొంతకాలంగా కీలకమైన మూడో నెంబర్‌లో పలువురు ఆటగాళ్లను పరీక్షిస్తున్నారు. ఒకవిధంగా ఈ స్థానం 'మ్యూజికల్ చైర్'గా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇంగ్లండ్‌తో ఇప్పటివరకు జరిగిన మూడు టెస్టుల్లో ఇద్దరు బ్యాటర్లను ఆ స్థానంలో పరిశీలించారు. మొదటి టెస్టులో సాయి సుదర్శన్‌ను బరిలో దింపారు. తన అరంగేట్ర టెస్టు (లీడ్స్) అయిన ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో సుదర్శన్ డకౌట్ కాగా, అతను రెండో ఇన్నింగ్స్‌లో (30 పరుగులు)నూ ఆకట్టుకోలేకపోయాడు. భారత జట్టు ఘన విజయం సాధించిన బర్మింగ్‌హామ్ రెండో టెస్టులో సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్‌ను మూడో నెంబర్‌లో పంపారు. 31, 26 స్కోర్లతో నాయర్ తన పునరాగమనానికి న్యాయం చేయలేకపోయాడు. ఇక ప్రతిష్ఠాత్మక లార్డ్స్ టెస్టులోనూ నాయర్ (40, 14) విఫలమయ్యాడు. దాంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-2తో వెనుకంజలో ఉన్న భారత్..రేస్‌లో నిలవాలంటే ఈనెల 23 నుంచి జరిగే నాలుగో టెస్టులో గెలిచి తీరాల్సిందే. ఈక్రమంలో మూడో నెంబర్ బ్యాటర్ భారీగా పరుగులు చేయాల్సిన అవసరం ఏర్పడింది. వాస్తవంగా..కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ స్థానంలో ఆడాలని భావించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో రోహిత్ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు జరగడంతో కేఎల్ రాహుల్ మూడో నెంబర్‌లో దిగాడు. ప్రస్తుతం నాలుగో స్థానంలో ఆడాలని గిల్ నిర్ణయించుకోవడంతో..మూడో నెంబర్ బ్యాటర్‌కోసం సెలెక్టర్లు మరోసారి వెతుకులాట ప్రారంభించాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీమిండియాకు సుదీర్ఘ కాలం పాటు ఈ స్థానంలో ప్రాతినిధ్యం వహించాల్సిన ఆటగాడిని కనుగొనడం ఆషామాషీ కాదు. గతంలో మూడో నెంబర్‌లో ఆడిన బ్యాటర్లు నాటి కెప్టెన్లకు ఎంతో ఊరట నిచ్చారు. సచిన్‌కు ద్రవిడ్, కోహ్లీకి పుజార అండగా నిలిచారు. ఇప్పుడు గిల్‌కు కూడా అలాంటి భరోసా ఇవ్వాల్సిన బ్యాటర్ అవసరం. ఈ క్రమంలో సుదర్శన్, నాయర్‌లను పరీక్షించారు. వారు రాణించకపోవడంతో ఇంగ్లండ్‌తో మిగిలిన టెస్టులకు ఇప్పుడు మళ్లీ వెతుకులాట మొదలైంది. మూడో నెంబర్ బ్యాటర్ 30, 40 రన్స్ చేయడం కాదని, శతకాలు సాధించాల్సిందేనని అలనాటి ఆటగాడు ఫరూక్ ఇంజనీర్ అంటారు. ఈ స్థానంలో ఆడిన దిలీప్ వెంగ్‌సర్కార్ లార్డ్స్‌లో ఏకంగా 3 సెంచరీలు కొట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మరి కీలకమైన నాలుగో టెస్టులో మూడో నెంబర్ బ్యాటర్ విషయంలో జట్టు యాజమాన్యం తీసుకొనే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ ఏర్పడింది.

ఇంగ్లండ్ నిలిచింది
రెండో వన్డేలో భారత్ ఓటమి

లండన్: భారత మహిళలతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో ఇంగ్లండ్ జట్టు తమ ఆశలను సజీవంగా నిలుపుకొంది. కచ్చితంగా గెలిచి తీరాల్సిన రెండో వన్డేలో నాట్ సివర్ సేన ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చింది. ఫలితంగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 8 వికెట్ల తేడాతో గెలిచింది. ప్రస్తుతం సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో నిలవగా.. ఆఖరి మ్యాచ్ మంగళవారం జరుగుతుంది. వర్షం కారణంగా నాలుగు గంటలు ఆలస్యంగా ఆరంభమైన ఈ మ్యాచ్‌ను 29 ఓవర్లకు కుదించగా.. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 8 వికెట్లకు 143 పరుగులు చేసింది. మంధాన (42), దీప్తి శర్మ (30 నాటౌట్) మాత్రమే రాణించారు. ఎకెల్‌స్టోన్‌కు 3.. ఎర్లాట్, లిన్సే స్మిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో మరోసారి వర్షం ఆటంకం కలిగించింది. దీంతో లక్ష్యాన్ని 24 ఓవర్లలో 115 రన్స్‌గా నిర్ణయించారు. ఓపెనర్లు అమీ జోన్స్ (46 నాటౌట్), బ్యూమంట్ (34)ల ధాటికి ఇంగ్లండ్ 21 ఓవర్లలో 116/2 స్కోరుతో మ్యాచ్‌ను ముగించింది.



ప్రియకు రజతం
బుడాపెస్ట్ రెజ్లింగ్‌లో మనీషాకు కాంస్యం

న్యూఢిల్లీ: భారత మహిళా రెజ్లర్లు ప్రియ, మనీషా.. హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో జరుగుతున్న ర్యాంకింగ్ సిరీస్‌లో పతకాలు కొల్లగొట్టారు. శనివారం జరిగిన 76 కిలోల విభాగంలో ప్రియ రజతం సాధించగా.. 62 కిలోల కేటగిరిలో మనీషా కాంస్య పతకం దక్కించుకొంది. ఫైనల్లో ప్రియ 3-4తో బ్రెజిల్ రెజ్లర్ తమిరెస్ మార్టిన్స్ చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. ఇక, కాంస్యం పోరులో క్రిస్టీనాను మనీషా చిత్తుచేసి పతకం అందుకుంది.

ఆసియా వాలీబాల్‌లో కుర్రాళ్ల కంచుమోత

న్యూఢిల్లీ: ఆసియా పురుషుల అండర్-16 వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో భారత కుర్రాళ్లు కంచు మోత మోగించారు. టోర్నీలో తలపడ్డ తొలిసారే కాంస్య పతకంతో సత్తాచాటారు. థాయ్‌లాండ్‌లో శనివారం జరిగిన కాంస్య పతక పోరులో భారత్ 3-2తో జపాన్ జట్టును ఓడించి మూడోస్థానంతో పోడియం ఫినిష్ చేసింది. అంతకుముందు భారత్ సెమీఫైనల్లో పాకిస్థాన్ చేతిలో ఓటమి పాలైంది. ఇక, ఈ టోర్నీలో సెమీస్ చేరిన భారత్, పాకిస్థాన్, జపాన్, ఇరాన్ జట్లు వచ్చే ఏడాది కతార్‌లో జరిగే అండర్-17 ప్రపంచ వాలీబాల్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాయి.





'స్విస్' ఆట కట్టు స్పెయిన్ సెమీస్‌కు
మహిళల యూరో కప్

గోల్ కొట్టిన ఆనందంలో బొన్మాటి

బెర్న్ (స్విట్జర్లాండ్): మహిళల ఫుట్‌బాల్ యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో స్విట్జర్లాండ్ జోరుకు బ్రేక్ పడింది. క్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ చాంపియన్ స్పెయిన్ 2-0తో ఆతిథ్య స్విట్జర్లాండ్‌ను చిత్తుచేసి సెమీఫైనల్లో ప్రవేశించింది. తొలి అర్ధభాగం ఇరుజట్లూ హోరాహోరీగా పోరాడడంతో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. ఇక, ద్వితీయార్ధంలో ప్రత్యర్థిపై పట్టు సాధించిన స్పెయిన్.. ఆట ఆఖర్లో ఐదు నిమిషాల వ్యవధిలోనే రెండు గోల్స్ కొట్టి మ్యాచ్‌ను పూర్తిగా తనవైపు తిప్పుకొంది. 66వ నిమిషంలో అయిటానా బొన్మాటి, 71వ నిమిషంలో క్లాడియా పినా గోల్స్ చేసి స్పెయిన్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఫ్రాన్స్, జర్మనీ జట్ల మధ్య విజేతతో స్పెయిన్ సెమీస్ ఆడనుంది.

భేటీ వేదిక మార్చకుంటే బాయ్‌కాట్!
ఆసియాకప్‌పై బీసీసీఐ ఆలోచన

న్యూఢిల్లీ: భారత ఉపఖండంలో ప్రతిష్ఠాత్మక టోర్నీగా పిలుచుకునే ఆసియాకప్ నిర్వహణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఈనెల 24న ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సమావేశం ఢాకాలో జరగాల్సి ఉంది. అయితే ప్రస్తుతం బంగ్లాదేశ్‌తో భారత్‌కు సత్సంబంధాలు లేని కారణంగా ఆ సమావేశం కోసం అక్కడికి వెళ్లేందుకు బీసీసీఐ ఇష్టపడడం లేదు. అందుకే ఏసీసీ అధ్యక్షుడు మొహిసిన్ నక్వీ ఆధ్వర్యంలో జరిగే ఆ సమావేశం వేదికను బంగ్లా నుంచి వేరే చోటుకు మార్చాలని బీసీసీఐ పట్టుబడుతోంది. ఒకవేళ భేటీ వేదికను మార్చపోతే ఈ ఏడాది సెప్టెంబరులో జరగాల్సిన ఆసియాకప్‌ను బాయ్‌కాట్ చేస్తామని బీసీసీఐ హెచ్చరిస్తోంది. ఇప్పటికే లిఖిత పూర్వకంగా ఈ విషయాన్ని ఏసీసీకి కూడా తెలిపింది. కానీ అక్కడి నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. 'ఢాకా నుంచి సమావేశం వేదికను మార్చితేనే ఆసియాకప్ జరుగుతుంది. నక్వీ భారత్‌పై అనవసర ఒత్తిడి తేవాలనుకుంటున్నాడు. వేదికను మార్చమని చెప్పినా ఇంతవరకు స్పందించలేదు. అయితే ఢాకాలోనే భేటీ జరిగితే అందులో తీసుకునే ఎలాంటి నిర్ణయాలనైనా మేం పట్టించుకోం' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

బిజినెస్ ప్లస్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్
బోనస్ బొనాంజా

- ఒక్కో షేరుకు ఉచితంగా ఒక షేరు జారీ
- బ్యాంక్ చరిత్రలో తొలి బోనస్ షేర్ల ఇష్యూ

దేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. అంటే, బ్యాంక్ వాటాదారులు కలిగి ఉన్న ప్రతి ఒక్క షేరుకు గాను ఒక షేరు బోనస్‌గా లభించనుంది. ఇందుకు అర్హులైన షేర్‌హోల్డర్ల వివరాలను ఆగస్టు 27న రికార్డు చేయనున్నట్లు బ్యాంక్ వెల్లడించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చరిత్రలో ఇదే తొలి బోనస్ షేర్ల జారీ. దీంతో బ్యాంక్‌లో రూ.2 లక్షల లోపు ఈక్విటీ వాటా కలిగిన 36 లక్షలకు పైగా చిన్న మదుపరులకు లబ్ధి చేకూరనుంది. వీరు బ్యాంక్‌లో మొత్తం 10.32 శాతం వాటా కలిగి ఉన్నారు. కాగా, బ్యాంక్ 2011లో రూ.10 ముఖ విలువ కలిగిన షేరును రూ.2 ముఖ విలువతో కూడిన 5 షేర్లుగా విభజించింది. ఆ తర్వాత 2019లో రూ.2 ముఖ విలువ కలిగిన షేరును రూ.1 ముఖ విలువతో కూడిన 2 షేర్లుగా విభజించింది.

ఒక్కో షేరుకు రూ.5 మధ్యంతర డివిడెండ్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.5 ప్రత్యేక మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు బ్యాంక్ ప్రకటించింది. ఇందుకు అర్హులైన వాటాదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 25ను రికార్డు తేదీగా నిర్ణయించింది. వచ్చే నెల 11న డివిడెండ్ చెల్లింపులు చేపట్టనున్నట్లు బ్యాంక్ తెలిపింది.

క్యూ1లో రూ.16,258 కోట్ల లాభం: జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 1.31 శాతం తగ్గి రూ.16,258 కోట్లకు పరిమితమైంది. స్టాండ్‌ఎలోన్ లాభం మాత్రం రూ.18,155 కోట్లుగా నమోదైంది. క్యూ1లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.99,200 కోట్లకు ఎగబాకగా.. మొత్తం వ్యయాలూ రూ.63,467 కోట్లకు పెరిగాయి. గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 5.4 శాతం వృద్ధితో రూ.31,440 కోట్లకు పెరిగినప్పటికీ, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 3.35 శాతానికి తగ్గింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	విజయవాడ	107
వరంగల్	104	గుంటూరు	112
కరీంనగర్	104	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	106
కర్నూలు	104	నెల్లూరు	111
విశాఖపట్నం	92	అనంతపురం	111
గోదావరి	107		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,040 ▲	91,700 ▲	1,26,000 ▲
విజయవాడ	1,01,350 ▲	97,200 ▲	1,11,600 ▼
విశాఖపట్నం	1,00,040 ▼	91,700 ▲	1,26,000 ▲
రాజమండ్రి	1,00,040 ▲	91,700 ▲	1,15,000 ▲
ప్రొద్దుటూరు	98,250 ▲	90,390 ▲	1,14,500 ▼
ముంబై	98,243 ▲	89,991 ▲	1,12,700 ▲

ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్ సమయం దగ్గర పడుతోంది. అందరికీ ఒకే రిటర్న్ ఫారం వర్తించదు. ఆయా వ్యక్తుల ఆదాయాల్ని బట్టి ఇది మారుతుంది. దీనికి సంబంధించి ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. అయినా చాలా మందికి ఇప్పటికీ తమ ఆదాయానికి తగ్గట్టు తమ రిటర్న్‌ను ఏ ఫారమ్‌లో దాఖలు చేయాలనే దానిపై స్పష్టత లేదు.



ఐటీ రిటర్న్‌లు.. ఎవరికి ఏ ఫారం?

ఆదాయాన్ని బట్టి వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు ఫైల్ చేయాల్సిన ఐటీ రిటర్న్ ఫారాలు మారిపోతుంటాయి. గత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి సంబంధించి (2025-26 అసెస్‌మెంట్ ఇయర్) ఎవరు ఏ ఐటీఆర్ దాఖలు చేయాలనే దానిపై ఐటీ శాఖ ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. ఇందుకోసం వ్యక్తిగత పన్ను చెల్లింపుదారుల కోసం ఐటీఆర్-1, ఐటీఆర్-2, ఐటీఆర్-3, ఐటీఆర్-4 పేరుతో నాలుగు ఫారాలు విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించిన మార్పులకు అనుగుణంగా ఈ ఐటీఆర్ ఫారాల్లో అనేక మార్పులూ చోటు చేసుకున్నాయి. ఇప్పుడు ఎవరు ఏ ఐటీఆర్ ఫారం ఫైల్ చేయాలో తెలుసుకుందాం.

ఐటీఆర్-1

గతంలో మూలధన లాభాలు ఉన్న వ్యక్తులు ఐటీఆర్-1లో తమ రిటర్న్‌లు దాఖలు చేసేందుకు అవకాశం ఉండేది కాదు. 2025-26 అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై) నుంచి వీరు కూడా ఐటీఆర్-1 ద్వారా తమ రిటర్న్ ఫైల్ చేయవచ్చు. కాకపోతే ఇందుకు కొన్ని షరతులు వర్తిస్తాయి. అవేంటంటే...

- మూలధన లాభాలు దీర్ఘకాలిక లాభాలై ఉండాలి
- ఆ లాభాలు లిస్టెడ్ కంపెనీలు షేర్లు లేదా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల యూనిట్ల అమ్మకాలపై వచ్చినవై ఉండాలి
- ఇలా వచ్చిన దీర్ఘకాలిక మూలధన లాభాలు ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షలకు మించకూడదు
- దేశంలోనే నివసిస్తున్న సాధారణ పౌరుడై ఉండాలి
- పన్ను పరిధిలోకి వచ్చే వార్షిక ఆదాయం రూ.50 లక్షలు మించకూడదు
- వడ్డీ, డివిడెండ్లు, పెన్షన్ వంటి ఆదాయాలతో పాటు జీతం, ఒక ఇంటిపై వచ్చే ఆదాయాలై ఉండాలి
- రూ.5,000 మించని వార్షిక వ్యవసాయ ఆదాయం

ఐటీఆర్-2

పన్నుల పరిధిలోకి వచ్చే వార్షిక ఆదాయం రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉన్న వ్యక్తులు ఈ ఫారం ద్వారా తమ ఐటీఆర్ రిటర్న్ ఫైల్ చేయాలి. ఈ ఫారంలో వారు తమ ఆస్తులు, అప్పులు వెల్లడించడం ద్వారా పన్ను ప్రయోజనాలు కూడా పొందవచ్చు. గత ఏడాది జూలై 23కు ముందు లేదా ఆ తర్వాత దీర్ఘకాలిక మూలధన లాభాలు ఆర్జించిన వ్యక్తులు, గత ఏడాది అక్టోబరు తర్వాత షేర్ల బైబ్యాక్‌పై నష్టపోయిన వ్యక్తులు కూడా ఐటీఆర్-2ను ఎంచుకోవచ్చు. ఈ కింది అంశాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ అంశాలు పూర్తి చేసిన వ్యక్తులందరూ ఐటీఆర్-2 పరిధిలోకి వస్తారు. అవేమిటంటే?

- అవిభాజ్య హిందూ కుటుంబాలు (హెచ్‌యూఎఫ్)
- వార్షిక మూలధన లాభాలు రూ.1.25 లక్షలకు మించిన వ్యక్తులు
- ఏదైనా కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్న వ్యక్తులు
- స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కాని కంపెనీలలో షేర్లు ఉన్న వ్యక్తులు
- విదేశీ ఆదాయం ఉన్న వ్యక్తులు
- క్రిప్టో కరెన్సీలు, ఇతర డిజిటల్ ఆస్తుల అమ్మకం, బదిలీల ద్వారా వచ్చిన ఆదాయం ఉన్న వ్యక్తులు

ఐటీఆర్-3

వ్యాపార, వృత్తిపరమైన ఆదాయాలు ఉన్న వ్యక్తులు ఐటీఆర్-3 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి. ఈ సంవత్సరం క్రూయిజ్ నౌకల ద్వారా ఆదాయం వచ్చే వారిని కూడా ఈ ఐటీఆర్ పరిధిలో చేర్చారు. ఇందుకోసం ఐటీ చట్టంలో ప్రత్యేకంగా సెక్షన్ 44బీబీసీని ప్రత్యేకంగా చేర్చారు. ఈ కింది వ్యక్తులు ఐటీఆర్-3 ద్వారా తమ రిటర్న్ ఫైల్ చేయాల్సి ఉంటుంది.

- వ్యాపార, వృత్తిపరమైన ఆదాయం ఉన్న వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు
- భాగస్వామ్య సంస్థలు
- ఎఫ్ అండ్ ఓ లేదా ఇంట్రాడే ట్రేడింగ్‌లో లాభనష్టాలు నమోదు చేసిన వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు

ఐటీఆర్-4

ప్రిజెంప్టివ్ ట్యాక్స్ స్కీమ్ కోసం ఐటీ చట్టంలోని సెక్షన్ 44ఏడీ, సెక్షన్ 44ఏడీఏలను ఎంచుకున్న వ్యాపార, వృత్తి నిపుణులు ఐటీఆర్-4 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయవచ్చు

- సెక్షన్ 44ఏడీ, 44 ఏడీఏ లేదా 44 ఏఈ కింద రూ.50 లక్షల లోపు ఆదాయం ఉన్న వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, ఎల్ఎల్‌పీలు కాని సంస్థలు
- ఈక్విటీ షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల అమ్మకంపై రూ.1.25 లక్షల వరకు మూలధన లాభాలు ఉన్న వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు
- వృత్తి నిపుణులకు వచ్చే ఆదాయంలో 95 శాతానికిపైగా గుర్తింపు పొందిన బ్యాంకింగ్ చానల్స్ ద్వారా వస్తే వార్షిక ఆదాయం రూ.75 లక్షల వరకు ఉన్నా ఐటీఆర్-4 ద్వారా రిటర్న్ ఫైల్ చేయవచ్చు
- డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ఇతర వృత్తి నిపుణులు సెక్షన్ 44ఏడీఏ పరిధిలోకి వస్తారు
- సెక్షన్ 44ఏడీ కింద ప్రిజెంప్టివ్ ట్యాక్స్ స్కీమ్‌ను ఎంచుకుని రూ.2 కోట్ల వరకు ఆదాయం ఉన్న వ్యాపారులు
- ఈ వ్యాపార ఆదాయంలో 95 శాతం లేదా అంతకు మించి బ్యాంకింగ్ చానల్స్ ద్వారా వస్తే, వార్షిక ఆదాయం రూ.3 కోట్ల వరకు ఉన్నా ఐటీఆర్-4 ఫైల్ చేయవచ్చు.

ఐటీఆర్-5

వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, హెచ్‌యూఎఫ్‌లకు ఈ రిటర్న్ ఫారం వర్తించదు. సంస్థలు, ఎల్ఎల్‌పీలు, అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్, బిజినెస్ ట్రస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ ఐటీఆర్-5 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి.

ఐటీఆర్-6

ప్రత్యేక కంపెనీల నిర్వచనం పరిధిలోకి రాని కంపెనీలు మాత్రమే ఈ ఫారం ద్వారా తమ ఐటీ రిటర్న్‌లు దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఐటీఆర్-7

ఛారిటబుల్, మతపరమైన ట్రస్టులు, రాజకీయ పార్టీలు, పరిశోధనా సంస్థలు, వార్తా సంస్థలు లేదా ఐటీ చట్టంలో పేర్కొన్న ప్రత్యేక సంస్థలు ఐటీఆర్-7 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి.

వీరికి తప్పనిసరి

ఆదాయం ఆదాయ పన్ను పరిమితి కంటే తక్కువగా ఉన్నా ఈ కింది వ్యక్తులు తప్పనిసరిగా రిటర్న్‌లు దాఖలు చేయాలి.

- విదేశీ పర్యటనల్లో ఖర్చులు రూ.2 లక్షలకు మించి ఖర్చు చేసే వ్యక్తులు
- వార్షిక కరెంటు బిల్లు రూ.లక్ష మించిన వ్యక్తులు
- కరెంట్ ఖాతాలో రూ.కోటికి మించి డిపాజిట్ ఉన్న వ్యక్తులు
- విదేశాల్లో ఆస్తులు ఉన్న వ్యక్తులు
- తన పేరు మీద విదేశీ బ్యాంకు ఖాతాలు ఉన్న వ్యక్తులు లేదా లేదా ఎవరి విదేశీ బ్యాంకు ఖాతాకైనా లబ్ధిదారుగా ఉన్న వ్యక్తులు
- సెక్షన్ 54, 54బీ, 54ఈసీ, 54ఎఫ్ కింద మూలధన లాభాలకు పన్ను మినహాయింపులు కోరే వ్యక్తులు
- ఆదాయ పన్ను మినహాయింపు కోరే వ్యక్తులు
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో టీడీఎస్/టీసీఎస్‌ల మొత్తం రూ.25,000 మించిన వ్యక్తులు. సీనియర్ సిటిజన్లయితే రూ.50,000 వరకు

ఎవరు ఎప్పటిలోగా దాఖలు చేయాలంటే..

జీతం మాత్రమే ఆదాయంగా ఉన్న వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, ఆడిట్ చేయాల్సిన అవసరం లేని ఆదాయం ఉన్న వ్యక్తులు ఈ ఏడాది సెప్టెంబరు 15లోగా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి. ఆడిటింగ్ పరిధిలోకి వచ్చే ఆదాయం ఉన్న వ్యక్తులు అక్టోబరు నెలాఖరులోగా ఫైల్ చేయాలి. అంతర్జాతీయ వ్యాపార లావాదేవీలు కూడా ఉన్న వ్యక్తులు, సంస్థలైతే నవంబరు నెలాఖరులోగా ఐటీ రిటర్న్‌లు సమర్పించాల్సి ఉంటుంది.

అలియాంజ్‌తో జియో ఫైనాన్స్ జట్టు
రీఇన్సూరెన్స్ కోసం జేవీ ఏర్పాటు

జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జెఎఫ్ఎస్ఎల్).. జర్మనీకి చెందిన గ్లోబల్ ఇన్సూరెన్స్ దిగ్గజం అలియాంజ్ గ్రూప్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా అలియాంజ్ గ్రూప్ అనుబంధ సంస్థ యూరప్ బీవీతో కలిసి దేశంలో రీఇన్సూరెన్స్ సేవలందించేందుకు జియో ఫైనాన్షియల్ జాయింట్ వెంచర్ (జేవీ) ఏర్పాటు చేయనుంది. చెరి సగం భాగస్వామ్యంలో రీఇన్సూరెన్స్ సంస్థను ఏర్పాటు చేసేందుకు ఇరు సంస్థలు ఒప్పందంపై సంతకాలు చేశాయి. కాగా దేశంలో జనరల్, లైఫ్ ఇన్సూరెన్స్ విభాగాల్లో కూడా సేవలందించేందుకు మరో రెండు జాయింట్ వెంచర్ల ఏర్పాటుకు నాన్-బైండింగ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభంలో 16% వృద్ధి

జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 15.9 శాతం వృద్ధితో రూ.13,558 కోట్లకు చేరుకోగా.. స్టాండ్‌ఎలోన్ లాభం 15.5 శాతం పెరిగి రూ.12,768 కోట్లుగా నమోదైంది. క్యూ1లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 10.6 శాతం పెరిగి రూ.21,635 కోట్లకు ఎగబాకగా.. ఇతర ఆదాయం 13.7 శాతం వృద్ధితో రూ.7,264 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 4.34 శాతానికి తగ్గింది.

యూబీఐ లాభం రూ.4,116 కోట్లు

జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ప్రభుత్వ రంగానికి చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) రూ.4,116 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఏడాదిలో ఇదే కాలానికి నమోదైన రూ.3,679 కోట్ల లాభంతో పోలిస్తే 12 శాతం వృద్ధి కనబరిచింది. యూబీఐ మొత్తం ఆదాయం రూ.30,874 కోట్ల నుంచి రూ.31,791 కోట్లకు పెరిగింది. గడిచిన మూడు నెలల్లో బ్యాంక్ మొత్తం వడ్డీ ఆదాయం రూ.27,296 కోట్లకు పెరిగినప్పటికీ, నికర వడ్డీ రాబడి (ఎన్ఐఐ) మాత్రం రూ.9,113 కోట్లకు తగ్గింది. జూన్ చివరి నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం 5 శాతం పెరిగి రూ.22,14,422 కోట్లకు చేరుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	520
వరంగల్	512	గోదావరి	503
చిత్తూరు	563	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ప్రతి ప్రభుత్వ వైద్యుడికి మీరే ఆదర్శం

- ఉస్మానియా వైద్యులకు సీఎం అభినందనలు
- ఓ బాలికకు కాలేయ మార్పిడి చేసిన వైద్యులు
- 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ట్యాగ్ చేస్తూ సీఎం ట్వీట్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాలేయం పూర్తిగా చెడిపోవడంతో కోమాలోకి వెళ్లి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న పదిహేడేళ్ల బాలిక బ్లెస్సీ గౌడ్‌కు ఉస్మానియా ఆసుపత్రిలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేసి పునర్జన్మ ప్రసాదించిన వైద్యులను సీఎం రేవంత్ అభినందించారు. ఈ సందర్భంగా "నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అన్న దురభిప్రాయాన్ని చెరిపివేసి బ్లెస్సీకి 24 గంటల్లోపే విజయవంతంగా కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేసి పునర్జన్మ ప్రసాదించిన ఉస్మానియా వైద్య బృందానికి అభినందనలు. ప్రతి ప్రభుత్వ వైద్యుడికి వారు ఆదర్శం కావాలి. బీటెక్ విద్యార్థిని బ్లెస్సీ గౌడ్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని మనసారా కోరుకుంటున్నాను" అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. దీనికి 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని ట్యాగ్ చేశారు. కాలేయం పూర్తిగా చెడిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న బ్లెస్సీ గౌడ్‌కు 'జీవన్‌దాన్ సూపర్ అర్జంట్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఎక్స్‌పర్ట్ టీమ్' నుంచి ప్రత్యేక అనుమతితో ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు కాలేయ మార్పిడి చేసిన సంగతి తెలిసిందే.

హైకోర్టు జడ్జి సీవీ భాస్కర్‌రెడ్డికి సీఎం పరామర్శ

జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హైకోర్టు న్యాయమూర్తి సీవీ భాస్కర్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. శనివారం ఆసుపత్రికి వెళ్లి న్యాయమూర్తిని కలిసి, మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి భాస్కర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

గద్దెలు మార్చకుండానే ఆధునికీకరణ:సీతక్క

హైదరాబాద్, ములుగు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల గద్దెల మార్పు లేకుండానే ఆలయ పరిసరాల ఆధునికీకరణ పనులు చేపడతామని మంత్రి సీతక్క తెలిపారు. పూజారుల కోరిక మేరకు ఆలయ ప్రాంగణంలో ఆధునీకరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, జాతరకు వచ్చే భక్తుల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఆధునికతతో పాటు ఆదివాసి సంప్రదాయాలను గౌరవించేలా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. అన్ని మార్గాల్లో ఆదివాసీ పోరాట యోధుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తామన్నారు.

ఎన్‌హెచ్‌ఎంలో 51,451 మంది సర్వీసు వచ్చే మార్చి వరకు పొడిగింపు

రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)కింద వివిధ పథకాల్లో పని చేస్తున్న 51,451 మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును వచ్చే ఏడాది మార్చి 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఇందుకు సంబంధించి శనివారం వేర్వేరు జీవోలను జారీ చేసింది. వాస్తవానికి ఈ జీవో ఈ ఏడాది ఏప్రిల్‌లోనే రావాల్సివుంది. అయితే మూడు నెలలు ఆలస్యం కావడంతో వీరందరికీ ఏప్రిల్, మే, జూన్ వేతనాలు ఆగిపోయాయి.

సొంత భూమిని ప్రభుత్వానికిచ్చిన కోదండరెడ్డి

యాచారం, జూలై 19(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యాచారంలో తన కున్న 2 వేల గజాల పట్టా భూమిని రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ప్రభుత్వానికి అప్పగించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు శనివారం అందించారు. ఈ భూమిలో ఓ భవనం కూడా ఉందని, ప్రభుత్వం వినియోగించుకోవచ్చని మంత్రికి తెలిపారు. దాని విలువ మార్కెట్ రేట్ ప్రకారం రూ.4 కోట్లు ఉంటుందని చెప్పారు.


మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తన భూమి పత్రాలు అందిస్తున్న కోదండరెడ్డి

10,954 జీపీవో పోస్టుల మంజూరు

తెలంగాణ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు 10,954 గ్రామ పాలనాధికారుల (జీపీవో) పోస్టులను మంజూరు చేసింది. ఈ పోస్టులు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు సమానమైనవి. తెలంగాణ మినిస్టీరియల్ సర్వీస్ నిబంధనలలో చేసిన సవరణలకు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) ఆమోదం తెలిపింది. జీపీవో, జూనియర్ అసిస్టెంట్ క్యాడర్లలో ఖాళీలను 60% ప్రత్యక్ష నియామకం ద్వారా, 40 శాతం అంతర్గత పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు.

'కోర్' సీట్లు భర్తీ.. సీఎస్‌ఈలో సుస్తీ!

- ఎలక్ట్రానిక్స్, సివిల్, కెమికల్ ఇంజనీరింగ్‌లో దాదాపు భర్తీ
- సీఎస్‌ఈ ఐటీలో 80 శాతం.. ఏఐలో సగం సీట్లు ఖాళీ
- ముగిసిన ఈసెట్ తుది విడత కౌన్సెలింగ్

ప్రస్తుతం సాగుతున్న ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీఎస్‌ఈలో దాదాపు 98శాతం సీట్లు భర్తీకాగా.. ఈసెట్ కౌన్సెలింగ్‌లో మాత్రం పూర్తిగా భిన్నమైన పరిస్థితి నెలకొంది. పాలిటెక్నిక్, డిప్లొమా పూర్తి చేసుకున్నవారు నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు ఉద్దేశించిన ఈసెట్ చివరి విడత కౌన్సెలింగ్ శనివారం ముగిసింది. ఎప్‌సెట్‌కు భిన్నంగా సీఎస్‌ఈలో సగం సీట్లు కూడా భర్తీ కాలేదు. సీఎస్‌ఈలో ఏఐ కోర్సుకు ప్రస్తుతం ఎప్‌సెట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల్లో భారీ డిమాండ్ ఉండగా.. ఈసెట్ ద్వితీయ సంవత్సరం ప్రవేశాల్లో సీట్ల భర్తీ 20శాతం కూడా లేదు. సీఎస్ఈ ఏఐ-ఎంఎల్‌లో మొత్తం 1,937 సీట్లుండగా 1,346 సీట్లు భర్తీ కాగా 591 సీట్లు మిగిలిపోయాయి. ఇందులో 69.49శాతమే భర్తీ అయ్యాయి. అలాగే సీఎస్ఈలో మొత్తం 4,050 సీట్లలో 3,175 (78.40%) భర్తీకాగా 875 మిగిలిపోయాయి. సీఎస్ఈ డేటాసైన్స్ 1,174 సీట్లకు కేవలం 774 (65.93%) భర్తీ కాగా 400 భర్తీకి నోచుకోలేదు. సీఎస్ఈ ఏఐలో 26 సీట్లు ఉండగా.. 13 భర్తీ కాగా 13 మిగిలిపోయాయి. సీఎస్ఈ ఐటీలో మొత్తం 41 సీట్లలో 8మాత్రమే భర్తీకాగా 33 మిగిలిపోయాయి. అంటే ఎప్‌సెట్‌లో ఐటీ బ్రాంచ్‌లోని మొత్తం సీట్లలో 97.20 శాతం భర్తీకాగా.. ఈసెట్‌కు వచ్చే సరికి భర్తీ అయిన సీట్లు కేవలం 19.51 శాతం మాత్రమే. ఈ లెక్కన దాదాపు 81శాతం సీట్లు భర్తీ కాలేదు. సీఎస్ఈ, ఐటీలో రాష్ట్రవ్యాప్తంగా 168 కాలేజీల్లో మొత్తం 8,552 సీట్లుండగా.. 6,205 (72.56%) సీట్లు భర్తీకాగా 2,347 మిగిలిపోయాయి. సీఎస్ఈ, కోర్ కోర్సులు అన్ని కలిపి మొత్తం ఇంజనీరింగ్‌లో 12,618 సీట్లు ఉండగా.. 10,129 (80.27%) సీట్లు భర్తీకాగా, 2,489 సీట్లు మిగిలిపోయాయి. కోర్ ఇంజనీరింగ్ కోర్సుల సీట్లు దాదాపు వందశాతం భర్తీ అయ్యాయి. ఎలక్ట్రానిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 877 సీట్లుండగా అన్నీ భర్తీ అయ్యాయి. సివిల్ ఇంజనీరింగ్‌లో 574 సీట్లలో 563 (98.08%), ఈసీఈలో 1,712 సీట్లలో 1,674 (97.78%), మైనింగ్ ఇంజనీరింగ్‌లో 88 సీట్లలో 87 (98.86%), మెకానికల్ ఇంజనీరింగ్‌లో 639 సీట్లలో 576 (90.14%) భర్తీ అయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి కోర్ ఇంజనీరింగ్ కోర్సుల్లో భారీ వృద్ధి నమోదైందని ఈసెట్ కౌన్సెలింగ్ అధికారులు పేర్కొన్నారు. మరోవైపు ఈసెట్ బి-ఫార్మసీలోనూ రికార్డు స్థాయిలో సీట్లు మిగిలిపోయాయి. మొత్తం 1,287 సీట్లు ఉండగా 57 (4.43%) సీట్లు మాత్రమే భర్తీ అయి 1230 సీట్లు మిగిలిపోయాయి.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఏకే సింగ్

(మొదటిపేజీ తరువాయి)

పని చేసి, బదిలీ మీద తెలంగాణకు వచ్చారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆయన తెలంగాణ హైకోర్టుకు ఏడో ప్రధాన న్యాయమూర్తి. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ సుజోయ్ పాల్ ఇటీవల బదిలీల్లో కలకత్తా హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందిన జస్టిస్ ఏకే సింగ్ 1965లో జన్మించారు. ఆయన దశాబ్దం పాటు 1990 నుంచి 2000 వరకు ఉత్తరప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. తర్వాత 2001 నుంచి జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తూ 2012లో జార్ఖండ్ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022 నుంచి 2023 వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. పదోన్నతిపై త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2023 ఏప్రిల్ 17న వచ్చారు.

ఓఆర్‌ఆర్ వెలుపలకు కాలుష్య కారక పరిశ్రమలు

హౌసింగ్ బోర్డు ఇళ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండాలి: భట్టి

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్) లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలన్నింటినీ ఓఆర్ఆర్ వెలుపలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం శనివారం సచివాలయంలో జరిగింది. కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పరిశ్రమల తరలింపునకు సంబంధించి విధివిధానాలు, తరలింపు క్యాలండర్‌ను రూపొందించాలని సూచించారు. తరలింపు ప్రక్రియకు తుది గడువును ఖరారు చేయాలని సబ్ కమిటీ సభ్యులు అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలోని రాజీవ్ స్వగృహ ఇళ్లు, హౌసింగ్ బోర్డు ఆధీనంలోని ఖాళీ స్థలాల విక్రయాలను మంత్రులు సమీక్షించారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో కొనసాగే బహిరంగ వేలం ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని అధికారులకు మంత్రులు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే.. దేశ దిశను మార్చనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కుల గణనపై ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ కుల గణనపై స్వతంత్ర నిపుణుల కమిటీ చేసిన అధ్యయనం చరిత్రాత్మకమైనదని పేర్కొన్నారు.

రూ. 500 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో డాజన్ విస్తరణపై సీఎం హర్షం

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పెట్టుబడులు, యువతకు ఉద్యోగావకాశాలను కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. యూకేకు చెందిన గ్లోబల్ స్పోర్ట్స్ స్ట్రీమింగ్ దిగ్గజం డాజన్ (DAZN) హైదరాబాద్‌లో తన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణను చేపట్టి.. రూ.500 కోట్ల పెట్టుబడిని ప్రకటించడం పట్ల సీఎం హర్షం వ్యక్తం చేశారు. ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు, ఐటీ రంగ అభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. డాజన్ వంటి అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌ను తమ కార్యకలాపాలకు ఎంచుకోవడం, తెలంగాణలో ఉన్న నైపుణ్యం కలిగిన మానవ వనరులు, స్థిరమైన విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలకు నిదర్శనం" అని పేర్కొన్నారు. డాజన్ తన ఆపరేషన్ సెంటర్ ద్వారా వచ్చే మూడేళ్లలో రూ.500 కోట్ల భారీ పెట్టుబడితో విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. ఈ విస్తరణ ద్వారా 2026 చివరి నాటికి 3,000 మంది ఉద్యోగులను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సంస్థ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో "తెలంగాణ రైజింగ్, హైదరాబాద్‌పై డాజన్ ఉంచిన నమ్మకానికి మా ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. హైదరాబాద్‌ను ఒక బలమైన ఐటీ, పరిశ్రమల హబ్‌గా మార్చడానికి మంత్రి శ్రీధర్ బాబు చేస్తున్న నిరంతర కృషి అభినందనీయం" అని సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కులగణన డేటాతో సంక్షేమం

(మొదటిపేజీ తరువాయి)

శనివారం 300 పేజీల నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శనరెడ్డి, సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో భేటీ అయ్యారు. తెలంగాణ కులగణన సర్వే చరిత్రాత్మకమని, ఇది దేశానికి మార్గదర్శి అవుతుందని కమిటీ కమిటీ అభిప్రాయపడింది. సర్వే శాస్త్రీయంగా, విశ్వసనీయంగా ఉందని పేర్కొంది. తమ అధ్యయన నివేదికలోని అంశాలను కమిటీ సీఎంకు వివరించింది. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఆయా వర్గాల ప్రాతినిధ్యాలు ఏ విధంగా ఉన్నాయన్న అంశంపై ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. కమిటీ నివేదికను ఈ నెల 25 లేదా 26 తేదీల్లో జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించిన తర్వాత ప్రజల కోసం విడుదల చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో కులగణన నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఏడాది వ్యవధిలో కార్యక్రమాన్ని పూర్తి చేసింది. వివరాలను అసెంబ్లీలో ఆమోదించిన తరువాత అందులోని గణాంకాల అధ్యయనం కోసం మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అధ్వర్యంలో 11 మంది సభ్యులతో స్వతంత్ర్య నిపుణుల కమిటీని వేసింది. పలు దఫాలుగా సమావేశమైన కమిటీ సమాచార సేకరణ పద్ధతి సరిగానే ఉందని అభిప్రాయపడింది. ఈ గణాంకాలు ప్రభుత్వ విధానాల రూపకల్పనకు, ఇప్పుడు అమల్లో ఉన్న విధానాలను మెరుగు పరుచుకొనేందుకు, బలహీన వర్గాల వర్గాల అభ్యున్నతికి మరింత మెరుగైన చర్యలు తీసుకొనేందుకు ఉపయోగించుకో వచ్చని సూచించింది. వెనుకబాటుతనంలో కులాలకు ర్యాంకింగ్ ఇచ్చినట్లు జూలై 2 నాటి సమావేశంలో కమిటీ తెలిపింది. మొత్తం 242 కులాల వెనుకబాటుతనానికి సంబంధించి సమగ్ర వెనుకబాటుతనం సూచికను రూపొందించామని చెప్పింది. శనివారం కమిటీ నివేదికను అందజేసిన సమయంలో సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ, ఎస్టీ శాఖల ముఖ్య కార్యదర్శులు శ్రీధర్, ఎ.శరత్ ఉన్నారు. నిపుణుల కమిటీలో కంచె ఐలయ్య, శాంతా సినా?, హిమాన్షు, సుఖ్‌దేవ్ థొరాట్, నిఖిల్ డే, భాంగ్య భూక్య, పురుషోత్తంరెడ్డి, జీన్ డ్రెజ్, థామస్ పికెట్టి, ప్రవీణ్ చక్రవర్తి, ఐఏయస్ అనుదీప్ దురిశెట్టి ఉన్నారు.



నిపుణుల కమిటీ ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను వీక్షిస్తున్న రేవంత్, భట్టి, ఉత్తమ్

కులగణన ఎలా జరిగిందంటే...

సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వేను నిర్వహించింది. 2024 నవంబరు 6 నుంచి డిసెంబరు 25 వరకు మొత్తం 50 రోజుల పాటు సర్వే సాగింది. మొదటి దశలో హౌస్ లిస్టింగ్ చేసిన కుటుంబాలు కొన్ని వేర్వేరు కారణాలతో సర్వేలో తమ వివరాలు నమోదు చేయకపోవటంతో ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు రెండో విడతలో వివరాల నమోదుకు అవకాశం కల్పించారు. మీసేవా కేంద్రాలు, జీహెచ్‌ఎంసీ, ఎంపీడీవో ఆఫీసులు, వెబ్సైట్ ద్వారా కూడా వివరాల నమోదుకు అవకాశం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 1,03,889 మంది ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లతో శాస్త్రీయంగా సర్వే చేయించారు. 150 కుటుంబాలను ఒక బ్లాక్‌గా ఎంచుకుని, ఒక్కో బ్లాక్‌కు ఒక ఎన్యూమరేటర్‌ను, ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించి, ప్రక్రియను పూర్తి చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో 1,15,71,457 గృహాలు ఉన్నాయి. 1,12,36,849 (97.10%) కుటుంబాల నుంచి 3,55,50,759 మంది సర్వేలో తమ వివరాలు నమోదు చేసుకున్నారు. రాష్ట్రంలో ఎస్సీలు 61,91,294 (17.42%) మంది, ఎస్టీలు 37,08,408 (10.43%) మంది, బీసీలు 2,00,37,668 (56.36%) మంది, ఇతర కులాల వారు 56,13,389 (15.89%) మంది ఉన్నారని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

కొత్త టెక్నాలజీతో ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనుల పునరుద్ధరణ

- ఏడాది వ్యవధిలో 4.8 కిలోమీటర్లు తవ్వాలి
- జలాశయాల నుంచి ఆయకట్టుకు నీళ్లివ్వాలి
- రెండు నెలల్లోపు పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలి: ఉత్తమ్

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక పరిజ్ఞానంతో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. జాతీయ భౌగోళిక పరిశోధన సంస్థ (ఎన్జీఆర్ఐ), జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)ల సహకారంతో 10 కిలోమీటర్ల సొరంగ మార్గం పనులను సత్వరంగా పూర్తి చేస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా నియమించుకున్న ఆర్మీ మాజీ అధికారులు జనరల్ హర్పాల్‌సింగ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రాల సేవలను వినియోగించుకుంటామని చెప్పారు. శనివారం సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ పనులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఏడాది వ్యవధిలో 4.8 కిలోమీటర్ల మేర తవ్వం పనులు పూర్తి చేయాలన్నారు. పనుల్లో అవాంతరాలు ఎదురుకాకుండా ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్తల సహకారంతో ఏరియల్ లైడార్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జలాశయాల్లో నీటి నిల్వల ఆధారంగా ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు సాగు నీరందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న డీఈల నుంచి ఈఎన్సీల వరకు పదోన్నతులు కల్పించే ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. నిర్దిష్ట వ్యవధిలోగా పదోన్నతుల ప్రక్రియ పూర్తికావాలని ఆయన అన్నారు.

రేవంత్ నాటుకోడి.. కేటీఆర్ బాయిలర్ కోడి

రేవంత్‌ను నువ్వు మొగోడివా అనేంత సీన్ కేటీఆర్‌కు లేదు.. సెక్యూరిటీ వదిలేసి రారా సాలే అని వస్తే తట్టుకోగలవా కేటీఆర్

- రేవంత్ సడన్‌గా వస్తే నీకు గుండెపోటు వస్తుందేమో..
- వాళ్లను తలకాయ వరకు భూమిలో పాతి తలకాయల పైన పాములను వదలాలి
- పదేళ్లు వాళ్లు నీచంగా పాలించారు
- కాంగ్రెస్ సంక్షేమ పథకాలపై సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లలో చర్చకు సిద్ధమా..?
- కేసీఆర్ కుటుంబాన్ని ఎంత తిట్టినా తప్పులేదు: జగ్గారెడ్డి

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): "రేవంత్ నాటు కోడి.. కేటీఆర్ బాయిలర్ కోడి.. రేవంత్‌ను నువ్వు మొగోడివా అనేంత సీన్ నీకు లేదు కేటీఆర్.. అనవసరంగా రేవంత్‌ను రెచ్చగొట్టకు.. సెక్యూరిటీ వదిలేసి.. రారా సాలె అని వస్తే తట్టుకోగలుగుతావా?.. తట్టుకునే గట్స్ నీకు లేవు.. రేవంత్ సడెన్‌గా వస్తే .. నీకు గుండెపోటు వస్తుందేమో చూసుకో మల్లా.." అంటూ పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు టి. జగ్గారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గాంధీభవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ ఇంటికి పోలీసులను పంపించింది కేటీఆర్ అని, కానీ ఇప్పుడు రేవంత్ కేటీఆర్ ఇంటికి పోలీసులను పంపడం లేదని.. అదే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌ఎకు ఉన్న తేడా అని చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బ్రహ్మాండంగా పాలన సాగిస్తున్నారన్నారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం నీచమైన పాలన చేసినందునే వారిని తిట్టాల్సి వస్తోందన్నారు. నాడు మల్లన్న సాగర్ రైతులను హింసించారని, కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులను తిట్టడం కాదు.. వాళ్లను తలకాయ వరకు భూమిలో పాతి.. ఆ తలకాయల పైకి పాములు వదిలి.. నరకం చూపించాలని వ్యాఖ్యానించారు. "సీఎం నాయకత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మంత్రి పొన్నం ప్రభాకర్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, వడ్లకు బోనస్ పథకాలపై మంత్రి ఉత్తమ్, ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లలో చర్చకు సిద్ధం.. మీరు సిద్ధమా" అని జగ్గారెడ్డి సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి సీఎం అయి 18 నెలలు అయిందని, పదేళ్ల పాలనలో కేసీఆర్ ఇచ్చిన హామీలను పూర్తి చేయలేదు కాబట్టే తిట్టామన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌లకు ఎమ్మెల్యే సభ్యత్వం లేకుండా చేశారని, అలాంటి వాళ్లను ఎన్ని తిట్లు తిట్టినా తప్పులేదన్నారు.



రైతులను గజగజ వణికించిన పాలన మీది..

బీఆర్ఎస్ పాలనలో మల్లన్న సాగర్ రైతులను కొట్టిన దెబ్బలు మామూలువి కావని జగ్గారెడ్డి అన్నారు. ఒక్కో రైతు మీద ముప్పై లాఠీలతో కొడితే వీపులు పగిలాయని చెప్పారు. రైతులను గజగజా వణికించిన నీచమైన పాలన కేసీఆర్‌దని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రజాపాలన చూసి కేటీఆర్‌కు కడుపు మంటగా ఉందన్నారు. పదేళ్ల పాలనలో మహిళా సంఘాలు ఏమయ్యాయని నిలదీశారు. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపడుతున్నామని, ఇలాంటి పథకం పెట్టాలనే ఆలోచన కేసీఆర్‌కు వచ్చిందా.. ఇంత మంచి పథకాలు అమలు చేస్తున్నందుకు సీఎం రేవంత్‌ను, మంత్రులను తిడుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్‌కు స్క్రిప్ట్ ఇస్తున్న వారు సరిగా ఇవ్వడం లేదన్నారు. ఆయన విదేశాల్లో చదువుకుని వచ్చి.. ఇలాంటి మాటలు మాట్లాడుతుంటే జాలి పడుతున్నామన్నారు. కేటీఆర్‌కు చీమూ, నెత్తురు లేకుండా పద్ధతిలేని మనిషిలా మారాడని విమర్శించారు. రేవంత్‌ను అన్న మాటలు వింటే నెత్తురు మరుగుతోందని ఆయన అన్నారు.

కాజీపేటలో మెట్రో బోగీలు

(మొదటిపేజీ తరువాయి)

తయారు చేయనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఇంజన్లు, వ్యాగన్లు కూడా తయారు చేస్తారన్నారు. వాటికి సంబంధించిన డిజైన్ల రూపకల్పన కూడా ఇక్కడే జరుగుతుందని వెల్లడించారు. వందే భారత్ రైళ్లను కూడా ఇక్కడే తయారు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని ప్రకటించారు.


కోచ్‌ఫ్యాక్టరీ నమూనాను పరిశీలిస్తున్న కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్‌రెడ్డి

3 వేల మందికి ఉద్యోగాలు: కిషన్‌రెడ్డి

పీవీ నర్సింహారావు హయాం నుంచి వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ కోసం ప్రయత్నాలు జరిగాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు డిమాండ్ ఉందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రధాని నరేంద్ర మోదీ కాజీపేటలో బహుళ రైలు ఉత్పత్తి కేంద్రానికి భూమి పూజ చేశారని చెప్పారు. ఈ ఫ్యాక్టరీతో ప్రత్యక్షంగా మూడు వేల మందికి, పరోక్షంగా మరిన్ని వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. వరంగల్ విమానాశ్రయానికి భూమి కేటాయించమని రాష్ట్రంలోని గత ప్రభుత్వానికి అనేకసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం భూసేకరణ జరిపి తమ చేతిలో పెడితే విమానాశ్రయం నిర్మాణం మొదలు పెడతామని ప్రకటించారు. మోదీ తెలంగాణకు ఏం ఇచ్చారని ప్రశ్నిస్తున్న వారంతా కళ్లు తెరచి కాజీపేట ఫ్యాక్టరీని చూడాలని సూచించారు. రైల్వే సంబంధ అభివృద్ధి కార్యక్రమాలతో మంత్రి అశ్విని వైష్ణవ్ తెలంగాణ ముఖచిత్రాన్ని మారుస్తున్నారని కిషన్‌రెడ్డి కొనియాడారు.

రైజింగ్ స్టార్ ఐఐటీ హైదరాబాద్

కాజీపేట సందర్శనకు ముందు మంత్రి అశ్విని వైష్ణవ్ హైదరాబాద్ ఐఐటీ స్నాతకోత్సవానికి హాజరయ్యారు. వివిధ విభాగాల్లో చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను, బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ ప్రసంగిస్తూ, ఐఐటీ హైదరాబాద్ 2008లో ప్రారంభించినా, అతి తక్కువ కాలంలో దేశ సాంకేతిక విద్యలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పిందని కొనియాడారు. అందుకే, ఈ సంస్థ దేశంలోని విద్యా సంస్థల్లోనే రైజింగ్ స్టార్ అన్నారు. జపాన్ సహకారంతో ఐఐటీహెచ్ ఎన్నో అద్భుతమైన ప్రాజెక్టును చేపట్టిందని చెప్పారు. 5జీ, 6జీ టెక్నాలజీతో పాటు పలు రంగాల పరిశోధనల్లో ఐఐటీ-హెచ్ కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. అనంతరం మంత్రి సమీపంలోని శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ నుంచి రైల్లో కాజీపేటకు ప్రయాణం అయ్యారు.

జోధ్‌పూర్ రైలు ప్రారంభం

జోధ్‌పూర్, కాచిగూడ స్టేషన్, సికింద్రాబాద్ స్టేషన్ల విస్తరణ, మూడో లైన్ ఏర్పాటుతో కాచిగూడా-భగత్‌కీ కోఠీ స్టేషన్‌ల మధ్య నేరుగా ప్రతీ రోజూ నడిచే రైలు వేసేందుకు వీలు కలిగిందని అశ్వనీ వైష్ణవ్ అన్నారు. శనివారం సాయంత్రం ఆయన కిషన్‌రెడ్డితో కలిసి జోధ్‌పూర్‌కు కొత్త రైలును జెండా ఊపి ప్రారంభించారు. ప్రవాసీ రాజస్థాన్ వాసుల కోరిక అయిన ఈ రైలు కోసం మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, కిషన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. కిషన్‌రెడ్డికి అందించే ప్రతీ విజ్ఞప్తి తనకు చేరుతుందని, తనకు ప్రత్యేకంగా విజ్ఞప్తులు పెట్టనక్కరలేదని వ్యాఖ్యానించారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పూర్తవుతోందని, వచ్చే ఏడాది ప్రారంభిస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్ స్టేషన్‌ను 350 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.

'పదేళ్లు నేనే సీఎంను' అనడం కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకం

- నిఖార్సయిన కాంగ్రెస్ కార్యకర్తలు సహించరు
- 'ఎక్స్'లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్య



నల్లగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాబోయే పదేళ్లు తెలంగాణకు తానే ముఖ్యమంత్రినంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించుకోవడాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తప్పుబట్టారు. రేవంత ప్రకటన కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. "జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో అధిష్ఠానం ఆదేశాల మేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుంది. తెలంగాణ కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరు" అని 'ఎక్స్'లో రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. దీంతో పాటు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పదేళ్లు నేనే!' అనే క్లిప్పింగ్‌ను పోస్ట్ చేశారు. రాజగోపాల్‌రెడ్డి చేసిన ఈ వ్యాఖ్య రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద

- 1.56 లక్షల క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో
- 565అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా నదికి వరద కొనసాగుతోంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టుకు 1.53 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో 67,617 క్యూసెక్కులను వినియోగిస్తుండగా, పోతిరెడ్డిపాడుకు 20వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 215.18 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 199.73 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టి ప్రాజెక్టుకు 1.15 లక్షల క్యూసెక్కుల వరద వస్తోండగా.. అంతే మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 1.14 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 23 గేట్లు ఎత్తి 89,378 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 28,505 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. మరోవైపు.. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి 67,800 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, శనివారం సాయంత్రానికి 565 అడుగులకు (244.1480 టీఎంసీలు) చేరింది. సాగర్ నుంచి ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద 90,340 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. బ్యారేజీ వద్ద గోదావరి రెండు మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. ములుగు జిల్లాలోని దేవాదుల ఎత్తిపోతల పథకంలో శనివారం ఉదయం మరో మోటారును ఆన్ చేశారు. మొత్తం ఐదు మోటార్లతో 1,370 క్యూసెక్కుల నీటిని భీంఘనపూర్ రిజర్వాయర్‌కు ఎత్తి పోస్తున్నారు.



మెట్రో రెండో దశ సాధన కోసం ఎంపీలతో సమావేశమైన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మెట్రో రెండో దశ కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచండి

- ఎంపీలను కోరిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటి రెడ్డి

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రెండో దశ సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పార్లమెంటు సభ్యులను తెలంగాణ ప్రభుత్వం కోరింది. శనివారం హైదరాబాద్‌లో ఎంపీలతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, బలరాం నాయక్, అనిల్‌కుమార్ యాదవ్, బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావుతోపాటు మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి హాజరయ్యారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ నినాదంతో ముందుకు సాగుతున్న కేంద్ర ప్రభుత్వానికి హైదరాబాద్ వంటి మహా నగరాలు ఎంతో కీలకమని మల్లు భట్టి విక్రమార్క, కోమటి రెడ్డి చెప్పారు. పెట్టుబడులకు, పరిశ్రమలకు, ఉపాధికి స్వర్గధామం వంటి హైదరాబాద్‌కు మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టును మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు.

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సిట్ రెండో నోటీసు

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు శనివారం రెండో నోటీసు జారీ చేశారు. వారం రోజుల్లో ఆయనకు అనుకూలమైన సమయంలో సిట్ విచారణకు హాజరుకావాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. విచారణకు వచ్చే తేదీ, సమయాన్ని దర్యాప్తు అధికారికి ముందు తెలియజేయాలని నోటీసులో సూచించారు. ఈ నెల 14న జారీ చేసిన నోటీసులో రెండు రోజుల్లో విచారణకు రావాలని సిట్ అధికారులు ప్రవీణ్ కుమార్‌ను కోరారు. అయితే సిట్ నోటీసు విషయాన్ని ఆయన తన 'ఎక్స్' ఖాతా ద్వారా అందరికి తెలిపినప్పటికీ విచారణకు మాత్రం హాజరుకాలేదు. ఈ క్రమంలో ఆయనకు రెండో నోటీసు జారీ అయింది.

ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం

- టేకాఫ్ అయిన కాసేపటికే ల్యాండింగ్

శంషాబాద్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయం నుంచి థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌కు వెళ్తున్న విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే తిరిగి శంషాబాద్‌లోనే ల్యాండ్ అయింది. శనివారం ఉదయం 6:49 గంటలకు 98 మంది ప్రయాణికులతో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఐఎక్స్ 110 విమానం ఫుకెట్‌కు బయలుదేరింది. అయితే, గాల్లోకి ఎగిరిన 8 నిమిషాల్లోనే సాంకేతిక లోపం తలెత్తింది. గమనించిన పైలెట్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం ఏటీసీ అధికారుల అనుమతి కోరారు. వెంటనే స్పందించిన అధికారులు ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు అనుమతిచ్చారు. ఉదయం 6:57 గంటలకు పైలట్ విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. మరమ్మతుల అనంతరం మధ్యాహ్నం 1:26 గంటలకు విమానం తిరిగి ఫుకెట్‌కు బయలుదేరింది.

సాంకేతిక సమస్యతో ఎయిరిండియా విమానం రద్దు

రేణిగుంట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్యతో ఎయిరిండియా విమానం రద్దయింది. శనివారం ఉదయం 7.15 గంటలకు హైదరాబాదు నుంచి తిరుపతికి రావాల్సిన ఈ విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రద్దు చేశారు. దీంతో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు డబ్బు తిరిగి ఇస్తామని, లేదా రేపు ఉదయం విమానానికి పంపుతామని, అత్యవసరమైతే మధ్యాహ్నం విమానం పంపుతామని ఎయిర్ ఇండియా యాజమాన్యం తెలిపింది.

పలు జిల్లాల్లో మోస్తరు వర్షం

- హైదరాబాద్‌లో జలమయమైన రోడ్లు
- పాలమూరు, కొత్తగూడెం జిల్లాల్లో పిడుగుపాటుకు గురై ఇద్దరి దుర్మరణం
- నేడు, రేపు భారీ వర్షాలు: వాతావరణ శాఖ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం మోస్తరు వర్షం పడింది. వాతావరణ శాఖ లెక్కల ప్రకారం సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో అత్యధికంగా 11 సెం.మీ రంగారెడ్డి జిల్లా చేవేళ్లలో 11 సెం.మీ, యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలో 10 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఇక, రాజధాని హైదరాబాద్‌లో కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. అత్యధికంగా కాప్రాలో 7.7 సెం.మీ ఉప్పల్‌లో 6.8 సెంటీమీటర్ల చొప్పున వర్షం నమోదైంది. సాయంత్రం ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు వర్షంతో ఇబ్బందులు పడ్డారు. ఉప్పల్, మల్కాజిగిరి, మారేడ్‌పల్లి, సికింద్రాబాద్, సరూర్‌నగర్, హయత్‌నగర్, కాప్రా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. మన్సురాబాద్ ప్రధాన రహదారిపై భారీగా వరద చేరడంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా, మహబూబ్‌నగర్‌లోని న్యూమోతీనగర్‌కు చెందిన సమ్మయ్య(16), కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం వెంకట తండాలో యువ రైతు బాణోత్ రవి(33) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. కాగా, నైరుతి రుతుపవనాల ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మరో ఐదురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. ఆది, సోమవారాల్లో భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు పడనున్నాయని, ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు పేర్కొన్నారు.



హైదరాబాద్‌లోని మన్సూరాబాద్ ప్రధాన రహదారిపై భారీగా ప్రవహిస్తున్న వరదనీరు

లవ్‌స్టోరీ @ 1800

నేటికీ సాక్షిగా 'బందరు తాజ్‌మహల్'.. ఓ ఆంగ్లేయ జంట ప్రేమకు చిహ్నం

- పీటర్, అరబెల్లా అపు'రూప' ప్రేమగాథ
- పెళ్లి దాకా చేరకనే విషాదాంతం
- ప్రియురాలికి గుర్తుగా బందర్ మహల్
- ఇప్పటికీ గాజు పెట్టెలో పదిలంగా అరబెల్లా భౌతికకాయం

ఆ రోజుల్లో.. మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన ప్రియురాలు ముంతాజ్ కోసం ఆగ్రాలో తాజ్‌మహల్ నిర్మించారు. ఇది చాలామందికి తెలిసిన విషయమే. అంత అద్భుతమైన కట్టడం కాకపోయినా ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇలాంటి మహల్ ఒకటి ఉంది. రెండు శతాబ్దాల క్రితం బ్రిటిష్ పాలనలో మేజర్ జనరల్ పీటర్ తన ప్రియురాలు అరబెల్లా కోసం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఒక సుందరమైన మహల్‌ను నిర్మించారు. పీటర్ తమ ప్రేమకు చిహ్నంగా నిర్మించిన ఈ మహల్ ఇప్పుడు 'బందరు తాజ్‌మహల్'గా భాసిల్లుతోంది. ఆంగ్లేయుల హయాంలో మాసులీపట్నంగా పిలిచే నేటి బందరులో ఈ ఆంగ్లేయ జంట విషాద ప్రేమగాథకు సాక్షిగా ఈ మహల్ నిలిచింది. అరబెల్లా భౌతికకాయం రసాయనాలతో నిక్షిప్తమై ఒక గాజు పెట్టెలో ఇప్పటికీ భూగర్భంలో ఉంది. పీటర్, అరబెల్లా ఇద్దరూ ఆంగ్లేయులే అయినా వీరి ప్రేమ పెళ్లి దాకా వెళ్లలేదు. పెళ్లి చేసుకోవటానికి వీరు చేసిన పోరాటం ఫలించలేదు. చివరకు ఇద్దరూ సహజీవనం చేసినా ఎక్కువ కాలం సాగలేదు. ఆ రోజులలో పెద్దలతో పాటు మతాధిపతులు, ఆంగ్లేయులు కూడా దీన్ని సహించలేదు. తమ ప్రేమ పెళ్లిగా సాకారం కానందుకు ఇద్దరూ ఎంతో మనోవేదన చెందారు. మనోవ్యథతో అనారోగ్యంపాలై అరబెల్లా.. ప్రియురాలి మరణంతో కోలుకోలేకపోయిన పీటర్ కూడా అనారోగ్యంతో మరణించారు. ఇలా ఈ ఆంగ్లేయ జంట ప్రేమ విషాదంగా ముగిసింది.

అరబెల్లా ప్రేమలో పీటర్

1800ల్లో మచిలీపట్నం (అప్పట్లో మాసులీపట్నం)లో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో బందరుకోట కెప్టెన్ రాబిన్‌సన్ ఆధిపత్యంలో ఉండేది. రాబిన్‌సన్ కుమార్తె అరబెల్లా అందగత్తె. కెప్టెన్ రాబిన్‌సన్ దగ్గర మేజర్ జనరల్‌గా పీటర్ పనిచేసేవారు. సౌందర్యవతి అయిన అరబెల్లాను చూసి ముగ్ధుడైన పీటర్ ఆమెను ప్రేమించారు. తన ప్రేమ ప్రతిపాదనను ఆమెకు పంపారు. అప్పటికే బ్రిటిష్ సైన్యంలో మేజర్ జనరల్ పీటర్ శక్తిసామర్థ్యాల గురించి తెలుసుకున్న అరబెల్లా అతడి ప్రేమ సందేశాన్ని కాదనలేదు. అరబెల్లాను వివాహం చేసుకుందామని పీటర్ ప్రయత్నించారు. కానీ అరబెల్లా తండ్రి కెప్టెన్ రాబిన్‌సన్ ఇందుకు అంగీకరించలేదు. మతాధిపతులు కూడా ఈ వివాహానికి అడ్డుతగిలారు.



అరబెల్లా సమాధి ప్రాంగణం ఉన్న బందర్ తాజ్‌మహల్

నెరవేరని అరబెల్లా కోరిక

అరబెల్లాను వివాహం చేసుకోవాలన్న పీటర్ ఆశ నెరవేరకపోవడంతో ఆమెను తన ఇంటికి ఆహ్వానించారు. ఇద్దరూ భార్యాభర్తలుగా మెలిగారు. సంప్రదాయబద్ధంగా వివాహం చేసుకోకపోవడంతో వీరి ప్రేమను, సహజీవనాన్ని అక్కడివారు ఆమోదించలేదు. పెద్దల సమక్షంలో పీటర్‌ను వివాహం చేసుకోవాలని ఉందని అరబెల్లా ఎన్నోసార్లు తన తల్లిదండ్రులను కోరారు. ఇందుకు వారు అంగీకరించలేదు. కోరుకున్నవిధంగా అందరి సమక్షంలో వివాహం జరగకపోవడం, ప్రియుడు, తండ్రి మధ్య వివాదం ఏర్పడటంతో అరబెల్లా మానసికంగా కుంగిపోయారు. చివరకు అనారోగ్యంతో 1809 నవంబరు 6న తన ప్రేమికుడు పీటర్ చేతిలో ఆమె కన్నుమూశారు.

ఆ బంధం అపు'రూపం'

రెండు శతాబ్దాల క్రితమే పీటర్ టెక్నాలజీని వాడారు. మహల్‌లో అరబెల్లా శిలాఫలకం పక్కనే ఒక మీటను ఏర్పాటు చేశారు. ఆ మీటను నొక్కగానే అండర్ గ్రౌండ్‌లో అరబెల్లా భౌతికకాయం ఉంచిన గాజు పెట్టె పైకి వచ్చేది. అలా అరబెల్లాను చూస్తూ ఆమెతో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ పీటర్ కన్నీరుమున్నీరయ్యేవారు. కొన్నేళ్లకు పీటర్ మద్రాసుకు బదిలీ అయ్యారు. మద్రాసుకు వెళ్లేటపుడు 1819లో తన ప్రేయసి మహల్‌కు సెయింట్ మేరీస్ చర్చిగా పీటర్ పేరు పెట్టారు. మద్రాసుకు వెళ్లాక తీవ్ర అనారోగ్యంతో 1819లో కన్నుమూశారు. అరబెల్లా, పీటర్‌ల ప్రేమగాథ చరిత్రగా మిగిలిపోయింది. ఇప్పటికీ బందరు సెయింట్ మేరీస్ చర్చిలో ప్రతి ఆదివారం సాయంత్రం ప్రార్థనలు జరుగుతాయి.

అరబెల్లా మరణించినా...

బందరుకోట దగ్గర సెయింట్ జాన్స్ స్మశానంలో అరబెల్లా భౌతిక కాయాన్ని సమాధి చేసేందుకు మతపెద్దలు అంగీకరించలేదు. దీంతో అప్పటికప్పుడు పీటర్ ఆనందపేటలో రూ.18 వేలతో 15 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అరబెల్లా భౌతిక కాయం పాడవకుండా ఉండటానికి ఈజిప్ట్ దేశం నుంచి కొన్ని రసాయనాలు, సుగంధ ద్రవ్యాలను తెప్పించారు. ఒక గాజు పెట్టెలో రసాయనాలు, సుగంధ ద్రవ్యాలను పోసి అందులో ఆమె భౌతికకాయాన్ని ఉంచారు. అరబెల్లా సమాధి ఉండే ప్రాంగణాన్ని ఒక అద్భుతమైన సుందర భవనంగా తీర్చిదిద్దారు. 1998లో అరబెల్లా సమాధిని శాశ్వతంగా మూసివేయించారు.

- విజయవాడ/మచిలీపట్నం టౌన్-ఆంధ్రజ్యోతి



ఓరేషన్ అవార్డు అందుకుంటోన్న డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్

డీఎంఈ నరేంద్రకుమార్‌కు ప్రతిష్ఠాత్మక ఓరేషన్ అవార్డు

చిన్నారుల థొరాసిస్ సర్జరీ సేవలకు గుర్తింపు

వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర అభినందనలు

హైదరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పీడియాట్రిక్ థొరాసిక్ సర్జరీ విభాగంలో చేసిన విశేష కృషికి తెలంగాణ వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఏ.నరేంద్ర కుమార్‌ను జాతీయ అవార్డు వరించింది. చిన్న పిల్లలకు వైద్య సేవలు, ముఖ్యంగా సర్జరీల్లో అందించిన సేవలకు ఇండియన్ పీడియాట్రిక్ అసోసియేషన్ ప్రతిష్ఠాత్మక 'ఓరేషన్' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్ సర్జన్ (ఐఏపీఎస్)లో భాగమైన ది సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ థొరాసిస్ సర్జరీ (ఎస్‌పీటీఎస్), మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ చాప్టర్ ఆఫ్ పీడియాట్రిక్ సర్జన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇండోర్‌లో తొలిసారి జరిగిన ఎస్‌పీటీఎస్-2025 జాతీయ సదస్సుకు దేశవ్యాప్తంగా 150 మంది సీనియర్ పీడియాట్రిక్ సర్జన్లు హాజరయ్యారు. ఈ సదస్సులో డాక్టర్ నరేంద్ర కుమార్‌కు ఓరేషన్ అవార్డు ప్రదానం చేశారు. ఓరేషన్ అవార్డు అందుకున్న నరేంద్ర కుమార్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. దేశంలో పీడియాట్రిక్ థొరాసిస్ సర్జరీ విభాగాన్ని ప్రారంభించిన నరేంద్ర కుమార్ కృషితో.. ఇందులో దేశవ్యాప్తంగా ఎంతో మంది నిపుణులుగా ఎదిగారని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్ కొనియాడింది. 25 ఏళ్లుగా అత్యంత స్వల్ప గాట్లతోనే ఎంతో మంది పిల్లలకు శస్త్రచికిత్స చేసి, వారి ప్రాణాలు కాపాడారని ప్రశంసించింది. పీడియాట్రిక్ థొరాసిస్ సర్జరీలో మంచి పేరు సంపాదించుకున్న డాక్టర్ నరేంద్ర కుమార్ 22 వ్యాసాలు ప్రచురించారు.

త్వరలో 'యాదగిరి' ఆధ్యాత్మిక మాసపత్రిక, టీవీ చానల్

ఇకపై సత్యనారాయణస్వామి వ్రత పూజ టికెట్ ధర1000

శ్రీవాణి ట్రస్ట్ తరహాలో 5 వేలతో గరుడ టికెట్లు: ఈవో

యాదగిరిగుట్ట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో వైటీడీ పబ్లికేషన్ సంస్థ తరపున త్వరలోనే 'యాదగిరి' ఆధ్యాత్మిక తెలుగు మాసపత్రిక, టీవీ చానల్‌ను తీసుకురానున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్, ఆలయ ఈవో ఎస్.వెంకట్‌రావు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొండ కింద పార్కింగ్ ప్రాంతంలో వాహన పూజా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రూ.800 ఉన్న సత్యనారాయణస్వామి వ్రత పూజా టికెట్ ధరను రూ.1,000 చేయనున్నట్లు తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం రూ.20 కోట్ల వ్యయంతో 4 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్, 4మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్వామివారి శీఘ్ర దర్శనానికి తిరుమల శ్రీవాణి ట్రస్ట్ మాదిరిగా రూ. 5 వేల విలువైన గరుడ టికెట్లను తీసుకురానున్నట్లు తెలిపారు. టికెట్లు పొందిన భక్తులకు సుప్రభాత సేవ నుంచి రాత్రి శయనోత్సవ వేళ వరకు అంతరాలయ ప్రవేశం కల్పించడంతో పాటు స్వామివారి వేద ఆశీర్వచనం, కండువా, కనుము, అయిదు లడ్డూలు, కిలో పులిహోర, కొండపైకి వాహనం అనుమతించి, ఏ సమయంలోనైనా దర్శించుకునే వీలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించామని, అనుమతులు రాగానే అమలు చేస్తామని తెలిపారు. రూ.3.6 కోట్ల వ్యయంతో 70 అడుగుల పొడవైన ఆంజనేయ, గరుడ, ప్రహ్లాద, రామానుజ, యాదమహర్షి విగ్రహాల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేశామని ఆలయ ఈవో తెలిపారు.

టీటీడీలో నలుగురు అన్యమత ఉద్యోగుల సస్పెన్షన్

తిరుమల, జూలై 19(ఆంధ్రజ్యోతి): టీటీడీలో పనిచేస్తున్న మరో నలుగురు అన్యమత ఉద్యోగులను సస్పెండ్ చేశారు. క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.ఎలిజర్, బర్డ్ ఆస్పత్రి స్టాఫ్ నర్సు ఎస్.రోసీ, గ్రేడ్-1 ఫార్మసిస్ట్ ప్రేమావతి, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీలో పనిచేస్తున్న జి.అసుంతను సస్పెండ్ చేస్తున్నట్టు టీటీడీ శనివారం ప్రకటించింది. టీటీడీలో పనిచేస్తూ వీరు క్రైస్తవమతాన్ని అనుసరిస్తున్నారనే ఆధారాలను విజిలెన్స్ విభాగం సేకరించింది. వీటిని పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. వేలం విభాగంలో పనిచేస్తున్న ఏఈవో రాజశేఖర్‌బాబును కూడా ఇటీవల సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.